

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు



సోమవారం | 13-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 286

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి తె. 3.57 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆర్ద్ర ఉ. 10.38 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.10.27-12.02, దుర్ముహూర్తం: మ.12.45-1.30, మ.2.58-3.42, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం:6.51, సూర్యాస్తమయం: 5.55

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మార్చి 21 నుంచి ఐపీఎల్

మే 25న ఫైనల్
ఉప్పల్‌లో రెండు క్వాలిఫయర్స్

ముంబై: క్రికెట్ ప్రేమికులను అలరించేందుకు ఐపీఎల్ 18వ సీజన్ సిద్ధమవుతోంది. మార్చి 21 నుంచి లీగ్ జరగనుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. ఆదివారం బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం (ఎస్‌జీఎం)లో పాల్గొన్న అనంతరం శుక్లా ఈ విషయాన్ని వెల్లడించాడు. 66 రోజులపాటు జరిగే ఈ లీగ్‌లో ఫైనల్ మే 25న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. అంతకుముందు రెండో ప్లేఆఫ్స్‌ను కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. లీగ్‌లో తొలి రెండు క్వాలిఫయర్స్‌కు మాత్రం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును ఈనెల 18 లేక 19న వెల్లడిస్తామని శుక్లా తెలిపాడు. ప్రస్తుతానికి ఇంగ్లండ్, అఫ్ఘానిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ తమ ప్రాథమిక జట్లను ప్రకటించాయి.


సైకియాను అభినందిస్తున్న హెచ్‌సీఏ చీఫ్ జగన్‌మోహన్ రావు

సైకియా, ప్రభ్‌తేజ్ ఏకగ్రీవంగా..: ఇద్దరు ఆఫీస్ బేరర్ల ఎన్నికే ఎజెండాగా ఆదివారం బీసీసీఐ ఎస్‌జీఎం జరిగింది. ఇందులో బోర్డు నూతన కార్యదర్శిగా అసోం క్రికెట్ సంఘానికి చెందిన దేవజిత్ సైకియా ఎన్నికయ్యాడు. జైషా ఐసీసీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండడంతో అతడి స్థానంలో కొత్త కార్యదర్శి ఎంపిక అనివార్యమైంది. సైకియా ఇప్పటివరకు బోర్డు సంయుక్త కార్యదర్శిగా కొనసాగాడు. అలాగే ఇప్పటిదాకా కోశాధికారిగా ఉన్న ఆశిష్ షెలర్ మహారాష్ట్ర మంత్రి అయ్యారు. దీంతో ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా కోశాధికారిగా ఎన్నికయ్యాడు.

గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ సొబగు

ఖో-ఖో వరల్డ్‌కప్ నేటి నుంచే

- బరిలో 23 దేశాలు
- ఆరంభ పోరులో భారత్‌తో నేపాల్ ఢీ




స్టార్‌స్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లో రాత్రి 8.30 నుంచి

ఖో ఖో.. కొత్త శోభ సంతరించుకుంది. మన గ్రామీణ క్రీడ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అలరించేందుకు ప్రపంచ కప్ రూపంలో వచ్చేసింది. ఈ క్రీడ చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న మెగా టోర్నీ ఆతిథ్యానికి దేశ రాజధాని గ్రాండ్‌గా ముస్తాబైంది. పురుషులు, మహిళల జట్లు పోటీపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ సోమవారం నుంచి వారం పాటు జరగనుంది.

ఇలా ఆడతారు

ప్రతి జట్టులో 12 మంది క్రీడాకారులుంటారు. కోర్టులో మాత్రం తొమ్మిది మంది మాత్రమే ఆడతారు. ఆట స్థితిగతులు బట్టి మిగిలిన ప్లేయర్లు మారుతుంటారు. మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్ ఉంటాయి. ఒకసారి జట్టు చేజ్ చేస్తే మరోసారి తాము చేసిన స్కోరును కాపాడుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆడే క్రీడాకారులను డిఫెండర్, చేజర్, ఆల్‌రౌండర్‌గా విభజిస్తారు.

న్యూఢిల్లీ: ఇటీవల అల్టిమేట్ ఖో ఖో లీగ్‌తో కార్పొరేట్ స్థాయికి ఎదిగిన మన గ్రామీణ క్రీడ ఇక విశ్వవ్యాప్తం కానుంది. ఖో ఖో చరిత్రలో మొదటిసారిగా ప్రపంచకప్ జరుగుతోంది. అంతర్జాతీయ ఖో ఖో సమాఖ్య సహకారంతో భారత ఖో ఖో సంఘం ఈ మెగా టోర్నీని నిర్వహిస్తోంది. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ విశ్వకప్ జరగనుంది. మొత్తం 23 దేశాలు టోర్నమెంట్‌లో తలపడుతున్నాయి. పురుషుల విభాగంలో 20, మహిళల కేటగిరీలో 19 జట్లు బరిలో దిగుతున్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీలు జరుగుతాయి. రెండు విభాగాల్లోనూ ఆయా జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ చేరతాయి. భారత పురుషుల జట్టు నేపాల్, పెరూ, బ్రెజిల్, భూటాన్‌తో కలిసి గ్రూప్-ఏలో, భారత మహిళల జట్టు దక్షిణ కొరియా, ఇరాన్, మలేసియాతో కలిసి గ్రూప్-ఏలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. భారత పురుషుల జట్టుకు తెలుగు యోధాస్ కెప్టెన్, మహారాష్ట్ర ఆటగాడు ప్రతీక్ కిరణ్, మహిళల జట్టుకు ప్రియాంక ఇంగ్లే సారథ్యం వహించనున్నారు. పురుషుల జట్టులో ఏపీ క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డికి ఆల్‌రౌండర్‌గా చోటు లభించగా, వికారాబాద్ కుర్రాడు విశ్వనాథ్ జానకిరామ్ స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు. ఈ విశ్వకప్‌లో భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సోమవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు నేపాల్‌తో తలపడనుంది. భారత మహిళల జట్టు తమ తొలి మ్యాచ్‌ను మంగళవారం దక్షిణకొరియాతో ఆడనుంది.



టోర్నీలో తెలుగు తేజం

పోతిరెడ్డి శివారెడ్డి.. ఖో ఖో వరల్డ్‌కప్‌లో ఆడే భారత జట్టులో చోటు దక్కించుకున్న ఏకైక తెలుగోడు. శివారెడ్డి స్వస్థలం ఏపీలోని బాపట్ల జిల్లా, ముండ్లమూరు మండలం, ఈదర గ్రామం. శివారెడ్డిది రైతు కుటుంబం. తండ్రి గురువారెడ్డి, తల్లి కోటేశ్వరమ్మ. ఆర్థిక సమస్యలతో కెరీర్ ప్రారంభంలో శివారెడ్డి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, ఆటే లక్ష్యంగా ముందుకు సాగాడు. తొలిసారిగా 2018లో జాతీయ జట్టుకు ఎంపికైన అతను.. తనదైన ప్రతిభతో అనతికాలంలోనే జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. అల్టిమేట్ ఖో-ఖో లీగ్ తొలి సీజన్‌లో ముంబై ఖిలాడీస్, నిరుడు గుజరాత్ జెయింట్స్ జట్టు తరఫున శివారెడ్డి ఆడాడు. కోచ్‌లు కాశీవిశ్వనాథ్ రెడ్డి, సీతారామరెడ్డి ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చిన తాను.. ఈ వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడమే తన లక్ష్యమని ఆంధ్రజ్యోతితో శివారెడ్డి తెలిపాడు.



శౌరా..ఇరా!

157 బంతుల్లో 346

అండర్-19 క్రికెట్‌లో త్రిశతకంతో చరిత్ర

ఆలూరు (బెంగళూరు): పద్నాలుగేళ్ల ముంబై ఓపెనర్ ఇరా జాదవ్ చరిత్ర సృష్టించింది. అండర్-19 క్రికెట్‌లో త్రి శతకం చేసిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనత అందుకుంది. మేఘాలయా జట్టుతో ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ మ్యాచ్‌లో ఇరా ఈ ఫీట్ నమోదు చేసింది. కేవలం 157 బంతుల్లో 42 ఫోర్లు, 16 సిక్సర్లతో జాదవ్ అజేయంగా 346 పరుగులు కొల్లగొట్టింది. కాగా.. మహిళల అండర్-19 క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు మాత్రం సౌతాఫ్రికాకు చెందిన లిజెల్లీ లీ (427 నాటౌట్, 2010) పేరిట ఉంది. ఇక.. కెప్టెన్ హర్లీ గాలా (116)తో కలిసి రెండో వికెట్‌కు ఇరా 274 పరుగులు జత చేసింది. అనంతరం దీక్షా పవార్ (39)తో కలిసి మూడో వికెట్‌కు 186 పరుగులు జాదవ్ జోడించింది. దాంతో ముంబై 50 ఓవర్లలో 563/3 స్కోరు చేసింది. అత్యంత భారీ లక్ష్య ఛేదనలో మేఘాలయ 25.4 ఓవర్లలో 19 పరుగులకే ఆలౌటైంది. సచిన్, కాంబ్లీ, అజిత్ అగార్కర్‌లాంటి మేటి క్రికెటర్లు చదివిన శారదాశ్రమ్ విద్యామందిర్ విద్యార్థిని అయిన ఇరా..గత నెలలో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగలడం గమనార్హం.

సబలెంక, జ్వెరెవ్ శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంక, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంక 6-3, 6-2తో స్లోన్ స్టీఫెన్స్‌పై అలవోకగా నెగ్గింది. చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(3), 6-1తో అంకా తొడోనిను, 11వ సీడ్ పౌలా బడోసా 6-3, 7-6(5)తో వాంగ్ జిన్‌ను, ఆంద్రీవ 6-3, 6-3తో బజ్కోవాను, డోనా వెకిక్ 6-4, 6-4తో డయానిను ఓడించి రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. పురుషుల్లో జ్వెరెవ్ 6-4, 6-4, 6-4తో లూకాస్‌పై, ఆరో సీడ్ కాస్పర్ రూడ్ 6-3, 1-6, 7-5, 2-6, 6-1తో మునార్‌పై గెలిచి నెగ్గారు.

నగాల్‌కు నిరాశ: భారత ఆటగాడు సుమీత్ నగాల్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. 26వ సీడ్ థామస్ మచాక్‌తో పోరులో నగాల్ 3-6, 1-6, 5-7తో వరుస సెట్లలో పరాజయం పాలయ్యాడు.

హజారే సెమీస్‌లో విదర్భ, హరియాణా

వడోదర: విదర్భ, హరియాణా జట్లు విజయ్ హజారే ట్రోఫీలో సెమీఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రాజస్థాన్‌ను విదర్భ, గుజరాత్‌ను హరియాణా ఓడించాయి. బుధవారం జరిగే సెమీస్‌లో కర్ణాటకతో హరియాణా, మహారాష్ట్రతో విదర్భ తలపడతాయి.




పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్

చండీగఢ్: టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కొత్త కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈమేరకు జట్టు యాజమాన్యం ఆదివారం అతడి పేరును ప్రకటించింది. గత నవంబరు మెగా వేలంలో శ్రేయా‌స్‌ను అత్యంత భారీ మొత్తం రూ.26.75 కోట్లు వెచ్చించి పంజాబ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో అతడినే సారథిగా నియమిస్తారని అంచనా వేశారు. 2024లో శ్రేయాస్ కెప్టెన్సీలోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ గెలిచింది. 'జట్టు నాపై నమ్మకం ఉంచడాన్ని గౌరవంగా భావిస్తున్నా. కోచ్ పాంటింగ్‌తో కలిసి మరోసారి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా' అని అయ్యర్ స్పందించాడు. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ హెడ్ కోచ్‌గా ఉన్న సమయంలో శ్రేయాస్ ఆ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వారిద్దరి ఆధ్వర్యంలో ఆ సీజన్‌లో ఢిల్లీ టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచింది.

జెమీమా సెంచరీ

రెండో వన్డేలోనూ ఐర్లాండ్ చిత్తు


భారతదే సిరీస్
జెమీమా (102)

రాజ్‌కోట్: టాపార్డర్ బ్యాటర్లంతా ధనాధన్ బ్యాటింగ్‌తో అదరగొట్టారు. జెమీమా రోడ్రిగ్స్ (102) తొలి అంతర్జాతీయ శతకం నమోదు చేయగా, హర్లీన్ డియోల్ (89) కొద్దిలో సెంచరీ చేజార్చుకుంది. ఇక కెప్టెన్ మంధాన (73) తన జోరు కొనసాగించగా, యువ క్రీడాకారిణి ప్రతికా రావల్ (67) మరో అర్ధ హాఫ్ సెంచరీతో భళా అనిపించింది. దాంతో ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 116 పరుగులతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే మిగిలుండగానే కైవసం చేసుకుంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 370/5 స్కోరు చేసింది. భారీ ఛేదనలో ఐర్లాండ్ 50 ఓవర్లలో 254/7 స్కోరుకే పరిమితమైంది. క్రిస్టినా (80) అర్ధ శతకంతో సత్తా చాటింది.

47 ఏళ్లలో తొలిసారి..: 1978లో ఇంగ్లండ్‌పై భారత మహిళల జట్టు తొలి వన్డే ఆడింది. ఆ క్రమంలో 47 ఏళ్ల తర్వాత మన జట్టు మొదటిసారి వన్డేలలో 370 పరుగుల మార్క్‌ను అందుకొని రికార్డు సృష్టించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 370/5 (జెమీమా 102, హర్లీన్ 89, మంధాన 73, ప్రతిక 67, ప్రెండెర్‌గాస్ట్ 2/75, కెల్లీ 2/82).
ఐర్లాండ్: 50 ఓవర్లలో 254/7 (క్రిస్టినా 80, సారా 38, డెలానీ 37, దీప్తి శర్మ 3/37, ప్రియ 2/53).

బిజినెస్

23,750 పైన బుల్లిష్

(జనవరి 13-17 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,089-23,344 పాయింట్ల మధ్యన కదలాడి 537 పాయింట్ల నష్టంతో 23,432 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,548, 23,753, 23,749, 24,095 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,750
బ్రేక్‌డౌన్ స్థాయి: 23,200
నిరోధ స్థాయిలు: 23,650, 23,750, 23,850 (23,550 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,225, 23,125, 23,025 (23,325 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	111
వరంగల్	104	గుంటూరు	110
కరీంనగర్	104	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	90
కర్నూలు	104	నెల్లూరు	95
విశాఖపట్నం	107	అనంతపురం	95
గోదావరి	111		



ఎయిర్ ఇండియాకు 'రూపాయి' కష్టాలు

ఖర్చులు పైపైకి.. లాభాలు కిందికి



న్యూఢిల్లీ: డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను భయపెడుతోంది. దీంతో ఖర్చులు పెరిగి లాభాలకూ గండి పడుతుందని కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) నిపుణ్ అగర్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. డాలర్‌తో రూపాయి పతనం ఎయిర్ ఇండియాకే గాక, ఇతర విమానయాన సంస్థలకూ నష్టమేనన్నారు. ఉద్యోగుల జీతాలు తప్ప.. తమ ఇతర ఖర్చులన్నీ డాలర్లలో ఉండడం ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే విదేశాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి విదేశీ కరెన్సీలలో వసూలు చేసే టిక్కెట్ల చార్జీలు కొంతలో కొంత తమను ఆదుకునే అవకాశం ఉందన్నారు. దీనికి తోడు ఖర్చులు తగ్గించుకోవడం, ఇతర చర్యల గురించీ ఆలోచిస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు.

ప్రీమియం సీట్లపై దృష్టి

ఆదాయం పెంచుకోవడంపైనా ఎయిర్ ఇండియా దృష్టి పెట్టింది. ఇందుకోసం వైడ్ బాడీ విమానాల ముందు భాగంలో బిజినెస్, ఎకానమీ ప్రీమియం సీట్ల సంఖ్య రెట్టింపు చేస్తున్నట్టు అగర్వాల్ తెలిపారు. మరో రెండేళ్లలో తమకు అందే ఎయిర్‌బస్ ఏ350-1000 తరహా విమానాల్లో బోయింగ్ 777 విమానాల్లో ఉన్నట్టుగా ఫస్ట్ క్లాస్ సీట్లు ప్రవేశ పెట్టబోతున్నట్టు చెప్పారు. అగ్రశ్రేణి విమానయాన సంస్థలతో పోటీపడాలంటే తమ విమానాల్లోనూ ఫస్ట్ క్లాస్ సీట్లు పెంచుకోక తప్పదన్నారు.

ఉద్యోగాల తీసివేతలు ఉండవు

మైక్రోసాఫ్ట్ ఇండియా

న్యూఢిల్లీ: భారత్‌లోని తన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఇండియా చల్లటి కబురు చెప్పింది. ఈ సంవత్సరం భారత్‌లో ఎవరినీ ఉద్యోగాల నుంచి తొలగించే ఆలోచన లేదని మైక్రోసాఫ్ట్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉంటే అందులో 20,000 మంది భారత్‌లో ఉన్నారు. పనితీరు ఆధారంగా తన మొత్తం ఉద్యోగుల్లో ఒక శాతం మందిని తీసివేయాలని కంపెనీ నిర్ణయించింది. ఈ ప్రభావం భారత్‌లోని ఉద్యోగులపైనా పడుతుందని భయపడ్డారు. అయితే అదేమీ లేదని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ ప్రకటించడంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు కృత్రిమ మేథ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ కోసం మరింత మంది ఉద్యోగులను నియమించుకుంటామని పునీత్ చెప్పడం విశేషం.

ఓయో షేర్లపై బాలీవుడ్ సెలబ్రిటీల ఆసక్తి

న్యూఢిల్లీ: రితేశ్ అగర్వాల్ స్థాపించిన ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ కంపెనీ షేర్లపై బాలీవుడ్ ప్రముఖులు ఆసక్తి చూపిస్తున్నారు. మాధురీ దీక్షిత్, అమృతా రావు, నిర్మాత, షారూఖ్ ఖాన్ సతీమణి గౌరీ ఖాన్ గడిచిన కొద్ది నెలల్లో పెద్ద మొత్తంలో ఈ కంపెనీ షేర్లను కొనుగోలు చేశారు. గత ఏడాది ఆగస్టులో ముగిసిన సిరీస్ జీ ఫండింగ్‌లో భాగంగా గౌరీ ఖాన్ ఏకంగా 24 లక్షల షేర్లు కొనుగోలు చేశారు. ఈ సిరీస్ జీ ఫండింగ్ ద్వారా ఓయో హోటల్స్ గత ఏడాది వివిధ మదుపరుల నుంచి దాదాపు రూ.1,400 కోట్లు సమీకరించింది. మాధురీ దీక్షిత్, ఆమె భర్త డాక్టర్ శ్రీరామ్ నెనె, మరో డాక్టర్ రితేష మాలిక్‌తో కలిసి మరో 20 లక్షల షేర్లు కొనుగోలు చేశారు. అమృతా రావు, ఆమె భర్త కూడా సెకండరీ మార్కెట్ నుంచి పెద్ద మొత్తంలోనే ఓయో షేర్లు కొన్నట్టు సమాచారం. కాగా ఓయో గత ఏడాది పబ్లిక్ ఇష్యూకి వస్తున్నట్టు ప్రకటించింది.

ఇండెక్స్ షేర్లపై సెబీ నిఘా

న్యూఢిల్లీ: ఇండెక్స్‌ల్లో అధిక వెయిటేజీ ఉన్న షేర్ల లావాదేవీలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిశితంగా గమనిస్తోంది. క్యాష్ సెగ్మెంట్‌లో ఎవరైనా ఈ షేర్లలో అక్రమాలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకునేందుకు ఈ నిఘా పెట్టినట్టు సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్ చెప్పారు. క్యాష్ మార్కెట్లో ఎవరైనా ఈ షేర్లలో అక్రమాలకు పాల్పడితే అది మార్కెట్ ఆటుపోట్లకు దారితీసి, ఆ ప్రభావం డెరివేటివ్ మార్కెట్‌పైనా పడుతుందన్నారు. హెడ్జింగ్ లేదా అధిక లాభాల కోసం, క్యాష్ అండ్ డెరివేటివ్స్ మార్కెట్లో బెట్స్ తీసుకోవడం అసాధారణం కాకపోయినా ఆ పేరుతో 'పంప్ అండ్ డంప్' కార్యకలాపాలపై మాత్రం నిఘా ఉంచినట్టు నారాయణ్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	



లిథియం కోసం అర్జెంటీనాలో అన్వేషణ

కోల్ ఇండియా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఇతర ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిపైనా దృష్టి పెట్టింది. ప్రస్తుతం బొగ్గుకు మాత్రమే పరిమితమైన ఈ మహా నవరత్న కంపెనీ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ దేశాల్లో లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి అరుదైన లోహాల అన్వేషణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అర్జెంటీనాలో లిథియం ఖనిజ అన్వేషణలో తోడ్పడే టెక్నికల్ కన్సల్టెంట్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్స్ ఆహ్వానించింది. విద్యుత్ వాహనాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల్లో లిథియం ప్రధాన ముడి పదార్థం. ప్రస్తుతం మన దేశం ఈ ఖనిజాన్ని లేదా బ్యాటరీలను పెద్దఎత్తున దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. విదేశాల్లో లిథియం గనులను చేజిక్కించుకోవడం ద్వారా చైనా లేదా ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించుకోవచ్చని కోల్ ఇండియా భావిస్తోంది.

ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే నిఫ్టీ 200 ఎస్ఎంఏ కిందకు వచ్చింది. జీవితకాల గరిష్ఠం నుంచి 11 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన 23,431 పాయింట్ల స్థాయి కన్నా దిగజారితే మీడియం టర్మ్ డౌన్‌ట్రెండ్ మొదలయ్యే ప్రమాదం ఉంది. గత వారం ఐటీ మినహా అన్ని రంగాల సూచీలు పతనమయ్యాయి. ఎఫ్ఎంసీజీ విభాగం కొద్దిగా మెరుగ్గా కనిపిస్తోంది. బడ్జెట్ సమీపిస్తుండటంతో మార్కెట్లు మరింత ఆటుపోట్లు ఎదుర్కొనే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌సీఎల్ టెక్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. టెయిల్ విండ్ సెక్టార్ కావటం అనుకూలం. చివరి మూడు సెషన్లలోనే ఈ షేరు 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం 3.12 శాతం లాభంతో రూ.1,995 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,990 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,960 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: గత ఏడాది సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు 30 శాతం మేర దిద్దుబాటుకి లోనైంది. ప్రధాన మద్దతు స్థాయి రూ.1,400 వద్ద నుంచి అక్యుములేషన్ మొదలైంది. ఒడుదొడుకులు తగ్గాయి. బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ ఈ కౌంటర్ పటిష్ఠతను ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.1,478 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,450 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,420 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ యూనీలివర్: ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఎఫ్ఎంసీజీ రంగం మాత్రమే ఆశాజనకంగా కనిపిస్తోంది. సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో 25 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.2,300 స్థాయిలో మద్దతు లభించింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,442 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,400 శ్రేణిలో ప్రవేశించి రూ.2,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,360 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మారికో: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. నష్టాల మార్కెట్లోనూ దూకుడుగా ముందుకు సాగుతోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత మంచి కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కీలకమైన రూ.600 స్థాయి కన్నా పైన చలిస్తోంది. చివరి మూడు సెషన్లలో ఈ షేరు 10 శాతం పెరిగింది. గత శుక్రవారం రూ.673.90 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.635 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బ్రిటానియా: గత అక్టోబరులో జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు ద్వితీయ త్రైమాసిక ఫలితాల అనంతరం కుప్పకూలింది. 26 శాతం కరెక్షన్ జరిగిన తర్వాత ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది. డిసెంబరు చివరి వారం నుంచి జోరును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.4,939 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,900 వద్ద పొజిషన్ తీసుకుని రూ.5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మద్దతు స్థాయిలు 23,250, 23,000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 24,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం అంతా డౌన్‌ట్రెండ్‌లోనే ట్రేడవుతూ 570 పాయింట్ల నష్టంతో 23,430 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయి 23,500 వద్ద రెండు నెలల పాటు సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం ఆ స్థాయిలో నిలదొక్కుకోవడంలో విఫలమైంది. అంతకన్నా దిగువనే క్లోజ్ కావడం మరింత అప్రమత్తతను సూచిస్తోంది. గత మూడు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లోనే ఉన్న మార్కెట్ ఇటీవలి గరిష్ఠ స్థాయిల నుంచి 3,000 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 3,350 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 1,400 పాయింట్లు నష్టపోయాయి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లో భారీ పతనం కారణంగా ఈ వారంలో మార్కెట్ మరింత బలహీనత ప్రదర్శించవచ్చు. సోమవారం ఏర్పడవచ్చునుకుంటున్న ఇంట్రాడే రియాక్షన్ అనంతరం మార్కెట్ పునరుజ్జీవం సాధిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ ప్రధాన మద్దతు స్థాయి 23,250 (గతంలో ఏర్పడిన మేజర్ బాటమ్) చేరువకు వస్తోంది. సానుకూలత కోసం మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవాలి. రికవరీ బాట పట్టినట్టయితే స్వల్పకాలిక సానుకూలత కోసం ప్రధాన నిరోధం 23,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 23,250 వద్ద పునరుజ్జీవం సాధించాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద కన్సాలిడేట్ కావచ్చు. ఇక్కడ కూడా విఫలమైతే మరింత అప్రమత్తత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ అంతకు ముందు వారంతో పోల్చితే 2,250 పాయింట్లు నష్టపోయి 48,730 వద్ద ముగిసింది. గత మూడు నెలల కాలంలో కీలక స్థాయి 50,000 వద్ద ఎన్నో సార్లు రికవరీకి సాధించిన సూచీ చివరికి అంతకన్నా దిగువకు పడిపోయింది. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి, మానసిక అవధి 48,000.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. ఇది మరింత అప్రమత్త సంకేతం. ప్రస్తుతం 23,250 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. మార్కెట్ ఇప్పుడు 50 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,440, 23,500
మద్దతు	23,300, 23,250

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు

సోమవారం | 13-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 286

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

కమలగా మారిన పావెల్ జాబ్స్

స్టీవ్ జాబ్స్ సతీమణికి గోత్రాన్ని ఇచ్చి కూతురిగా ప్రకటించిన నిరంజని అఖాడా కైలాసానంద్ గిరి

అనంతరం విశ్వనాథుడిని దర్శించుకున్న కమల

10

ప్రయాగ్‌రాజ్ వద్ద గంగానదిలో భక్తుల పుణ్య స్నానాలు



నేటి నుంచే మహా కుంభమేళా!

గురువుల్లేని వైద్య కళాశాలలు

సర్జరీ చేయలేని డాక్టర్లు!







మంచిర్యాలలో గోదాముల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల; మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో ఓ భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల

- ఇబ్బడిముబ్బడిగా కొత్త మెడికల్ కాలేజీలు.. అడ్డగోలుగా ఎన్‌ఎంసీ అనుమతులు
- షెడ్లు, గోదాముల్లో తరగతులు.. కొత్త కాలేజీలకు ప్రొఫెసర్లు దొరక్క అవస్థలు
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో గురువుల కొరత.. రోగులు, సర్జరీలు అంతా మాయే
- ప్రైవేటులో నకిలీ వేలిముద్రలతో 'అధ్యాపకుల' హాజరు
- నైపుణ్యం లేకుండానే ఎంబీబీఎస్ పూర్తి.. చిన్న సర్జరీ చేయాలన్నా పరేషాన్!
- ఎంబీబీఎస్‌లు, పీజీలు చేసినోళ్లకూ వణుకుతున్న చేతులు
- వైద్య విద్యలో కొరవడుతున్న నాణ్యత.. నిరుద్యోగులుగా మారుతున్న వైద్యులు
- దేశంలో వెయ్యి మందికి ఓ వైద్యుడు.. తెలుగు రాష్ట్రాల్లో 681 మందికి ఓ డాక్టర్
- త్వరలో ఇంజనీరింగ్ మాదిరిగానే వైద్యవిద్య మారుతుందన్న ఆందోళన

ఆసిఫాబాద్ వైద్య కళాశాల పరిస్థితి ఘోరంగా తయారైంది. ఇక్కడ పని చేసేందుకు అధ్యాపకులు రావడం లేదు. 27 మంది ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా ఇద్దరే ఉన్నారు. 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను ఒక్కరే పని చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ 58 పోస్టులకు గాను 54 ఖాళీగా ఉన్నాయి. అమ్మాయిల వసతి గృహాన్ని మార్కెట్ కమిటీ కార్యాలయంలో, అబ్బాయిలకు పాత డీఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇంజనీరు, డాక్టరు చదువంటే గతంలో గొప్ప.. ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం ఉండేది! ఫలానా వాళ్ల పిల్లలు ఇంజనీరింగ్ చదువుతున్నారు.. మెడిసిన్ చదువుతున్నారు.. అంటూ గొప్పగా చెప్పుకొనేవారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి కొలువులూ దొరికేవి. అలాంటి ఇంజనీరింగ్ విద్యలో క్రమంగా నాణ్యత తగ్గిపోయింది! ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఇబ్బడిముబ్బడిగా ఇంజనీరింగ్ కాలేజీలు పెట్టడంతో సాంకేతిక విద్యలో నాణ్యత కొరవడింది. బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రస్తుతం చిన్న చిన్న ఉద్యోగాలు.. చివరికి డెలివరీ బాయ్స్‌గాను, క్యాబ్ డ్రైవర్లగానూ పనిచేస్తున్నారు. చాలా మందికి అలాంటి ఉపాధి కూడా దొరకడం లేదు! ఇప్పుడు వైద్య విద్య పరిస్థితి కూడా దాదాపు ఇలాగే తయారయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజలు దేవుళ్లుగా భావించే

మిగతా 11వ పేజీలో...



ప్రభుత్వం నిర్మించనున్న ఫైవ్ స్టార్ హోటల్ నమూనా చిత్రం

సర్కారీ స్టార్ హోటల్!

- 582 కోట్లతో ఫైవ్ స్టార్ హోటల్‌ను నిర్మించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- అందులోనే ఏ-గ్రేడ్ ట్రేడ్ సెంటర్
- 3 ఎకరాల్లో.. 15 అంతస్తులుగా
- రాయదుర్గంలోని ఐకియా పక్కన..
- పలు దేశాల కంపెనీల వ్యాపార, వాణిజ్య లావాదేవీలకు కేంద్రంగా..
- టైమ్‌స్క్వేర్, టీ-వర్క్స్ భవనాలతో అండర్‌గ్రౌండ్ అనుసంధానం
- టెండర్లు ఆహ్వానించిన టీజీఐఐసీ
- ఫిబ్రవరి 13 వరకు బిడ్‌కు అవకాశం
- ఒప్పందం తర్వాత 3 ఏళ్లలో పూర్తి

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సైబర్ టవర్స్‌కు కూతవేటు దూరంలో.. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు పెట్టని కోటగా ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు సమీపంలో.. మరో అద్భుత కట్టడం రాబోతోంది. హైదరాబాద్‌ను ప్రపంచ నగరంగా మార్చడంతోపాటు పరిశ్రమలను తీసుకురావడం, అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించే ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఏ-గ్రేడ్ వాణిజ్య కేంద్రం (ట్రేడ్ సెంటర్)తో కూడిన ఫైవ్ స్టార్ హోటల్‌ను నిర్మించనుంది. ఇప్పటికే టీ-వర్క్స్, టైమ్-స్క్వేర్‌ను నిర్మించ తలపెట్టిన

మిగతా 9వ పేజీలో...

పాకిస్థాన్‌లో 33 టన్నుల బంగారం నిక్షేపాలు!

- సింధు నది లోయలో గుర్తింపు
- విలువ రూ.18 వేల కోట్లకు పైనే..
- వెలికి తీసేందుకు కసరత్తు

ఇస్లామాబాద్, జనవరి 12: తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌లో 'బంగారం' పంట పండింది. ఆ దేశంలోని పంజాబ్ ప్రావిన్స్ అటోక్ జిల్లాలో విస్తరించి ఉన్న సింధు నది లోయలో భారీగా బంగారం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 32.6 మెట్రిక్ టన్నుల బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్థాన్ (జీఎస్‌పీ) వెల్లడించింది. వీటి విలువ రూ.18 వేల కోట్లకు పైనే (600 బిలియన్ పాకిస్థానీ రూపాయలు) ఉంటుందని

మిగతా 10వ పేజీలో...



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణం బాంబులు

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

ఐదుగురు నక్సల్స్ మృతి

- 5 తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్ సీజ్
- నారాయణపూర్ జిల్లాలో భారీ డంప్
- వాటిలో భారీగా బాణం బాంబులు
- సుక్మాలో ఐఈడీ పేలి బాలికకు గాయాలు

10



నీది ఏ పార్టీ?

- ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్‌కుమార్ మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష రసాభాస
- సంజయ్ మాట్లాడుతుండగా అడ్డుకున్న కౌశిక్.. నీది ఏ పార్టీ అంటూ నిలదీత
- రాజీనామా చేసి గెలవాలని సవాల్
- నువ్వే పార్టీ నుంచి వచ్చావన్న సంజయ్

9



ఉనిక పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ, బండి, శ్రీధర్‌బాబు

విద్యార్థి రాజకీయాలు చారిత్రక అవసరం

- సైద్ధాంతిక భావజాలం లేనందునే ఫిరాయింపులు
- యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నాం
- ఎవరు సలహాలిచ్చినా స్వీకరించేందుకు సిద్ధం
- విద్యాసాగర్‌రావు సహకారం రాష్ట్రానికి అవసరం
- కేంద్ర మంత్రులు సహకరించాలి: సీఎం రేవంత్
- హైడ్రా.. అభినందనీయం: విద్యాసాగర్‌రావు
- విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనిక' ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారంటే.. ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా.. నమ్మిన

మిగతా 12వ పేజీలో...

'భూ భారతి' భూములకే భరోసా.. తెలుగులో జీవో

కాలిఫోర్నియా కార్చిచ్చు



కార్చిచ్చు ఆర్పడానికి హెలికాప్టర్‌తో నీళ్లు కుమ్మరిస్తున్న దృశ్యం

హాలీవుడ్ ప్రముఖులపై ప్రజాగ్రహ జ్వాల

- నీటి కొరత కారణంగా అదుపులోకి రాని మంటలు.. ఇళ్లను కాపాడుకోవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న హాలీవుడ్ ప్రముఖులు
- ప్రైవేటు ఫైర్ ఫైటర్లకు గంటకు 2వేల డాలర్లు ఇస్తున్న వైనం
- నీటి కొరతకు సెలబ్రిటీలే కారణమంటూ ప్రజల ఆగ్రహం
- గతంలో నిబంధనలు ఉల్లంఘించి తోటలకు నీటిని అడ్డగోలుగా వాడారని ఆరోపణ
- 12 వేలకు పైగా నిర్మాణాల దగ్ధం
- మరో 57 వేల ఇళ్లకు ముప్పు!



కార్చిచ్చు కారణంగా తగలబడిన చెట్లు, ఇళ్ల సముదాయం

లాస్‌ఏంజెలెస్: ఎటుచూసినా ఎగసిపడుతున్న మంటలు! నలువైపుల నుంచీ చుట్టుముడుతున్న కార్చిచ్చు!! కాల్చే వేడి.. కమ్మేస్తున్న పొగ.. దావాగ్ని ధాటికి దారిలో ఉన్నవన్నీ దగ్ధమై తెల్లటి మంచులా కురుస్తున్న బూడిద! హాలీవుడ్ తారలు నివసించే చోటుగా, 'సిటీ ఆఫ్ ఏంజెల్స్'గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లాస్‌ఏంజెలెస్‌లో ప్రస్తుత పరిస్థితి ఇది!! కాలిఫోర్నియా రాష్ట్రంలో ఆరు చోట్ల దావానలం రగలగా.. వాటిలో

మిగతా 10వ పేజీలో...

కూసుమంచిలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లు



ఇందిరమ్మ నమూనా ఇల్లు రెడీ!

- ఖమ్మం కూసుమంచిలో పూర్తయిన నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఖమ్మం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదటి ఇందిరమ్మ నమూనా ఇల్లు సిద్ధమైంది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో నిర్మితమైన ఈ ఇంటిని గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం ఏడు గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో అర్హులను సర్వే ద్వారా గుర్తిస్తున్న ప్రభుత్వం రూ.5 లక్షల వ్యయంతోనే ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను

మిగతా 12వ పేజీలో...

కొంచెం.. తిని పెంచమ్మా!



- అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి
- నటి అన్షూని ఉద్దేశించి దర్శకుడు త్రినాథరావు వివాదాస్పద వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్.. నెటిజన్ల ఫైర్
- ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని డిమాండ్

8

మందా జగన్నాథం కన్నుమూత

9



- అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి
- 22 రోజులుగా కొనసాగిన చికిత్స
- ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి
- నాలుగుసార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా సేవలు
- ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యతలు
- సీఎం రేవంత్, చంద్రబాబు, కేసీఆర్ సంతాపం



నల్లగొండ జిల్లా కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

ఎలాగైనా ఊరెళ్తాం

- మూడు రోజుల్లో ఏపీ వైపునకు 60 వేలకు పైగా బైక్‌లు
- బస్సులు, రైళ్లలో చార్జీల మోత.. తాళలేక బైక్‌లపై సొంతూళ్లకు
- కార్లలోనూ పలువురి ప్రయాణం.. టోల్‌గేట్ల వద్ద బారులు
- సంక్రాంతి ప్రభావంతో హైదరాబాద్ రహదారులు ఖాళీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎలాగైనా పండగకి ఇంటికి వెళ్లాలి.. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చెయ్యాలి.. సొంతూరిని వదిలి ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారి ఆలోచన ఇది. దీనిని వ్యాపార వస్తువుగా మార్చుకున్న రవాణా సంస్థలు ప్రత్యేక సర్వీసుల పేరిట చార్జీల మోత

మిగతా 12వ పేజీలో...




బైక్‌లపై ఏపీకి వెళుతున్న యువత

బొమ్మలు: అక్బర్

నవలా శిల్పం

అంపశయ్య నవీన్

‘అంపశయ్య’ను టెక్నిక్ కోసం రాయలేదు



నాటి నూతన సహస్రాబ్ది సందర్భంలో వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో వెలువడిన వేలాది గ్రంథాల్లోంచి వంద అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రచురించాలని సంకల్పించి అబ్బూరి ఛాయాదేవి, బి.ఎస్.రాములు, చందు సుబ్బారావు, చేకూరి రామారావు, కేతు విశ్వనాథరెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, వేగుంట మోహనప్రసాద్ వంటి హేమాహేమీలతో ఒక కమిటీని ఏర్పరచి వాళ్ళ ఏకీకృత అభిప్రాయంతో వంద అత్యుత్తమ గ్రంథాలను ‘ఆంధ్రజ్యోతి’ ప్రకటించినపుడు ‘అంపశయ్య’ నవల 49వ స్థానంలో నిలిచింది. మొదటి నవలతోనే అంతటి అసాధారణ గౌరవాన్ని పొంది, ఆ నవల పేరునే ఇంటిపేరుగా చేసుకుని, తర్వాత మరెన్నో నవలలతో విశిష్ట నవలాకారుడిగా తెలుగు సాహిత్యంలో స్థానాన్ని సుస్థిరం చేసుకున్న ‘అంపశయ్య’ నవీన్‌తో ఆయన నవలల గురించి జరిపిన సంభాషణ ఇది.

మీ నవలల్లో ‘అంపశయ్య’కు ఎలాంటి స్థానం ఇస్తారు?

నేను రాసిన 35 నవలల్లో ఈ నవలకే మొదటి స్థానం ఇస్తాను. ఆరంభ యౌవనంలో అడుగుపెట్టిన యువతీయువకుల మైండ్స్‌ని ఈ నవల శోధించినంత నిశితంగా, లోతుగా, నిర్భయంగా శోధించిన నవల తెలుగులో మరొకటి లేదనే నా అభిప్రాయం.

‘అంపశయ్య’ను తెలుగులో చైతన్య స్రవంతి శైలిలో రాయబడిన మొదటి నవలగా పేర్కొంటారు. అదే శైలిలో రాసిన జేమ్స్ జాయ్స్, వర్జీనియా వుల్ఫ్ వంటి పాశ్చాత్య రచయితల ప్రభావాలు మీపై ఉన్నాయా?

‘అంపశయ్య’ రాయడం సగం పూర్తి చేసేంతవరకు నాకు ‘చైతన్య స్రవంతి’ అనేది ఒకటుందని, ఆ శిల్పంతో జేమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్ రచనలు చేశారని తెలియనే తెలియదు. నేను నల్గొండ కాలేజీలో పనిచేస్తున్న రోజుల్లో సీతారామారావు అనే కామర్స్ లెక్చరర్ ఉండేవాడు. ఆయనకు సాహిత్యం మీద చాలా ఇంట్రస్ట్ ఉండేది. మేమంతా ఆయన చుట్టూ చేరి ఆయన చెప్పే సాహిత్యానికి సంబంధించిన కబుర్లని ఆసక్తిగా వింటూండేవాళ్ళం. నాకప్పుడు నేను రాస్తున్న ఈ నవల గురించి ఈయన ఏమంటాడో చూద్దామనిపించి సగం రాసిన నవలను అతనికిచ్చాను. దాన్ని చదివి “మీరు కొత్త టెక్నిక్‌తో రాస్తున్నారు. దీన్ని ‘చైతన్య స్రవంతి’ లేదా ‘స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్’ అంటారని మీకు తెలుసా” అన్నాడు. తెలియదన్నాను. “ఇదే టెక్నిక్‌తో జేమ్స్ జాయిస్ ‘యులిసెస్’ అనే గొప్ప నవలను రాశాడు. దీన్ని మన కాలేజీకి నేనే తెప్పించాను. ఓ పట్టాన అర్థం కాదనుకోండి. దానికి స్టూవర్ట్ గిల్బర్ట్ అనే ఆయన ‘గైడ్ టు యులిసెస్’ రాశాడు. దాన్ని పక్కన పెట్టుకుని చదివితే అర్థమౌతుంది” అన్నాడు. లైబ్రరీకి వెళ్ళి ఆ పుస్తకాలు చదవబోయాను. కొంచెం అర్థమై కొంచెం అర్థం కాలేదు. నేను అంపశయ్యలో అంత సంక్లిష్టమైన టెక్నిక్‌ను ఉపయోగించ లేదు. టెక్నిక్ కోసం నేనా నవలను రాయలేదు. నాలో కలిగే ఫీలింగ్స్‌ని దాపరికం లేకుండా యథాతథంగా రాయాలని అనుకున్నానంతే.

వందకు పైగా కథలు రాసినప్పటికీ మీకు నవలాకారునిగానే గుర్తింపు లభించింది. కారణం ఏమై ఉంటుంది?

నన్ను నవలాకారునిగానే చూడడానికి చాలా కారణాలున్నాయి. కొందరు కావాలని కుట్రపూరితంగా నా కథల్ని అణచి వెయ్యాలని చూశారు. అయినా కొందరు సహృదయులు- ఆర్.ఎస్. సుదర్శనం, మధురాంతకం రాజారాం, మునిపల్లె రాజు లాంటి వాళ్ళు నవలాకారుడిగా నువ్వెంత గొప్పవాడివో కథకుడిగా కూడా అంతే గొప్పవాడివని ప్రశంసించారు. మన కొందరు విమర్శకులకు ఉద్యమాలను గురించి రాసిన కథలు మాత్రమే అర్థమౌతాయి గాని మానసిక సమస్యలను గూర్చి మనో విశ్లేషణే ప్రధానంగా రాసిన నా కథలు అర్థం కావు. అర్థమైనా పట్టించుకోరు.

> **నన్ను నవలాకారునిగానే చూడడానికి చాలా కారణాలున్నాయి. కొందరు కావాలని కుట్రపూరితంగా నా కథల్ని అణచి వెయ్యాలని చూశారు. మన కొందరు విమర్శకులకు ఉద్యమాలను గురించి రాసిన కథలు మాత్రమే అర్థమౌతాయి గాని మానసిక సమస్యలను గూర్చి మనో విశ్లేషణే ప్రధానంగా రాసిన నా కథలు అర్థం కావు.**

మీ సుదీర్ఘ సాహిత్య జీవితంలో కవిత్వమే రాయలేదు. ఎందుకు?

ప్రారంభ దశలో కవిత్వం రాశాను. ఛందోబద్ధంగా రాసిన తేటగీతుల్ని హైస్కూల్‌లో మాకు తెలుగు చెప్పిన విశ్వనాథ వెంకటేశ్వర్లు గారికి చూపించాను (ఆయన స్వయంగా విశ్వనాథ సత్యనారాయణ తమ్ముడు). నేను రాసిన కొన్ని చిన్న కథల్ని కూడా ఆయనకు చూపించాను. “నువ్వు రాసిన పద్యాలకంటే నీ కథలే బాగున్నాయిరా” అన్నాడు. ఇంకొక విషయమేమిటంటే ఆరోజుల్లో ఇంకా వచన కవిత్వం ప్రాచుర్యంలోకి రాలేదు. ఛందోబద్ధంగానే కవిత్వం రాయాలి. నాకు ఆ గణాలు, యతిప్రాసలు పాటిస్తూ రాయడం సర్కస్ ఫీట్‌లా అనిపించేది. బహుశా అప్పటికి వచన కవిత్వం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చివుంటే నేను కూడా కవిత్వం రాసేవాడినేమో.

ఒకే ఘటనను కొందరు వ్యక్తులు తమ తమ భిన్నమైన కోణాల్లో అర్థం చేసుకుని భిన్నమైన అవగాహనతో ఎట్లా ప్రతిస్పందిస్తారో చూపిస్తుంది అకిరా కురసోవా ‘రషోమన్’ సినిమా. ఇదే శైలిలో ‘దృక్కోణాలు’ నవలను మీరు రాశారు. ఈ ప్రయోగాన్ని పాఠకులు ఎట్లా స్వీకరించారు?

మంచి సినిమాలకూ, సాహిత్యానికీ చాలా సన్నిహితమైన సంబంధం ఉంటుంది. అకిరా కురసోవా ‘రషోమన్’ నన్ను చాలా ఆలోచింపజేసింది. సంఘటన ఒకటే ఐనా దాన్ని ఒక్కొక్కరం ఒక్కొక్క విధంగా, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వాళ్ళకు నచ్చిన విధంగా అవగాహన చేసుకుంటారు. నిజానిజాలతో పనిలేదు. ఆ సంఘటన నుండి వాళ్ళకిష్టమైన కన్‌క్లూజన్స్‌ను రాబట్టుకోవడమే వాళ్ళకు కావాలి. మనిషిలోని ఈ మానసిక స్థితినిబట్టి, ఏ కన్‌క్లూజన్ అతనికి తృప్తినిస్తుందో అన్నదాన్నిబట్టి మనిషిలోని ఆలోచనా విధానం ఉంటుంది. అందరి వ్యక్తుల కన్‌క్లూజన్స్ ఒకే విధంగా ఉండవు. మనిషిలోని ఈ అవగాహనా పద్ధతినిబట్టి వాళ్ళ దృక్కోణాలు మారుతూంటాయి. ఈ అంశాన్ని హైలైట్ చెయ్యడానికే నేను ‘దృక్కోణాలు’ నవలను రాశాను. కొందరు పాఠకులు నవల ప్రధాన సంఘటన ‘రేప్’ అయ్యుండకపోతే ఇంకా బావుండేదన్నారు.

1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అతిసాహసోపేత వస్తువుతో ‘చీకటి రోజులు’ నవలను రాసి ప్రకటించారు. అప్పటి స్థితిగతుల గురించి చెప్పండి?

1975 ఎమర్జెన్సీని సమయంలో నేను ‘అరసం’ సంస్థలో ఉన్నాను. అరసం సీపీఐకి అనుబంధ సంస్థ. సీపీఐ ఎమర్జెన్సీని సపోర్ట్ చేసింది. నన్ను అరెస్ట్ చేయాలని చూశారనీ, కాని అరసం సీపీఐ అనుబంధ సంస్థ కాబట్టి అరెస్ట్ చేయొద్దనుకున్నామని నాకు ఒక పోలీస్ ఆఫీసర్ చెప్పారు. అప్పుడు నా మిత్రుడు తిరుపతయ్య జమ్మికుంటలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ‘విరసం’ సంస్థతో చాలా కొద్ది చినచిన్న సంబంధాలున్నాయని పోలీస్‌వాళ్ళు కనిపెట్టి అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసి ఆయనను ఏ పోలీస్ స్టేషన్‌లోనో జైలులోనో నిర్బంధించలేదు. కరీంనగర్ దగ్గరున్న ఒక ఊరి పోలీస్ క్యాంప్‌లో పెట్టారు. 24 రోజుల తర్వాత విడుదల చేశారు. పోలీస్ క్యాంప్ నుండి విడుదలయ్యాక నేను జమ్మికుంటకు వెళ్ళి ఆయనను కలిశాను. ఇన్ని రోజులు ఆ పోలీస్‌క్యాంప్‌లో ఏం జరిగిందో, ఒక్కొక్క పోలీస్ ఆఫీసర్ ఎలా ప్రవర్తించాడో చెప్పాడు నాకు. “దీన్ని బ్యాక్‌గ్రౌండ్‌గా తీసుకుని ఒక నవల రాయి తిరుపతయ్యా” అన్నాను. దానికాయన “రాస్తే నన్ను పోలీసులు పట్టుకుపోవడం ఖాయం” అని భయపడ్డాడు. అప్పుడిక నేనే రాద్దామని నిర్ణయించుకున్నాను. ఆ రోజుల్లోనే ఒకసారి ‘ఈనాడు’ ఆఫీస్‌కు వెళ్ళి చలసాని ప్రసాదరావును కలిశాను. ఆయనకు ఈ ఆలోచన చెబితే- ఒక్క తిరుపతయ్య అనుభవాలే కాదు, ఆ రోజుల్లో మన దేశంలో అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అట్రాసిటీస్‌ని కవర్ చేస్తూ రాస్తే బాగుంటుందనీ, ఉన్నది ఉన్నదున్నట్టుగా కాకుండా కొంత కల్పనను కూడా జోడించి నవల పరిధిని విస్తృతం చేస్తే మంచి వర్క్ అవుతుందని చెప్పాడు. ఆయన చెప్పింది బాగానే ఉందనుకుని- కేరళకు చెందిన రాజన్‌ను మాయం చెయ్యడం, స్నేహలతారెడ్డిని పోలీస్ క్యాంప్‌లో పెట్టి హింసించడం, నరసింహులు అనే కేడీ కథ. ఇవన్నీ కలిపి ఆ నవలను డైరీ రూపంలో రాశాను. ఎందుకోగాని దానికి రావలసిన గుర్తింపు రాలేదు. మొత్తం భారతదేశంలో ఎమర్జెన్సీ మీద రచించబడిన నవల అదొక్కటే అని అన్నారు చాలామంది.

ఇంటర్వ్యూ ■ **రామా చంద్రమౌళి**



మరో కల వస్తుందా

సుదూర గతంలో ఒక సాయంత్రం
ఆ ఒంటరి భవంతి పైఅంతస్తు మూల గదిలో
ఒక్కడినే కాసేపు కూర్చుని కాసేపు పచార్లు చేసి
బయటికి నడిచాను నిమ్మళించిన లోపలితో

వచ్చేటప్పుడు గది కిటికీ లోని పూల తీగా
నిశ్శబ్ద రాగాల కొసా నా చేతిని తాకిన స్పర్శ గుర్తుంది

మెట్లు మృదువుగా దిగువకు దింపాయి
కింద అలంకారవిన్యాసాల సీతాకోకల రంగులనూ
రెపరెపలనూ అబ్బురంతో చూస్తూ వుండగానే...

కల చటుక్కున ఆగిపోయింది, బహుశా తెగిపోయిందేమో!

కళ్లు తెరిస్తే ఆ భవంతి లేదు, పూల తీగా లేదు
నిస్సవ్వడీ లేదు చుట్టూరా సీతాకోక ఒక్కటీ లేదు

చాలా ఏళ్లయినా గతపు పచ్చిక బయళ్ళ నుంచి
ఆ కల తలపుకొస్తూనే ఉంది అపుడపుడు
పాత స్నేహితుడి పలకరింపులా, పిలుపులా

ఇంతకీ
ఆ భవంతి ఎక్కడిది ఏ కాలం నాటిది ఎవరిది?
ఆ గది పాపం ఒంటరిగానే ఉందా నేనొచ్చాక?
ఆ పూల తీగ అట్లాగే వేచి వుందా వాడకుండా?
ఆ సీతాకోకలు రంగుల ఉత్సవోత్సాహంతో
అక్కడే తిరుగుతూ ఉన్నాయా కాలాన్ని ఓలలాడిస్తూ?

వెళ్లాలి, వాటిని మళ్ళీ కలవడానికి, కాసేపైనా
కానీ వెళ్లేదెట్లా?

ఏదో మరొక అపురూప రాత్రి ప్రయాణంలో
మరో కల వస్తుందా స్వయంగా ప్రియంగా
నన్ను అక్కడికి తీసుకెళ్లడానికి?

■ దర్భశయనం శ్రీనివాసాచార్య

✆ 94404 19039

నా ఆత్మ ఆత్రం



నా వయస్సు లెక్కిస్తే అర్థమయింది
ఇంతవరకూ నేను బ్రతికున్నదానికంటే
బ్రతకడానికి నాకు తక్కువ సమయం ఉందని

ఆగామికంటే గతమే నాకు ఎక్కువని

ఆ చెర్రీ పండ్ల కలశంతో ఉన్న అబ్బాయిలా ఉంటుంది నాకు
ముందు ఆవురావురుమని వాటిని తిన్నాడు, కానీ
మిగిలినవి తక్కువేనని తెలిసాక, ముమ్మరంగా ఆవేశంగా రుచి చూసాడు.

సామాన్యమైన వాటితో వ్యవహరించే సమయం ఇంక నాకు లేదు

రగిలే అహంకార కవాతులు చేసే సభలలో నేను ఉండదలుచుకోలేదు

సమర్థుల్ని అపఖ్యాతి పాలుచేస్తూ, వారి స్థానాలు పీఠాలు ప్రతిభ ప్రగతి
అదృష్టం లాక్కోవాలని ఆశపడే అసూయపరులతో విసిగిపోయాను.

అప్రస్తుతం, నాకు పనికిరాని ఇతరుల జీవితాల విషయ చర్చలు,
అంతులేని సంభాషణలకు, నిజంగానే నాకు సమయం లేదు

కాలక్రమానుగత వయస్సున్నా అపరిపక్వులైన జనం సున్నితత్వాన్ని ముందుకు నడిపించడానికి లేదా నియంత్రించడానికి నాకు ఎక్కువ సమయం లేదు

కేవలం అధికార పత్రాలు తప్ప, విషయాన్ని చర్చించని వారిని, అధికారం కోసం పెనుగులాడేవారిని ఎదుర్కోవడం, నేను ద్వేషిస్తాను. అధికార పత్రాల్ని చర్చించడానికి నా దగ్గర అతితక్కువ సమయం ఉంది. ఈ ప్రపంచంలోని ఆంతరిక సారాంశాన్ని, నేను ఇప్పుడు అర్థం చేసుకోగలను.
నా ఆత్మ ఆత్రంలో ఉంది
నా కలశంలో ఎక్కువ చెర్రీలు లేవు

వారి బలహీనతల మీద వారే నవ్వుకునే వారికి,
మానవీయులకు దగ్గరగా ఉండాలనుకుంటాను,

స్వయంతృప్తులు, వారి విజయాలపై అతిగా ఊహించే వారికి దూరంగా,
స్వీయ ప్రాముఖ్యతలతో నిండి ఉన్నవారికీ దూరంగా

అత్యవసరాలే జీవితాన్ని విలువైనదిగా చేస్తాయి
కావలసినదానికంటే అత్యవసరాలే నాకు ఎక్కువ

అవును, నేను తొందరలో ఉన్నాను
పరిపూర్ణతనిచ్చే తీవ్ర ఆవేశంతో బ్రతకడానికి, నేను తొందరపడుతున్నాను
మిగిలిన చెర్రీలను నేను వ్యర్థం చేసుకోవాలనుకోవడం లేదు
అవి ప్రశస్తమైనవని నాకు ఖచ్చితంగా తెలుసు,
ఇంత వరకూ తిన్న వాటికంటే కూడా.

కన్‌ఫ్యూసియస్ చెప్పినట్టు “మనకు రెండు జీవితాలు. రెండవది మొదలయ్యేది, ఒక్కటే మిగిలుందని గ్రహింపుకు వచ్చినపుడు”

బ్రెజిల్ కవి ■ **మారియో డె అంద్రాడే** (1893–1945)
అనువాదం ■ **ముకుంద రామారావు**
✆ 99083 47273

పుస్తకం చూసి నాలిక కరుచుకున్నాను!

నా మొదటి పుస్తకం

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

నిజానికి నేను అచ్చులో చూసుకున్న నా మొదటి పుస్తకం ఒక నాటిక. 1973–80 మధ్య లెక్కలేనన్ని ప్రదర్శనలు, పురస్కారాల తరువాత జాతీయ నాటకంగా 14 భాషల్లో ఆకాశవాణిలో లెక్కలేనన్నిసార్లు ప్రసారం అయింది. నా బాల్యమిత్రుడు, నటుడు వి.ఎస్. రామేశ్వరరావు కథ చెప్పగా, కూర్పు చేసి నాటకీకరించాను. అది టీవీ నాటకం అయిన తరువాత ఎవరో సినిమాగా తీశారు. నేను చూడలేదు. నాకు ఇప్పటికీ ఆ నాటిక చేసిన హడావుడి అర్థం కాలేదు.

వచన రచయితలు చాలామందికి కవిత్వం అంటే ఇష్టం. 1963 ప్రాంతంలో నేను ‘గాలిబ్ గీతాల’ కిక్కులో కొన్ని డజన్లు రాశాను. కానీ అప్పుడే నా కవిత ఏదో ఒక పత్రికలో వచ్చింది. 1971 నుంచీ చాలా కవిత్వం రాశాను. నేను కవిని కాదనే గ్రహింపు ఉండేది అప్పటికే. ఇప్పటికీ కథలు రాస్తున్నప్పుడు మధ్యలో, మార్జిన్లో గిలుకుతుంటాను. 2015లో అనుకుంటాను– ఉగాది కవి సమ్మేళనానికి నన్ను ఆహ్వానించడానికి ప్రభుత్వ అధికారి ఒకాయన ప్రయత్నించాడు. ధన్యవాదాలు చెప్పి నేను కవిని కాదు గనక రాలేనని చెప్పుకున్నాను. ఆయన సంతోషించి “పది నిముషాల కవిత్వం చదవడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల చేత ఒత్తిడి చేయిస్తారు” అన్నాడు.



1990లో ‘గుండె గోదావరి’ పేరుతో నా కవితా సంకలనం అచ్చయింది. అవన్నీ అంతకుముందు ఎప్పుడో రాసుకున్నవి. ఆ కాయితాలు దొరికినప్పుడు ఒక పుస్తకంలో తిరగ రాసుకున్నాను. అప్పట్లోనే ‘మూగిదాని మానభంగం’ అని వలసల మీద దీర్ఘ కవిత రాశాను. ఆ రోజుల్లో నెలలో సగం పైగా హైదరాబాద్‌లో ఉండేవాడ్ని. ప్రసాద్ అనే బేంక్ మిత్రుడు ఒకసారి కవితల పుస్తకం చూసి “గురు గారూ, పుస్తకంగా వెయ్యండి సార్,” అన్నాడు. ఆ విషబీజం వేరూని నాలుగైదు రోజుల తరవాత అచ్చుకి పంపించాను. అందులో అక్షర దోషాలు వగైరాలున్నాయి. తరువాత దిద్దుబాట్లు చేసుకోవచ్చనుకున్నాను. నేను హైదరాబాద్‌కు వచ్చేశాను. అప్పటికి సుల్తాన్‌పూర్ పారిశ్రామిక కాలుష్య సమస్యలో పీకల దాకా మునిగి ఉన్నాం. ఢిల్లీ వెళ్లి PIL వేసే పనిలో ఉన్నాం. పుస్తకం తయారైందని తెలిసింది. మోహన్‌గారిని కలిసినప్పుడు ముఖచిత్రం గీసి ఇమ్మని అడిగేను. అతను నాలుగైదు రోజుల్లో బొమ్మ గీసి నేనుండే బంజారాహిల్స్‌కి శివాజీతో సహా తీసుకొచ్చాడు.

> **చేరాతలు సంచలనం కలిగిస్తున్నప్పుడు మిత్రులు చేకూరి రామారావు గారు, స్నేహభావంతో అనుకుంటాను ‘గుండె గోదావరి’ మీద ఒక వారం రాశారు. తరవాత ఎప్పుడో ఒకాయన అందులో కొన్ని కవితలను ఇంగ్లీషులోకి అనువదించారు. నాకు నచ్చక ముందుకి వెళ్లనివ్వలేదు. నాకు అప్పటికే నా పుస్తకం మీద ఆసక్తి పోయింది. కొంచె అటూ ఇటూగా నా కవితల పుస్తకం బారిస్టరు పార్వతీశం టోపీలా తయారైంది.**

పుస్తకం అచ్చుకాకముందు తీసుకోవలసిన జాగ్రత్తలలో ఒక్కటి కూడా పట్టించుకోలేదు, ఎందుకో తెలీదు. అచ్చు అయిన దగ్గర్నుంచీ సుల్తాన్‌పూరు గొడవల్లో మునిగిపోయాను.

రాజమండ్రి వచ్చి పుస్తకం చూశాను. లోపల కొన్ని చదివి నాలిక బలంగా కరుచుకున్నాను. తెలుగు యూనివర్సిటీలో సాహిత్య సభలు జరిగేయి. మా అందరికీ మంచి కాలక్షేపంగా ఉండేది. పుస్తకం సభల సందర్భంగా ఆవిష్కరించాలనుకున్నాం. ఆచార్య జీవీ సుబ్రహ్మణ్యం గారు ప్రసంగించారు. మిత్రులు రామబ్రహ్మంగారు నడిపించారు. చాలామంది వచ్చేరు. యూనివర్సిటీ పని మీద వచ్చి సభని అలంకరించారు.

చేరాతలు సంచలనం కలిగిస్తున్నప్పుడు మిత్రులు చేకూరి రామారావు గారు, స్నేహభావంతో అనుకుంటాను, ‘గుండె గోదావరి’ మీద ఒక వారం రాశారు. తరవాత ఎప్పుడో ఒకాయన అందులో కొన్ని కవితలను ఇంగ్లీషులోకి అనువదించారు. నాకు నచ్చక ముందుకి వెళ్లనివ్వలేదు. నాకు అప్పటికే నా పుస్తకం మీద ఆసక్తి పోయింది. మరుసటి ఏడాది ‘వడ్ల చిలకలు’ కథా సంపుటి వేశాను. కొంచె అటూ ఇటూగా నా కవితల పుస్తకం బారిస్టరు పార్వతీశం టోపీలా తయారైంది.

ఫోన్: 94407 03440

చదువు ముచ్చట

రవి మంత్రి

రచయిత పరిశీలన కనపడే రచన నచ్చుతుంది

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?
చలం ‘మైదానం’. 17–18 సంవత్సరాల వయసులో చదివాను.




మీ పుస్తకాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?
ఒక వర్గం కోసమో, ఎవరినో చదివించటానికో రాసే కథలు కాక, ఈ రచయిత చాలా పరిశీలన చేసి రాసాడు, జీవితం మీద పట్టు ఉంది అనిపించే కథలు నచ్చటం మొదలుపెట్టాయి.

ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?
కేశవరెడ్డి నవల ‘మునెమ్మ’.

ఏ తరహా పుస్తకాల్ని చదవటానికి ఇష్టపడతారు?
నిజ జీవితానికి దగ్గరగా ఉండేవి. ఇది నేను ఎక్కడో చూసాను అనిపించేవి.

సాహిత్యంలో మీకు నచ్చిన కల్పిత పాత్ర?
బుచ్చిబాబు ‘చివరకు మిగిలేది’ నవలలో దయానిధి.
యండమూరి ‘అనైతికం’ నవలలో అహల్య.



గత కాలం రచయితల్ని కలిసి మాట్లాడగలిగితే ఎవరితో మాట్లాడతారు?
చలం, గొల్లపూడి, యద్దనపూడి.

మీకు తరచుగా గుర్తొచ్చే కొటేషన్/ కవితా పంక్తి?
“నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే నిబిడాశ్చర్యంతో వీరు–
నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే నిర్దాక్షిణ్యంగా వీరే...”
(శ్రీశ్రీ ‘మహాప్రస్థానం’)

ఎవరైనా సక్సెస్ గురించో, నా విజయాల గురించో మాట్లాడితే ఈ మాట ఒకసారి నా మైండ్ లోకి వచ్చి వెళ్తుంది. అందుకే నేను దేనినీ తలకి ఎక్కించుకోను.

(రవి మంత్రి మొదటి నవల ‘అమ్మ డైరీలో కొన్ని పేజీలు’ 2023లో విడుదలైంది.)

ఉగాది కవితల పోటీ

కార్తీక డెవలపర్స్ సాహితీ కిరణం సౌజన్యంతో శ్రీ విశ్వావసు నామ ఉగాది కవితల పోటీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.2వేలు, రూ.1500. రెండు ప్రత్యేక బహుమతులు ఒక్కొకటి రూ.1000. ముప్పై లైన్లు మించని కవితలను జనవరి 31లోగా పోస్ట్ కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం. 11–13–154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ – 500102కు పంపాలి. మరిన్ని వివరాలకు: 94907 51681.

సాహితీ కిరణం

కవి సంధ్య కవితల పోటీ

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా కవి సంధ్య, యానాం – చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్, నెల్లూరు సంయుక్త నిర్వహణలో కవితల పోటీని నిర్వహిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2500, రూ.1500. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొకటి రూ.1000. ఫిబ్రవరి 15లోగా పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చిరునామా: దాట్ల దేవదానం రాజు, ఐక్రియనగర్, యానాం (పోస్ట్) – 533464. మరిన్ని వివరాలకు: 94401 05987.

కవిసంధ్య

కొత్తకొండ జాతరకు పోయొద్దామా..

నేడు ప్రారంభం కానున్న పెద్ద జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జాతరలో ఉచిత వీఐపీ పాస్‌ల రద్దు
- 600 మంది పోలీసులతో బందోబస్తు
- సీసీ కెమెరాల నిఘాలో కొత్తకొండ జాతర

5




కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన

మల్లన్న జాతరకు బైలెల్లె జనం..

ఐనవోలులో వైభవంగా ధ్వజారోహణం



ఆలయ శిఖరంపై జెండాను ఎగురవేస్తున్న అర్చకుడు



విద్యుత్ వెలుగుల్లో ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

- ఉత్సవాలు ప్రారంభమైనట్లు అర్చకుల ప్రకటన
- ఆలయానికి తరలివస్తున్న భక్త జనం
- విధుల్లో చేరిన వివిధ శాఖల అధికారులు
- చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా గౌరవీ శంకర్

5



భక్తిపారవశ్యంలో శివసత్తి

కలల సౌధం అందే తరుణం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సర్కారు సన్నాహాలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పేదోడి సొంతింటి కల సాకారం కాబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన 10,05,454 దరఖాస్తులను పరిశీలించిన అధికారుల బృందం.. 2,73,751 మందిని అర్హులుగా గుర్తించింది. తొలి విడతలో సొంత జాగ ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వనుంది. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి ఆమోదంతో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానుంది. దీంతో ఎన్నో ఏళ్ల సొంతింటి కల సాకారం అవుతుందనే ఆనందం ఓరుగల్లువాసుల్లో వ్యక్తం అవుతోంది.

పదేళ్ల నిరీక్షణకు తెర

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సొంత ఇంటి కోసం నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. 2014లో స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రద్దు చేసి, పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఐదువేల ఇళ్లు కూడా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు సైతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పేరుతో ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.3లక్షల సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. ప్రతీ నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,58,090 దరఖాస్తులను కూడా స్వీకరించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 1,91,240మంది అర్హులను గుర్తించారు. కొన్నిచోట్ల గృహలక్ష్మీ ఇంటికి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో ఆ పథకం కూడా పేదలకు అందకుండా పోయింది. పదేళ్లుగా పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మీ పథకం ఇళ్లు ఏవీ కూడా అందని ద్రాక్షగా మారాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడుగులు వేస్తోంది.

2,73,751 మంది అర్హులు

ఇందిరమ్మ ఇళ్లకు తొలి విడత సొంత జాగ

మిగతా 4వ పేజీలో...

- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు
- తొలి విడతలో ఇంటి జాగ ఉన్నవారికే ప్రాధాన్యం
- ప్రతీ ఇంటికి రూ.5లక్షలు, ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు
- రెండో విడతలో ఇంటి జాగతో పాటు ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10,05,454 దరఖాస్తులు
- సర్వే అనంతరం 2,73,751 మంది అర్హులుగా గుర్తింపు
- తొలివిడతలో 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు

50 వేల ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్చి 11, 2024వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇళ్లు రానున్నాయి. అలాగే పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు, భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలు, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు, ఇల్లందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం మండలాలు ఓరుగల్లు ఇలాఖాలో కలిసిపోయాయి. దీంతో వీటితో కలిపి ఓరుగల్లుకు సుమారు 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. మొత్తం 100శాతం సబ్సిడీతో ప్రభుత్వం రూ.5లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించనుంది. ఒక కుటుంబంలో ఒకరికే ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటిని మంజూరు చేయనున్నారు.

అర్హుల ఎంపిక

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల వ్యాప్తంగా 10,05,454మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పది రోజులుగా అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రధానంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్థానికులై ఉండి.. సొంత జాగ ఉన్నవారికి, ఇళ్లు లేనివారికి, గుడిసెలో నివాసం ఉంటున్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. మట్టి గోడలు, పెంకుటిల్లు, అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటికే అసంపూర్తిగా ఇంటిని నిర్మించుకున్నవారికి, ఆర్‌సీసీ కప్పులేనివారు, ఇటుక గోడలు లేని ఇంటికి, యువ వితంతువు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, వికలాంగులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వనుంది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభ లేదా వార్డు సభల్లో ప్రకటిస్తారు. అలాగే రూ.ఐదు లక్షలను ఇంటి నిర్మాణంలో వివిధ దశల్లో అందిస్తారు. బేస్‌మెంట్ పూర్తిచేస్తే రూ.1లక్ష, స్లాబ్ లెవల్‌లో మరో రూ.1లక్ష, స్లాబ్ పూర్తయిన తరువాత రూ.2లక్షలు, ఇల్లు మొత్తం పూర్తిచేసిన తరువాత మిగతా రూ.లక్ష లబ్ధిదారులకు అందించనున్నారు.

జిల్లా	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
దరఖాస్తులు	2,33,636	1,96,703	1,43,187	2,17,591	1,23,469	90,863	10,05,454
సర్వే పూర్తయినవి	2,21,316	1,82,228	1,34,696	1,95,505	1,16,217	87,315	9,37,272
అర్హత పొందిన వారు	66,622	49,863	32,448	56,274	36,096	32,448	2,73,751



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పేదోడి ఇంటికే సంక్షేమ పథకాలు

- 26 నుంచి మరో నాలుగు పథకాలు ప్రారంభం
- 16 నుంచి గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం

5

జూపార్కు తరలింపు వెనుక కుట్ర


బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



రాంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) ప్రజలకు ఆహ్లాదం కలిగించే విధంగా నగరం నడిబొడ్డున ఉన్న కాకతీయ జూపార్కును నగరానికి దూరంగా ఉన్న ధర్మసాగర్‌కు తలిరలిస్తామని మంత్రి కొండా సురేఖ చేసి న వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షు రాలు రావు పద్మ ఒక ప్రకటనలో ఆరో పించారు. నగర ప్రజలకు అం దుబాటులో ఉన్న జూపార్కును దూ రంగా తరలించడం అనాలోచిత, కుట్రపూరితమైన నిర్ణయమన్నా రు. జూపార్కు ఎదురుగా ఉన్న సైన్ సెంటర్ అభివృద్ధిని విస్మరిం చి జూపార్కు స్థలంపై కాంగ్రెస్ నాయకు ల కన్ను పడటం సరికాదన్నారు. రియల్టర్స్‌కు భూమిని అప్పగించేం దుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ తన మార్క్ కోసం సెంట్రల్ జైలును తరలిస్తే.. కాంగ్రెస్ తన మార్క్ కోసం జూపార్క్‌ను తరలించేందుకు ప్రయత్నాలు చేస్తోంద న్నారు. జూపార్కు తరలింపుపై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేంద ర్ సమాధానం చెప్పాలన్నారు. జూపార్క్ తరలించాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి సరికాదు

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



హనుమకొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం తెలిపారు. రాష్ట్రంలో 60లక్షలకు పైగా బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాలు ఉన్నాయని, ఇలాంటి దాడులు కొనసాగితే ప్రతిదాడులు తప్పవని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పులి రజినీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంపై దాడిని ప్రకటనల ద్వారా ఖండించారు.

హోరాహోరీగా సెపక్‌తక్రా చాంపియన్‌షిప్

రెగోలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన తెలంగాణ మహిళ జట్టు

4



కలగాలె.. భోగభాగ్యం..

- నేడు భోగి పర్వదినం
- ఇళ్ల ముందు సందడి చేయనున్న గంగిరెద్దులు
- రంగవల్లులతో కళకళలాడనున్న లోగిళ్లు
- ఘుమఘుమలాడుతున్న పిండి వంటలు
- పతంగులతో యువత, చిన్నారుల సందడి
- ఆలయాల్లో చిన్నారులకు భోగి పండ్లు
- ప్రారంభమైన సంక్రాంతి సంబురాలు

పండించిన పంటలు ఇంటికి చేరవేసి కుటుంబ సభ్యులందరితో ఆనందంగా జరుపుకునే పండుగే సంక్రాంతి. అల్లుళ్లు, కూతుళ్లు, బంధుమిత్రులను పండుగకు ఆహ్వానించుకొని మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ సందడి ఆదివారం నుంచే మొదలైంది. ఇంటికి మామిడి తోరణాలు, బంతి పూల మాలలు కట్టి ఇళ్ల ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంబరంగా వేడుకలు జరుపుకుంటాం. సంక్రాంతి సంబరాలకు పల్లెలు, గ్రామాలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలతో మూడు రోజుల పాటు వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు జిల్లాలోని ప్రజలు సిద్ధమయ్యారు. నేడు (సోమవారం) భోగి, రేపు (మంగళవారం) సంక్రాంతి, ఎల్లుండి (బుధవారం) కనుమ పండుగలను జరుపుకోనున్నారు. పండగ సందర్భంగా ఇంటింటా పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. నోములు, వ్రతాలు ఆచరించేవారు పూజా సామగ్రి, నోముల వస్తువులు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు.

- వరంగల్ కల్చరల్ / నర్సంపేట

4



ఖోఖో ప్రపంచ కప్ రెఫరీగా రమేష్



వరంగల్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 13 నుంచి 19 వరకు జరగనున్న మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ పోటీల రెఫరీగా హనుమకొండకు చెందిన రాజారపు రమేష్ నియమితులయ్యారు. ఖోఖో ప్రపంచ కప్ పోటీల్లో రాష్ట్రం నుంచి ముగ్గురికి రెఫరీలుగా అవకాశం లభించగా, ఇందులో ఉమ్మడి వరంగల్‌జిల్లా నుంచి రమేష్ ఎంపిక కావడంపై జిల్లా ఖోఖో అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రమేష్ ప్రస్తుతం హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లో ఖోఖో కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తనకు అవకాశాన్ని కల్పించిన ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సుధాన్షు మిట్టల్, ఎంఎస్ త్యాగి, ఖోఖో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, టీకేకేఏ రిఫరీ బోర్డు చైర్మన్ నాతి కృష్ణమూర్తి, కన్వీనర్ కుసుమ సదానందం, జిల్లా ఖోఖో అసోసియేషన్ బాధ్యులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కామర్స్‌లో క్రాంతికుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు అనంతోజు క్రాంతికుమార్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు.క్రాంతికుమార్ 'ఫైనాన్షియల్ లిట్రసీ అండ్ డిజిటల్ ఎకానమీ ఇన్ ఇండియా-ఏ స్టడీ ఆఫ్ సెలక్టు అర్బన్ ఎరియాస్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన క్రాంతికుమార్ బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఫైనాన్స్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. అనంతోజు సోమయ్యచారి-గోవిందమ్మ దంపతుల కుమారుడు క్రాంతి కుమార్ ప్రాథమిక, ఇంటర్ విద్య కొడకండ్లలో, బీకామ్, ఎంకామ్, ఎంబీఏ హైదరాబాద్ ఓయూలో పూర్తిచేశారు. డాక్టరేట్ సాధించిన క్రాంతికుమార్‌ను పలువురు అభినందించారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ వెస్ట్లిలిన్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జనవరి 10 నుంచి 12 వరకు పంజాబ్ భంటిండాలోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ వెస్ట్లిలిన్ (గ్రీకో రోమన్ స్టైల్) జట్టును 2024-25 ఏడాదికి ఆదివారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎ.రాహుల్(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.అఖిల్(వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), మహ్మద్ ఇబ్రహీం(కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, హసన్‌పర్తి), కె.కార్తీక్(న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ) జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ కళాశాల(హనుమకొండ)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా గిర్నిబావిలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ కె.రాజు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రొఫెసర్ వెంకయ్య

కలగాలె.. భోగభాగ్యం..

- నేడు భోగి పర్వదినం
- ప్రారంభమైన సంక్రాంతి సంబురాలు



గంగిరెద్దుతో విన్యాసం చేయిస్తున్న ముత్తోజిపేట గంగిరెద్దుల వారు

వరంగల్ కల్చరల్/నర్సంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. తొలి రోజు భోగి పండుగగా పిలుస్తూ వేడుక ప్రారంభించుకుంటారు. భోగ భాగ్యాలతో విరాజిల్లాలని భోగి మంటలను పండుగను ప్రారంభిస్తారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం అర్ధరాత్రి నుంచే పండుగ సందడి మొదలైంది. ఉదయం వేకువజామునుంచే రకరకాల ముగ్గులతో ఇంటి ముంగిట మహిళలు, యువతులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఆవుపేడతో తయారు చేసి అందులో గరక పెట్టి పసుపు కుంకుమలు అద్ది రేగు పండ్లు, నవధాన్యాలతో అందమైన ముగ్గులో మధ్యలో పెట్టి అలంకరిస్తారు. సంక్రాంతి పండగలో భోగి పండగ ప్రత్యేకత ఉంది. పాత వస్తువులను మంటల్లో వేసి చెడును పారదోలి మంచిని ఆస్వాదించడం భోగి విశిష్టతగా చెప్పవచ్చు. ఆడపడుచులు కొత్తబట్టలు వేసుకొని ఇంటి ఎదుట వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి నవ ధాన్యాలు, పూల రెమ్మలు పోస్తారు.



వరంగల్ చౌరస్తాలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పిండివంటలు

సంక్రాంతి అంటే ఫలహారాల పండుగ. సకినాలు, అరిసెలు, గారెలు, మడుగూలు చేసుకుంటారు. ప్రతీ సంక్రాంతికి ప్రతీ ఇంట్లో మూకుడు పెట్టాలనేది తెలుగు ప్రజల సంప్రదాయం. చిన్నారులు, మహిళలు ఇంటిల్లిపాది పిండి వంటలతో పండుగను సంతోషంగా జరుపుకుంటారు. నగరంలో పిండి వంటలు అమ్మే దుకాణాలు పెద్ద ఎత్తున ఉండటంతో కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగకు నాలుగు రోజులు సెలవులు రావడంతో ఎక్కడెక్కడో ఉంటున్న వాళ్లంగా కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను జరుపుకోవాలని తమ సొంతూళ్లకు చేరుకుంటున్నారు.

పతంగులతో యువత సందడి

వివిధ రకాల రంగు రంగుల పతంగులను ఎగుర వేసేందుకు చిన్నారులు, యువకులు బీజీగా మారారు. పతంగుల దుకాణాల వద్ద సందడి నెలకొంది. రూ.10 నుంచి రూ.100 ధర పలికే పతంగుల అమ్మకాలు జరుగుతున్నాయి పతంగులను ఎగురవేసేందుకు అవసరమైన మాంజా,దారంబిండలు, చెరకులను చిన్నారులు, యువకులు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు. అయితే చిన్నారులు, యువత గాలిపటాలు ఎగరవేసే క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. దారం తెగిన అనంతరం పతంగిని అందుకోవాలనే ఆత్రుతతో ప్రమాదాలు సంభవించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా బిల్డింగులపై పతంగులు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. రైలు పట్టాలపై పతంగుల కోసం తిరగకుండా, రోడ్లపై పరుగెత్తకుండా వాహనాలకు అడ్డు రాకుండా చిన్నారులు జాగ్రత్తలతో పతంగులు ఎగరవేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో బావుల వద్ద, కాల్వల వద్ద పతంగులు ఎగిరేయవద్దు.



నర్సంపేటలో బంతిపూలు కొనుగోలు చేస్తున్న జనం

చిన్నారులకు భోగి పండ్లు

సంక్రాంతి పర్వదిన వేడుకల్లో మొదటి రోజు సోమవారం వేకువజామునే లేచి ఇంటి ముంగిట భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలుకుతారు. అనంతరం ఇంటి ముందు ముగ్గులు వేస్తూ గగ్గిరెద్దుల వారు గోవులతో పీకలు ఊదుతూ డూడూ బసవన్నలతో ఆట పాటలతో అందరిని అలరిస్తారు. భోగి సందర్భంగా దేవాలయాల్లో, గురు మందిరాల్లో భోగి పండ్లనుపోసి పూజలు నిర్వహిస్తారు. ఇళ్లల్లో చిన్నారులకు కూడా ఆచారం ఉన్నవారు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తారు.



వరంగల్ చౌరస్తాలో పతంగుల కొనుగోలుతో యువత సందడి

డూడూ బసవన్న

తెల్లవారు జాము నుంచే గంగిరెద్దుల వారు డూ.. డూ.. బసవన్న అంటూ ఇంటి ముంగ్లోకి చేరుతుంటారు. అయ్యవారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ వారి గంగిరెద్దులతో విన్యాసాలు ప్రదర్శిస్తుంటారు. డోలు వాయిస్తూ సన్నాయి పాటలతో గంగిరెద్దుల నృత్యాలతో ఇళ్లిల్లూ తిరుగుతూ భిక్షం తీసుకుంటారు. హరిదాసు కీర్తనలు కనుమరుగయ్యాయి. సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

ప్రజలు సిరిసంపదలతో వర్ధిల్లాలి

తెలంగాణ రాష్ట్ర ప్రజలు భోగ భాగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. రైతు రుణమాఫీ, సకాలంలో ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు రూ. 500 బోనస్, తదితర కార్యక్రమాలతో పాటు ఈ ఏడాది నుంచి రైతులు, వ్యవసాయ కూలీలకు అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక తదితర కార్యక్రమాలతో వ్యవసాయ కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం వెల్లి విరుస్తుందని అన్నారు. పతంగులు ఎగరవేసే సమయంలో చైనా మాంజాను వాడొద్దని, యువత, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉత్తరాయన పుణ్యకాలంలో అంతా మంచే జరుగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సురేఖ ప్రకటించారు.

కలల సౌధం.. అందే తరుణం..

(3వ పేజీ తరువాయి)

ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10,05,454 మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకోగా, పది రోజులుగా అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,37,272 దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలించింది. కొన్ని చోట్ల యాప్‌లో సాంకేతికత సమస్య రావటం, కొందరు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవటం, మరికొందరు వృత్తిరిత్యా నగరాలకు వెళ్లటం వంటి కారణాలతో వంద శాతం సర్వే పూర్తి కాలేదు. దాదాపు 92 శాతం దరఖాస్తులు పూర్తి కాగా, మిగతా దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నారు. పరిశీలించిన దరఖాస్తుల్లో అధికారులు అన్ని కోణాల్లో పరిశీలించి అర్హులను గుర్తించారు. వరంగల్ జిల్లాలో 66,622 మంది అర్హులుగా గుర్తించగా, హనుమకొండ జిల్లాలో 49,863 మందిని, జనగామ జిల్లాలో 32,448 మందిని అర్హులుగా గుర్తించారు.

అలాగే మహబూబాబాద్ జిల్లాలో 56,274 మంది లబ్ధిదారులను, అలాగే భూపాలపల్లి జిల్లాలో 32,448 మంది, ములుగు జిల్లాలో 32,448 మంది ఇందిర మ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,73,751 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి తొలి విడతలో వీరికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అయితే గత ప్రభుత్వం కూడా 2023-24లో గృహలక్ష్మీ పథకం కింద దరఖాస్తులను స్వీకరించి 1,91,240 మంది అర్హులను గుర్తించారు. అప్పటితో పోల్చితే 78వేల మందికి పైగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. అయితే అప్పట్లో కేవలం 2,58,090 దరఖాస్తులే గృహలక్ష్మీ ఇళ్ల కోసం వస్తే.. ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,05,454 దరఖాస్తులు వచ్చాయి.

అవయవ దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉపేందర్‌రెడ్డి



బాలసముద్రం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెండ్లి ఉపేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని శనివారం నిర్వహించిన సమావేశంలో వరంగల్‌కు చెందిన ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొంగళ్ల అశోక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనెరెడ్డి మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు, అసోసియేట్ అధ్యక్షులుగా నాగేశ్వర్‌రావు, డాక్టర్ పరికిపండ్ల అశోక్, చల్లా రాంచరణ్, కోశాధికారిగా లింగాల విజేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా చారుగుంట్ల నర్సింహారావు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు.

స్థిరాస్తుల కొనుగోలుకు క్రెడాయ్ ఒక బెంచ్‌మార్క్

- యువ ఐఏఎస్ అధికారి శాకమూరి సాయి ఆశ్రిత్

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ప్రాపర్టీషో లాంటి వాటిని ప్రజలు సందర్శించడంవల్ల ఆస్తుల క్రయవిక్రయాలపై ప్రజల్లో అవగాహన కలుగుతుందని యువ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి ఆశ్రిత్ అభిప్రాయపడ్డారు. హనుమకొండ వాస్తవ్యుడైన సాయి ఆశ్రిత్.. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి జిల్లా రాజతలాబ్ డివిజన్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయి ఆశ్రిత్ సెలవుపై హనుమకొండకు వచ్చారు. సాయి ఆశ్రిత్ తండ్రి శాఖమూరి అమర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆయన క్రెడాయ్ వైస్‌ప్రెసిడెంట్ కూడా. క్రెడాయ్ ప్రాపర్టీషోలో తన తండ్రి డైమండ్ స్పాన్సర్‌గా ప్రగతి డెవలపర్స్ పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను చూసేందుకు సాయి ఆశ్రిత్ ఆదివారం కేయూ 100 ఫీట్లరోడ్డులోని జీఎంఆర్ గార్డెన్‌లోని క్రెడాయ్ ప్రాపర్టీ షోకు వచ్చారు. ఈ సందర్భంగా సాయి ఆశ్రిత్‌ను క్రెడాయ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆశ్రిత్ క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. ప్రాపర్టీ ఎగ్జిబిట్స్, వివరాలు, ఇతరత్రా సమాచారాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోలో చేసిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాపర్టీ కొనుగోలు పట్ల ఆసక్తి కలిగినవారికి ఈ షోలో సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచినందుకు నిర్వాహకులను అభినందించారు.



సాయి ఆశ్రిత్‌ను సత్కరిస్తున్న క్రెడాయ్ నిర్వాహకులు

లక్నవరం టూరిస్టులకు లైఫ్‌థ్రెట్!



లైఫ్ జాకెట్లు లేకుండా జెట్టీ పడవలో పర్యాటకులు

ములుగు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు రావడంతో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఆదివారం వందలాది మంది తరలిరావడంతో సందడి నెలకొంది. రెండు ఉయ్యాల వంతెనలపై రద్దీ కనిపించింది. బోటు షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించారు. అయితే పర్యాటకులను నియంత్రించడంలో.. జాగ్రత్తలు తీసుకోవడంలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపించింది. జెట్టీ బోట్స్‌లో పరిమితికి మించి ఎక్కించారు. ఒక్కరికి కూడా లైఫ్ జాకెట్ ఇవ్వలేదు. రద్దీ ఎక్కువగా ఉందనే సాకుతో పదుల సంఖ్యలో పర్యాటకులను ఒకేసారి అనుమతించారు. వీరిలో చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. ఏదైనా ప్రమాదం జరితే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాబడిపై ఉన్న శ్రద్ధ పర్యాటకు భద్రతపై తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్న లక్నవరం వద్ద ఇక నుంచైనా రక్షణ చర్యలను పక్కాగా చేపట్టాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.

హోరాహోరీగా సెపక్‌తక్రా చాంపియన్‌షిప్

- రెగోలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన తెలంగాణ మహిళా జట్టు



లీగ్‌లో రాజస్థాన్ జట్టుతో పోటీ పడుతున్న తెలంగాణ రాష్ట్ర జట్టు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సెపక్‌తక్రా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం మహిళా రెగో విభాగంలో తెలంగాణ - ఢిల్లీ జట్ల మధ్య జరిగిన లీగ్‌లో ఢిల్లీ జట్టుపై తెలంగాణ జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ అర్హత సాధించింది. అదే విధంగా పురుషుల రెగో విభాగంలో రాజస్థాన్ జట్టుతో జరిగిన లీగ్‌లో తుది వరకు ఉత్కంఠగా జరిగిన పోరులో తెలంగాణ జట్టు రాజస్థాన్ జట్టు చేతిలో ఓటమి చెందింది. పురుషుల డబుల్స్‌లో తెలంగాణ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మహిళా జట్టు క్రీడాకారులు మహిళా డబుల్స్‌లో ఇప్పటికే ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించడంతో పాటు రెగోలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో తృతీయ స్థానానికే పరిమితమైన తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టు టీమ్ ఈవెంట్, రెగోలో ఓటమి పాలైంది. తెలంగాణ మహిళ జట్టు టీమ్ ఈవెంట్‌లో ఓటమి చెందినప్పటికీ మహిళల డబుల్స్‌లో ద్వితీయ స్థానంతో పాటు రెగోలో క్వార్టర్ ఫైనల్‌కు చేరి రాష్ట్ర ఖ్యాతిని కాపాడింది. జాతీయస్థాయి పురుషుల, మహిళ విభాగంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సెపక్‌తక్రా క్రీడాపోటీలు 5రోజులు పాటు నిర్వహించనున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానిగంటి సురేష్ తెలిపారు. డబుల్స్ టీమ్ ఈవెంట్, రెగోలో మూడు రోజుల పాటు క్రీడాకారులు మధ్య పోటాపోటీగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే రెగో విభాగంలో జట్లు క్వార్టర్ ఫైనల్స్ చేరుకోగా కాడ్ విభాగంలో పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ధన్‌రాజ్, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీ శ్రీకాంత్, తెలంగాణ రాష్ట్ర జట్టు కోచ్ కపిల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రెగో పోటీలో తలపడుతున్న తెలంగాణ క్రీడాకారిణి పూజిత

రూ.300 కోసం యువకుడి హత్య

- మద్యం మత్తులో స్నేహితుల ఘాతుకం
- బండరాయితో కొట్టి ఆపై దుస్తులకు నిప్పు
- జనగామ జిల్లా కేంద్రంలో ఘటన



వెంకన్న (ఫైల్)

జనగామ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : డబ్బుల కోసం తాగిన మైకంలో స్నేహితుడిని హత్య చేసిన సంఘటన జనగామలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మహబూబాబాద్ జిల్లాకు చెందిన వెంకన్న అనే వ్యక్తి జిల్లా కేంద్రంలోని రేల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉంటూ ఓకోటిని పట్టుకొని భిక్షాటన చేస్తూ, రైల్వే ట్రాక్‌పై ఎవరైనా మరణిస్తే మృతదేహాలను జనగామ మార్చురీకి తరలిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. శనివారం రాత్రి వెంకన్న, తన ముగ్గురు స్నేహితులతో కలిసి స్థానిక బార్‌లో మద్యం సేవించారు. అనంతరం వెంకన్నను రూ.300 ఇవ్వాలని స్నేహితులు అడగడంతో ఇవ్వలేదు. దాంతో వాగ్వాదం జరిగి, మాటామాటా పెరిగింది. ఆతర్వాత అంతా కలిసి బార్ వెనకాలకు వెళ్లారు. అక్కడే వెంకన్నను బండరాయితో కొట్టి దుస్తులకు నిప్పంటించారు. దాంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి ఎస్సై చెన్నకేశవులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి స్నేహితుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు జనగామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జనగామ మార్చురీకి తరలించారు. గతంలో వెంకన్న స్నేహితులు రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై సిగరెట్ తాగుతుండడంతో జీఆర్‌పీ పోలీసులతో కొట్టించాడనే అభియోగం కూడా ఉంది. దీంతో వీరికి తరచూ గొడవలు జరుగడంతో అది మనసులో పెట్టుకొని హత్య చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నిందితులు పోలీసుల కస్టడీలో ఉన్నట్లు సమాచారం. కేవలం రూ.300 కోసం హత్య జరగడంతో జిల్లాలో కలకలం రేపుతోంది.

కాంగ్రెస్ కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలి

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

వర్ధన్నపేట రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలకు తెరలేపిందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రుతండా శివారు జగన్ తండాలో జర్నలిస్టు రాజ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు తెలుపుతూ పనిచేస్తున్న జర్నలిస్టు రాజ్‌కుమార్‌ను అర్ధరాత్రి పోలీసులు అక్రంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. జర్నలిస్టు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడుతున్న పౌర సమాజంపై సైతం ఇలాంటి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అణచివేత పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గర పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు తుమ్మల యాకయ్య, ముత్యం సంపత్, మాలోతు వెంకన్న, గోపాల్ నాయక్, నెహ్రూ, శ్రీనివాస్, సురేష్, పిట్టల రాజు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తండాలో జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

జాతరకు ఐనవోలు ముస్తాబు

పెద్ద సంఖ్యలో తరలి రానున్న భక్తులు
అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



భక్తుల కోసం నిల్వ చేస్తున్న నీరు

ఐనవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి జాతరకు ఐనవోలు ముస్తాబవుతోంది. రాష్ట్రకూటులు.. కళ్యాణి చాళుక్యులు.. కాకతీయులు.. ఏ రాజులు, రాణుల చరిత్రను పరిశీలించినా.. వారంతా ఐనవోలు మల్లికార్జునస్వామి భక్తులేనని చారిత్రక ఆనవాళ్లు, శిలా శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. ఐనవోలుకు జానపదుల జాతరగా వందల ఏళ్ల ఘనచరిత్ర ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండో పెద్దజాతరగా ప్రసిద్ధి గాంచిన ఐలోని జాతరలోని మల్లన్న సన్నిధికి తరలిరావాలని భక్తులు సిద్ధమవుతున్నారు. 13న భోగి, 14న మకర సంక్రాంతి రోజున రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లను చేయడానికి అధికారులు తలమునకలయ్యారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య జాతర నిర్వహణ ఏర్పాట్లపై ఇటీవల సమీక్ష నిర్వహించగా యుద్ధప్రాతిపదకన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

గత జాతరను దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ప్రాంగణంలో విడిదిచేసే భక్తుల కోసం నీటి వసతిని కల్పించేందుకు మిషన్‌భగీరథ నీటిని ఓహెచ్ఆర్ ట్యాంక్ తోపాటు మినీ ట్యాంకులు, ప్రత్యేక నల్లాలు ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ నుంచి వచ్చే 10 ట్యాంకర్లను అందుబాటులోకి ఉంచనున్నారు. స్నానాలు ఆచరించడానికి ప్రాంగణంలో ఐదు చోట్ల నల్లాలను ఏర్పాటు చేశారు. మహిళలు స్నానం చేసి దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా మూడు చోట్లు తడకలతో గదులను నిర్మించారు.

మరుగుదొడ్లకు మరమ్మతు

భక్తుల సౌకర్యార్థం మూడు చోట్ల నిర్మించిన సుమారు 60 మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. నగర పాలక సంస్థ నుంచి రెండు మొబైల్ మరుగుదొడ్ల బస్సులను ఎప్పటిలాగే భక్తులకు అందుబాటులోకి తీసుకవస్తున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం



జాతరలో భక్తుల ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రధానంగా నీరు, పారిశుధ్యం, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ఏర్పాట్లు చేశాం. దేవాదాయశాఖ ఏర్పాట్లకు అదనంగా ఖర్చుచేసింది. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో జాతరను విజయవంతం చేస్తాం.

అద్దంకి నాగేశ్వర్‌రావు, ఈవో

నిరంతరం విద్యుత్ సరఫరా

జాతరలో నిరంతరం విద్యుత్తు సరఫరా కోసం 4 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే మరో ఫీడర్ ద్వారా పునరుద్ధరించేందుకు విద్యుత్ సంస్థ అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యుత్ చార్జీల కోసం దేవస్థానం ముందుగానే రూ.5లక్షలు చెల్లించింది.

అందుబాటులో వైద్యం

స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించడంతోపాటు మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. 108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు.



నూతనంగా తయారు చేసిన రథం

పారిశుధ్యం

జాతరలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రోజులపాటు నగరపాలక సంస్థ నుంచి 180 మంది సిబ్బంది, 15 మంది జవాన్లు, 11 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక సూపర్‌వైజర్ పనిచేయనున్నారు. 2 ఫాగింగ్ యంత్రాలు, 10 చెత్తను తరలించే స్వచ్ఛ ఆటోలు, 2 రోడ్డును శుభ్రం చేసే స్వీపింగ్ వాహనాలు ఏర్పాటు చేశారు.

అదేవిధంగా ఐనవోలు, ధర్మసాగర్, హసన్‌పర్తి, దామెర మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది సుమారు 200 మంది పనిచేయనున్నారు. 10 జీపీల ట్రాక్టర్లను సిద్ధం చేశారు. డస్ట్ బిన్‌లు మొత్తం 300 ఏర్పాటు చేశారు. దేవస్థానం నుంచి 30 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హనుమకొండ డిపోకు చెందిన 50 ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను జాతరకు చేర్చనున్నారు. వరంగల్ నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఐనవోలుకు బయలుదేరుతుంది. ఐనవోలు - కాజీపేట - కొమురవెల్లి - వేములవాడలకు భక్తులు వెళ్లే విధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ప్రత్యేక బృందాలు

ప్రతీ శాఖకు ఒక అధికారిని పనులు పర్యవేక్షించేందుకు నియమించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది రెండు రోజుల పాటు విధులు నిర్వహించనున్నారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు పెట్టి చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు గ్రూపులో పోస్టు చేస్తున్నారు. ఈ గ్రూపులో కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తదితరులు ఉన్నారు.



ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, లైన్లు

మల్లన్న జాతర షురూ

ఐనవోలులో వైభవంగా ధ్వజారోహణం • ఉత్సవాలు ప్రారంభమైనట్లు అర్చకుల ప్రకటన • ఆలయానికి తరలి వస్తున్న భక్తులు • చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా గౌరీశంకర్



మహాన్యాసక రుద్రాభిషేక అలంకరణలో స్వామి



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

ఐనవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. తొలుత స్వామి వారికి ఒగ్గుపూజారులు మేలుకొలుపు చేయగా శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వరపూజ, రుద్రాభిషేకం, నూతన వస్త్రాలంకరణ చేశారు. ఉదయం గణపతి పూజ శైవశుద్ధి పుణ్యాహవాచనం నిర్వహించారు. దేవతలను ఆలయంలోకి ఆహ్వానిస్తూ ఉత్సవ ప్రారంభ సూచికగా కాషాయ ధ్వజ పతాకాలను చేతపట్టి మంగళవాయిద్యాలతో పరుష సూక్త మంత్ర పఠనంతో మూడుసార్లు గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయ శిఖరంపై ఎగురవేశారు. అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము మహానివేదన నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎండోమెంట్ శాఖ సూపరింటెండెంట్ ఈ.గౌరీశంకర్‌ను నియమించారు.

తరలి వస్తున్న భక్త జనం

మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం కావడంతో మల్లన్న సన్నిధికి భక్తుల రాక మొదలైంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి వస్తున్న భక్తులు విడిది చేస్తుండటంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. నృత్యమండపం ఖాళీ స్థలం లేకుండా భక్తులు విడిదిచేశారు. రాత్రి పొద్దుపోయే వరకు భక్తుల రాక పెరుగుతూ పోయింది. సోమవారం జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఐనవోలుకు వచ్చే అన్ని ప్రధాన దారులు భక్తుల వాహనాలతో రద్దీ అయ్యాయి. ఆర్టీసీ బస్సులు ప్రయణికులను చేరవేస్తున్నాయి. వచ్చిన భక్తులు పట్నాలు, మొక్కులు తీర్చుకుంటూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఢమురకం, డోలు శబ్దాలతో ఆలయం ప్రాంగణం మారుమోగుతోంది. 13న సోమవారం భోగి, 14న మంగళవారం మకర సంక్రాంతి రెండు పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాగజోగోపాల్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి సీసీ పుటేజీలతో జాతర బందోబస్తును పరిశీలించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, ఎక్సైజ్, డబ్ల్యూజీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పోలీసులు జాతర విధుల్లో నిమగ్నమయ్యారు.

నేడు మల్లన్న సన్నిధిలో భోగి పూజలు

భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో సోమవారం ఉదయం స్వామి వారికి ప్రాతఃకాలం మేలుకొలుపుతో పూజలు ప్రారరంభమవుతాయి. విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనలు, మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకములు, మంత్ర పుష్ప పూజలు జరుగున్నాయి.



త్రిశూలాలతో బీరన్న భక్తుల విన్యాసాలు



బోనంతో భక్తురాలు

కొత్తకొండ జాతరకు పోయొద్దామా..

» నేడు ప్రారంభం కానున్న పెద్ద జాతర » ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు » 600 మంది పోలీసులతో బందోబస్తు

భీమదేవరపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీని తట్టుకునే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 13న భోగి పండగను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి శ్రీచక్రార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. సోమవారం సాయంత్రం కడిపికొండ, ఉల్లిగడ్డ దామెర గ్రామాల నుంచి కుమ్మరులు వారి ఎడ్లబండ్లకు ఊరేగింపుగా దేవస్థానానికి వస్తారు. వీరబోనం గద్దె వద్ద శివసత్తులు, కుమ్మరుల ఎడ్లబండ్లలతో వీరనృత్యాలతో వీర బోనం, వీర ఖడ్గం వేస్తూ స్వామి వారి ఆలయంలోకి ప్రవేశిస్తారు. స్వామివారికి, అమ్మవారికి బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమవుతోంది. జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాల కాంతులతో వెలిగిపోతోంది. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్లు, చలువ పందిళ్లు, ఆలయంలో ఫ్లైఓవర్లు నిర్మించామన్నారు. ఆదివారం నుంచే భక్తుల రద్దీ మొదలైంది. జాతర ప్రాంగణంలో రంగులరాట్నాలు, మిఠాయి, బొమ్మల దుకాణాలు విరివిగా వెలిశాయి. భోగి పండుగ సందర్భంగా సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్లు

భారీ బందోబస్తు

సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ సలీమా ఆదేశాల మేరకు ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో కొత్తకొండ జాతరలో 600మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు. జాతరలో పోలీసులు మఫ్టీలో సైతం తిరుగుతూ, సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షిస్తామన్నారు. షీ టీమ్స్‌తో పాటు ఉమెన్స్ ఫోర్స్, పలువురు సీఐలు, ఎస్ఐలు తదితరులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తకొండ జాతరకు వచ్చే ముల్కనూర్, ముస్తాఫాపూర్, చంటయ్యపల్లి, మల్లారం నాలుగు దిక్కులా నాలుగు చెక్ పోస్టులు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. జాతరలో ఏమైనా ఇబ్బందులు జరగకుండా పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వివిధ గ్రామాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల నుంచి పారిశుధ్య సిబ్బంది డీపీవో లక్ష్మీరమాకాంత్ ఆధ్వర్యంలో విధులకు హాజరయ్యారు.



జాతర బందోబస్తుకు వచ్చిన పోలీసులు

వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో స్వామివారికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన చేశారు. ఒక్కోనామంతో స్వామివారిని కొనియాడుతూ బిల్వార్చన చేశారు. ఒక బిల్వా స్వామికి సమర్పిస్తే త్రిదలం, త్రికునాకారం, పాప సంహారం, ఏక బిల్వ శివార్పణం.. అంటూ పూజలు నిర్వహించారు. బిల్వార్చకంలో చెప్పబడిన మూడు జన్మల్లో చేసిన పాపం ఒక దలం సమర్పిస్తే తొలు గుతుందని శాస్త్రాలు చెబుతున్నాయని ఆలయ అర్చకులు తెలిపారు. మహిమ గల లక్ష బిల్వాలను స్వామి వారికి సమర్పించారు. భక్తులం దరూ కోరిన కోర్కెలు నెరవేరాలని, ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆల య ఈవో కిషన్ రావు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా తెలిపారు.

బస్సు సౌకర్యం

కొత్తకొండ జాతరలో హుజూరాబాద్, హనుమకొండ, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి కొత్తకొండ జాతరకు బస్సు సౌకర్యాలు కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మూడు డిపోల నుంచి 20 బస్సుల చొప్పున నిరంతరం జాతరకు బస్సులు నడుపుతామన్నారు. మహాలక్ష్మి పథకం కింద జాతరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఐదు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు

కొత్తకొండ జాతరలో ఐదు వాటర్ ప్లాంట్లను బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఉచితంగా అందజేశారు. ఉచిత తాగునీ టి వాటర్ ప్లాంట్లను ఆదివారం సురేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు చిట్టంపల్లి అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

జాతరలో విస్తృత ఏర్పాట్లు



కొత్తకొండ జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాం. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఉచిత వీఐపీ పాస్‌లను పూర్తిగా రద్దు చేశాం. వీఐపీ దర్శనం కావాల్సిన వారు రూ.200 టికెట్ కొనుగోలు చేసి స్వామివారిని దర్శించుకోవాలి. భక్తులకు ఆర్టీసీ, వైద్యం, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్, తదితర సేవలను పూర్తిగా అందిస్తాం. భక్తులకు ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

కిషన్‌రావు, ఆలయ ఈవో, కొత్తకొండ

పేదోడి ఇంటికే సంక్షేమ పథకాలు

» 26 నుంచి మరో నాలుగు పథకాలు ప్రారంభం
» 16 నుంచి గ్రామ సభలు పారదర్శకంగా నిర్వహించాలి
» రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
» హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

హనుమకొండ టౌన్/హనుమకొండ కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన తర్వాత పేదోడి ఇంటికి ఈ నెల 26న ప్రతీ సంక్షేమ పథకం చేరాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అధికారులు ఈ నెల 16 నుంచి గ్రామాలకు వెళ్లి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్లకు, వివిధ శాఖల అధికారులకు సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, మంత్రులు సంక్షేమ పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై తీసుకోవాల్సిన నిర్ణయాలను కూలంకుశంగా చర్చించారు. సమీక్షలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాం చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, నగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ భాషా, దివాకర, ఆరు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఐటీడీవో మిశ్రా, సంబంధిత జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి నాలుగు పథకాలను ప్రారంభిస్తోందన్నారు. అర్హులైన వారు ఎంత మంది ఉన్నా.. ఈ నాలుగు ప్రభుత్వ పథకాలు అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదన్నారు. ఎక్కడ చిన్న తప్పిదం జరగకుండా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ లబ్ధిదారుడిని ఎంపిక చేసేందుకు కలెక్టర్లు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఏ కార్యక్రమం జరుగుతుందో మొక్కుబడిగా చేయకుండా చిత్తశుద్ధితో అధికారులు ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదోడి కల నెరవేరుస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల సమక్షంలో గ్రామ సభలను నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిల్లో, మున్సిపాలిటీల స్థాయిల్లో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభ నిర్వహించే ముందు గ్రామాల్లో చాటింపు వేయించాలన్నారు. రాబోయే ఉగాది నుంచి పేదలకు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సన్నబియ్యం ఇవ్వటానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు రెండు విడతలుగా రూ.12వేలు అందజేస్తామన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లులేని నిరుపేద కుటుంబాలకు మొదటగా అవకాశం కల్పించాలన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో ముందుకెళ్లాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా అర్హులనే గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గ్రామాలలో ఇందిరమ్మ కాలనీలు ఇప్పటికీ ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిరుపేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పారదర్శకంగా అందేలా చూడాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులను మండల స్థాయి ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలోని 13 మండలాల్లోని 186 రెవెన్యూ గ్రామాలకు 158 బృందాలను నియమిస్తూ నాలుగు పథకాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేసిన ట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో లబ్ధిదా రుల్లో అర్హులను గుర్తించి 21 నుంచి 24 తేదీ వరకు ఆయా గ్రామ సభల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో లిస్టులను ప్రదర్శిస్తామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సుమారు 3 వేల మంది వివరాలు గల్లంతయ్యాయని తెలిపారు. ఎడిట్ ఆప్షన్ కేటాయించి నమో దుకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో రోజంతా ఉండి నాలుగు పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలన్నారు.



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రులు సురేఖ, సీతక్క



మంత్రి పొంగులేటికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు

అధికారులు తమాషాలు చేయొద్దు

హనుమకొండలో ఆదివారం సమీక్ష సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇటీవల జరిగిన సర్వే వివిధ కార్యక్రమాల గురించి మాట్లాడుతుండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి పొంగులేటి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమాషా చేస్తున్నారా.. మీటింగ్ పూర్తయిన తర్వాత ఇద్దరు అధికారులు తనను కలవాలని హుకుం జారీ చేశారు. దీంతో అధికారులు కొంత అసహనానికి గురయ్యారు.

డాక్టర్ అనితారెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

బాలసముద్రం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి ప్రతిష్ఠాత్మకమైన లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలోని ఇండోగ్లోబల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాలస్తీనా ఎంబసీ కౌన్సిలర్ బేసిమ్ ఎఫ్ హెలెన్, నోయిడాకు చెందిన గాల్ గోటీఎస్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖుల చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. వినియోగదారుల రక్షణ చట్టంపై వందల సంఖ్యలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డును అందించినట్లు ప్రముఖులు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న అనితారెడ్డి

బిందాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రమేశ్‌బాబు

రెడ్డికాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బిందాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బత్తుల రమేశ్‌బాబు ఆదివారం 4వ డివిజన్ జ్యోతిబసునగర్ కాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. యేటా ట్రస్టు ద్వారా డివిజన్‌లోని పేద ప్రజలకు దుప్పట్లు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులను అందజేస్తామని అన్నారు. జ్యోతిబసునగర్ కాలనీ, యాదవనగర్ పెట్రోల్‌పంపు ఎదురుగా ఉన్న చిరువ్యాపారుల కుటుంబాలకు 900 దుప్పట్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ బత్తుల సరిత, రేషన్ డీలర్ల సంక్షేమసంఘం బాధ్యులు శ్రీధర్ యాదవ్, టి.సమ్మన్న, జి.రమేశ్, డి.నరేందర్, ఎస్.మహేందర్, కె.సురేశ్, జి.రాజ్‌కుమార్, బి.మహేశ్, కె.శ్రీను, సిహెచ్.రాజు, డి.నవీన్, పి.రమేశ్, వెంకటేశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని మరో దఫా ఆదరించాలి



కేయూలో నర్సిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి వేసి మరో దఫా అవకాశం కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్‌సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ కోరారు. ఆదివారం కేయూ క్యాంపస్‌లోని పరీక్షల విభాగం ఎదుట తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నేతృత్వంలో నర్సిరెడ్డికి మద్దతుగా అధ్యాపకులను కలిసి తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ నవీన్, రవీందర్, కుమారస్వామి, కవిత, హరిశంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు మక్కువ కనబర్చాలి



సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న అబ్దుల్ హన్నన్

వడ్డెపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పై విద్యార్థులు మక్కువ కనబర్చాలని అన్సార్ సంస్థ చైర్మన్ అబ్దుల్ హన్నన్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లి శివారులోని అన్సార్ హైస్కూల్‌లో ఆదివారం సైన్స్‌ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను ఆయన తిలకించారు. కార్యక్రమంలో అన్సార్ సంస్థ సెక్రటరీ ముజాహిద్ ఇర్ఫాన్, అడ్మినిస్ట్రేటర్ వాహజుల్‌హక్, ట్రెజరర్ దస్తగిర్, ప్రిన్సిపాల్ చిరంజీవి, సోహెల్‌ఖాన్, ఉమర్‌సాబ్, అలీంసాబ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కరిష్మా గార్డెన్స్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మడికొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక కరిష్మా గార్డెన్స్‌లో జరిగింది. 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లు, బాల్య స్మృతులు పంచుకున్నారు. చిలిపి చేష్టలు నెమరు వేసుకొని సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో విజయ్, తిరుపతి, మోహన్‌లాల్, రఘు, పవన్, కెవిన్, రాధిక, అరుణ, కవిత, రజిత, రేణుక పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నాయిని నీలిమారెడ్డి

వడ్డెపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎస్వీఎస్ కాలనీ రోడ్డులోని ఇందిరా నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డొంగర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు వేసిన ముత్యాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి, స్థానికకార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూరెళ్ల రవికిరణ్‌గౌడ్, డివిజన్ మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు తేళ్ల సుగుణ కిశోర్, కాలనీ ప్రతినిధులు మరిగంటి ధన్‌రాజ్, విజయలక్ష్మీ, కవిత, పల్లవి, గుడి విజయ, రాధికతో పాటు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి



సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి, తదితరులు



హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న పరుశురాములు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమని జాతీయయువజన పురస్కార గ్రహీత డాక్టర్ మండల పరుశురాములు అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడాశాఖ, నెహ్రూ యువ కేంద్రం వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరుశురాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద భారతదేశం యొక్క గొప్ప ఆధ్యాత్మిక శిఖర పురుషుల్లో ఒకరు అని, ఆయన ఇచ్చిన నైతిక సందేశాలు గ్లోబల్ యూత్‌కి మార్గదర్శకంగా మారాయని కొనియాడారు. విశిష్ట అతిథి నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యానికి యువజన సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకత్వం, సహాయాన్ని అందిస్తుందని, యువత షై భారత్ వేదికను అనుసరించి స్వామి వివేకానంద సందేశాలను ఆచరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాశాఖ సూపరింటెండెంట్ విజయశ్రీ, జాతీయ యువజన పురస్కార గ్రహీత డాక్టర్ ఆకులపెల్లి మధు, యువజన పురస్కార గ్రహీత గంగోజు నరేష్, జూనియర్ అసిస్టెంట్ వి.శ్రీనివాస్, డీఎస్ఏ కోచ్‌లు, వృత్తి నైపుణ్య శిక్షకులు, యువత పాల్గొన్నారు.

- హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు జిల్లా పాలక వర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, చెన్నమనేని జయశ్రీ, బాశెట్టి హరిప్రసాద్‌తోపాటు రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

న్యూశాయంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన త్రివేదాద్రి సంతోషలక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ రూ.54లక్షలతో అంతర్గత రోడ్డు, సైడ్ డ్రైనేజీ, ఆలయ చుట్టూ గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఆలయానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదిస్తే సహాయం చేస్తానని అన్నారు. దేవాలయంలో జరిగిన శ్రీగోదారంగనాథుల కల్యాణోత్సవంలో మంత్రి సురేఖ, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సధారాణి పాల్గొన్నారు. అనంరతం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షులు అంకేశ్వరపు సురేందర్, దేవాలయ చైర్మన్ గ్రంథి సత్యవతి, స్థానిక కాంగ్రెస్ నాయకలు రమేష్, కృష్ణ, వేణు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ గిరిప్రదక్షణ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ

సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు పెడితే కేసు

హసన్‌పర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా, కుల సంఘాన్ని కించపరిచే పోస్టులు పెడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, గౌడ కుల సంఘానికి కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. తన భూమిలో తాడి చెట్ల తొలగింపు విషయంలో గౌడ కుల పెద్దమనుషులు తనకు సహకరించడం లేదని వెంకటేశ్వర్లు, చెట్లు తొలగిస్తే ఉపాధి పోతుందని గౌడ కుల పెద్ద మనుషుల మధ్య తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న తాళ్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్ కులాన్ని, పెద్ద మనుషులను టార్గెట్ చేస్తూ అవమానకరమైన, అసభ్యకరమైన పోస్టులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితుడు సాంబరాజుగౌడ్ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నవీన్



మడికొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ సిఫారసు మేరకు మడికొండకు చెందిన దువ్వ నవీన్ హనుమకొండ జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైనట్లు ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, పార్టీ రాష్ట్ర నాయకులు వేముల నరేంద్రరావు వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తూ అందరినీ కలుపుకొనిపోయి పార్టీ బలోపేతానికి బాధ్యతో కృషి చేస్తానని తెలిపారు. సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, తిరుపతిరెడ్డి, కేశవరెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పటేల్, వర్ధన్నపేట అసెంబ్లీ కో కన్వీనర్ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర జిల్లా నాయకులకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

19న జరిగే డప్పు ప్రదర్శనకు మాదిగలు తరలిరావాలి



లష్కర్‌సింగారంలో డప్పు ప్రదర్శన చేపట్టిన ఎమ్మార్పీస్ శ్రేణులు

రాంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వెయ్యి గొంతుకలు - లక్ష డప్పుల మహాప్రదర్శన విజయవంతం కోసం ఈనెల 19న హనుమకొండ జిల్లాలో జరిగే సన్నాహక సమావేశానికి ప్రతీ మాదిగ బిడ్డ డప్పు వేసుకొని అంబేద్కర్ జంక్షన్‌కు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నయీంనగర్‌లోని లష్కర్‌సింగారంలో ఏర్పాటు చేసిన డప్పుల ప్రదర్శనకు సుకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు - లక్ష డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 19న హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో డప్పు పదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నాడన్నారు. ప్రతి మాదిగబిడ్డ డప్పుతో తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రకాశ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొక్క రాజేశ్, డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులు అలువాల ఎల్లేశ్, బన్నీ, ఓదెలు, సిలువేరు బిక్షపతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

ఐనవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు జాతర ఉత్సవ కమిటీ(ధర్మకర్తలు) సభ్యులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం సన్మానించారు. ఐనవోలు జాతర దృష్ట్యా ఈ నెల 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల కోసం 14మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని ఎండోమెంట్ కమిషనర్ నియమించింది తెలిసిందే. జాతర ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నాక స్వామి వారి కండువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగు రోజులు ఉత్సవ కమిటీ సభ్యులు జాతరలో అందుబాటులో ఉండి భక్తులకు సేవలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఇవో అద్దంకి నాగేశ్వర్‌రావు, సీఎఫ్‌వో గౌరిశంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారిని(డీసీవో) దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 5వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025-26 విద్యాసంవత్సంలో వివిధ గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఇంగ్లీష్ మీడియం 5వ తరగతి లో ప్రవేశాల కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 22న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీ లోపు కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే 6 నుంచి 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, సైనిక్ స్కూల్, ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీసీవో కోరారు.

అనారోగ్యంతో జర్నలిస్టు కుమారస్వామి మృతి



కుమారస్వామి (ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం ఓ ప్రైవేటు చానల్‌లో పనిచేసి అనారోగ్యానికి గురైన హసన్‌పర్తికి చెందిన సీనియర్ జర్నలిస్టు తంగెళ్లపల్లి కుమారస్వామి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం హసన్‌పర్తిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. కుమారస్వామి మృతి పట్ల హసన్‌పర్తి మీడియా పాయింట్ జర్నలిస్టులు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉత్తమ వాకర్స్ అధ్యక్షులకు సన్మానం

హసన్‌పర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అవార్డు అందుకున్న హసన్‌పర్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్ల దుర్గారాంలను కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఆదివారం ఏకశిల పార్క్‌లో జరిగిన ఇంటర్నేషనల్ (303) వాకర్స్ అసోసియేషన్ నూతన గవర్నింగ్ బాడీ ఎన్నిక సమావేశంలో గవర్నర్ పచిమట్ల ఎల్లగౌడ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికకావడం పట్ల ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కందుకూరి సంజీవ్, మారపల్లి రాంచంద్రారెడ్డి, పావుశెట్టి శ్రీధర్, పర్శ సతీష్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆరెల్లి వెంకటస్వామి, కోశాధికారి కోడెల మురళి, ప్రధాన కార్యదర్శి వేల్పుల సంపత్, కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాగమల్ల సుధీర్, దూబల భాస్కర్, బోడ యుగం దర్, పోతరాజు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల దృష్ట్యా యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధి గుండ్లసింగారం ఫీడర్ పరిధిలోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డు ఏరియా, ఆర్‌కె హోటల్ ఏరియాలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

దత్తక్షేత్రంలో తైలాభిషేకం

వరంగల్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి తైలాభిషేకం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ మహా మంగళహారతి, నైవేద్య నివేదన నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్ రావు, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, చకిలం ఏకాంబరం, డాక్టర్ వొద్దిరాజు శార్వాణి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న స్నేహితులు

మడికొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని ప్రభుత్వ పాఠశాలలో 2004-05 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అంగిడి ఏలేంద్ర ఈనెల 2న మృతి చెందారు. విషయం తెలిసి తోటి పూర్వ విదార్థులు ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఏలేంద్ర చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆమె కుమార్తె అంగిడి వైష్ణవికి రూ.32వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

కొవ్వుకు చెక్.. రుచికి బెటర్..

- దావత్ అంటే నాటుకోడి ఉండాల్సిందే
- సంక్రాంతి సందర్భంగా పెరిగిన గిరాకీ
- కిలో రూ.500లకు చేరిన ధరలు

మామునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సాధారణ చికెన్‌తో పోలిస్తే నాటుకోడి కూర రుచే వేరు. తెలంగాణ సంప్రదాయంలో ఇంటికి వచ్చిన చుట్టానికి నాటుకోడితో దావత్ ఇవ్వాల్సిందే. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ నడుస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం మార్కెట్లో నాటుకోళ్ళకు విపరీతమైన గిరాకీ ఎర్పడింది. రెండుకిలోల బరువుండే కోడి వేయి రూపాయలు పలకింది. మిగతా రోజుల్లో రూ.400లకు మించి ఉండేది కాదు. సంక్రాంతి సీజన్ కావడంతో నాటుకోడి కోయడం,తినడం సహజం కావడంతో వ్యాపారులు రేట్లు పెంచేశారు.



ఒకప్పుడు నాటుకోడి దొరకడం గగనంగా ఉండేది. ఆ కోళ్లను తెలిసిన వారి ఇళ్ళ నుంచి కొనుగోలు చేసేవారు. దీనిని డ్రెస్సింగ్ చేయడం కష్టంగా భావించే వారు. పైగా దానిని కాల్చితేనే బాగుంటుందన్న అభిప్రాయం ఉండడంతో ఇంత కష్టం ఎందుకని జనం దాని జోలికి పోవడం మానేశారు. కానీ, ఇప్పుడు చికెన్ సెంటర్లలోనే నాటుకోళ్లు లభిస్తున్నాయి. వారే కాపి కోసి ఇస్తున్నారు. మటన్ ధరతో పోలిస్తే తక్కువ ధర తక్కువ కావడంతో జనం మక్కువ చూపుతున్నారు. అంతేగాకుండా నాటు కోడి మందులు అవసరం లేకుండా సహజంగా పెరుగుతుందని, పైగా మాంసం రుచిగా ఉంటుందని, కొవ్వు ఉండదని, తొందరగా జీర్ణం అవుతుందని ఆహార నిపుణులు చెపుతున్నారు. బాయిలర్ చికెన్ కంటే నాటు కోడి తింటే ఆరోగ్యానికి మంచిదన్న ప్రచారంతో ఇటీవల కాలంలో నాటుకోళ్ళకు గిరాకీ పెరిగింది. మేక, గొర్రె మాంసం తింటే కొవ్వు పెరుగుతుందని, ప్రస్తుతం చేపలు తక్కువగా దొరుకుండతో నాటు కోడి కూరనే తినాలని జనాల్లో ఆసక్తి పెరుగుతోంది.



నాటుకోళ్లనే ఎక్కువగా కొంటున్నారు..

- బొల్లం అరుణ్, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, మామునూరు



పండుగ నేపథ్యంలో చాలా మంది బాయిలర్ కోళ్ళ కంటే నాటు కోళ్లను ఎక్కువగా కొంటున్నారు. దళారులు గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నాటుకోళ్ళను కొంటాం అంటూ కొనుగోలు చేసి మాకు అమ్ముతారు. వాటిని మేము రూ.450 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నాం.





పండక్కి ప్రత్యేకంగా...

పండుగ రోజున ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తూ ఉంటారు. పండుగ శోభ ఉట్టిపడేలా అందరిలో ప్రత్యేకంగా కనిపించాలంటే అందమైన చీర దానికి తగ్గ జాకెట్ ధరించాల్సిందే! ఏ చీర మీద ఏ రంగు జాకెట్ వేసుకోవాలో, ఏ నగలు పెట్టుకోవాలో తెలుసుకుందాం!

- పండుగ ఏదైనా సరే.... మహిళల తొలి ఎంపిక ఆకుపచ్చ రంగే! జరీ బోర్డర్ ఉన్న ముదురు ఆకుపచ్చ రంగు పట్టు చీర మీద మెరూన్ రంగు జాకెట్ వేసుకుంటే ఎవ్వరికైనా చక్కగా నప్పుతుంది. జాకెట్ చేతులకు కూడా జరీ బోర్డర్ ఉంటే మధ్య వయసు మహిళలకు హుందాగా ఉంటుంది. అదే యువతులకైతే ఆకుపచ్చని దారాలు, బంగారు రంగు గుండ్లతో ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన జాకెట్ బాగుంటుంది. మెడలో ముత్యాల గొలుసు వేసుకుంటే అందరి చూపు మీ మీదే!
- పసుపు శుభ సంకేతం. సంప్రదాయకంగా కనిపించాలనుకునేవారు పసుపు రంగు చీరతో పాటు ఎరుపు లేదంటే గులాబీ రంగు జాకెట్ ధరించవచ్చు. దీనిమీద పగడాల సెట్ లేదా కెంపుల హారం వేసుకుంటే కుందనపు బొమ్మలా కనిపిస్తారు. ఈ రంగు చీర మీద యాంటిక్ నగలు కూడా బాగుంటాయి.



- ఎరుపు రంగు ధైర్యానికి, సంప్రదాయానికి ప్రతీక. జరీ బోర్డర్, జరీ పువ్వులతో నిండిన ఎర్రని పట్టు చీరతోపాటు అదే రంగు లేదా బంగారు రంగు జాకెట్ ధరిస్తే తెలుగుతనం మూర్తీభవించినట్లు కనిపిస్తారు. చంద్రహారం, కాసుల పేరు, వడ్డాణం లాంటి సంపదాయ నగలు ఈ చీర మీద గ్రాండ్‌గా కనిపిస్తాయి.
- యువతులు వంకాయ రంగు లేదా గులాబీ రంగు చీర మీద సీక్వెన్స్ వర్క్ చేసిన ఆకుపచ్చ రంగు జాకెట్ ధరిస్తే రాజసంగా కనిపిస్తారు. ఈ చీరల మీద బంగారు నగలు, ముత్యాల హారాలు, బ్లాక్ మెటల్ నగలు వేసుకోవచ్చు.
- సింపుల్‌గా, హుందాగా కనిపించాలనుకునేవారు ఉదా, లేత ఆకుపచ్చ, బ్రౌన్, గోధుమ రంగు చీరలు ధరించవచ్చు. వీటి మీద ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన జాకెట్లు, నెట్టెడ్ బ్లౌజ్‌లు అందంగా ఉంటాయి. ఏ వయసు వారికైనా ఇవి చక్కగా నప్పుతాయి. రంగు రంగుల బీడ్స్‌తో తయారు చేసిన నగలు లేదంటే పెద్ద లాకెట్ ఉన్న ముత్యాల హారం వేసుకుంటే ప్రత్యేకంగా కనిపించవచ్చు.

పర్వదినం

నవ చైతన్య క్రాంతి

మన సనాతన సంప్రదాయం పండగలతో ముడిపడి ఉంది. ఈ పండగల వెనుక కొన్ని వేల సంవత్సరాల క్రితం నేంచి మన పూర్వీకులు అనుసరిస్తున్న సంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా సంక్రాంతి దేవుళ్లకు సంబంధించిన పండగ కాదు. ప్రకృతిని అనుసరించి చేసుకొనే పండగ. తెలుగువారి పండగలు చాంద్రమానాన్ని అనుసరించి, తిథుల ప్రకారం జరుగుతాయి. రాశులను అనుసరించి, సౌరమానం ప్రకారం నిర్వహించే పండగ మకర సంక్రాంతి. హేమంత ఋతువులో మార్గశిర, పుష్య మాసాలు ఉంటాయి. సూర్యుడు ధనూరాశిలోకి ప్రవేశించినప్పుడు... ధనుస్సంక్రమణం నుంచే సంక్రాంతి సన్నాహాలు ప్రారంభమవుతాయి. ధనుర్మాసంలో మహిళలు తెల్లవారుజామునే ఇంటి ముంగిళ్ళను శుభ్రపరచి, కల్లాపి చల్లి, రంగవల్లికలు దిద్ది, వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి, పసుపు కుంకుమలతో బొట్లు పెట్టి, గుమ్మడిపూలతో అలంకరిస్తారు. గొబ్బి పాటలు పాడుతూ, వాటి చుట్టూ ఆడుతూ సందడి చేస్తారు.

భోగి అంటే భోగం...



రాశులను అనుసరించి ఎన్ని సంక్రాంతులున్నా... సంక్రాంతి... అంటే మకర సంక్రాంతే. ఇది మూడు రోజుల పండగ. మొదటి రోజు భోగి. ఈ పదం 'భుజ్' అనే సంస్కృత ధాతువు నుంచి వచ్చింది. అంటే 'భోగము' అని అర్థం. కాగా 'తొలినాడు' అనే అర్థాన్ని కూడా తెలుగు నిఘంటువులు చెప్పాయి. ఇది ధనుర్మాసం చివరిరోజు. దక్షిణాయనం ముగిసే రోజు కూడా. భోగి నాడు తెల్లవారుజామున ఇళ్ళ ముందు మంటలు వేస్తారు. ఇంట్లోని పనికిరాని వస్తువులను, పిడకల దండలను మంటల్లో వేస్తారు. ఆ మంటల దగ్గర పాత్రల్లో నీటిని కాచి, స్నానం చేస్తారు. ఈ భోగి స్నానం వల్ల దుష్టపీడలు తొలగిపోతాయని, శుభాలు కలుగుతాయని విశ్వాసం. ఇళ్లలో బొమ్మల కొలువులు పెడతారు. సాయంత్రం వేళ చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి, పేరంటం చేసి, పెద్దల ఆశీస్సులు పొందుతారు.

పెద్దల పండగ



రెండో రోజు మకర సంక్రాంతి. సూర్యుడు మకరరాశిలోకి సంక్రమణం చేస్తాడు. ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. అభ్యంగనస్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, ఉదయిస్తున్న సూర్యుడికి ప్రణామం చేసి, దైవ దర్శనంతో పాటు, పెద్దలకు నమస్కరించి ఆశీస్సులు పొందడం, నువ్వులు, బెల్లం, గుమ్మడి పండు, తాంబూలం, వస్త్రాలను దానం చేయడం శుభప్రదం. ముత్తయిదువులకు పసుపు కుంకుమలు, తాంబూలాలను ఇచ్చి ఆశీస్సులు పొందడంవల్ల సౌభాగ్యం స్థిరంగా ఉంటుందనే విశ్వాసం ఉంది. సంక్రాంతి రోజున ఇంటిపెద్దలు పూర్వీకులకు తర్పణాలు, పిండప్రదానాలు నిర్వహిస్తే... ఆ పూర్వీకులకు పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ రోజున పుట్టింటికి వచ్చే ఆడపిల్లలకు, అల్లుళ్ళకు యథోచితంగా కానుకలు ఇవ్వడం, బంధుమిత్రులతో విందు వినోదాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం ఆనవాయితీ. అందుకే దీన్ని 'పెద్దల పండగగా, 'అల్లుళ్ళ పండగగా కూడా వ్యవహరిస్తారు.

పుడమికి, గోసంతతికి కృతజ్ఞతగా...



మూడో రోజు కనుమ. ఇది పూర్తిగా కర్షకులకు సంబంధించిన పండగ. ఈ రోజున వ్యవసాయదారులు తమ పశువుల కొట్టాలను శుభ్రపరచి, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. ఏడాది పొడుగునా తమకు సహకరించిన పశువులను కడుగుతారు. వాటి కొమ్ములకు రంగులు వేస్తారు. మెడలో గంటలు, కాళ్ళకు గజ్జెలు కట్టి అందంగా అలంకరిస్తారు. పొంగలి వండి, నివేదించి వాటికి పెడతారు. ఆ పొంగలిని కళ్ళాలలోనూ చల్లుతారు. దీన్ని 'పొలి కట్టడం' అంటారు. అలా చేయడం వల్ల తమ పంటలను దుష్ట శక్తులు పాడు చేయవని వారు నమ్ముతారు. ఇలా పుడమికి, ప్రకృతికి, గోసంతతికి కృతజ్ఞత తెలిపే అవకాశం కల్పించే మూడు రోజుల పెద్ద పండగ... నవ చైతన్య క్రాంతి... సంక్రాంతి.

ధర్మానికి వెలుగు దారి...

జగత్తు సక్రమమైన మార్గంలో ప్రయాణించాలని మన ధర్మం చెబుతుంది. అలా నడిస్తే వెలుగు మార్గం కనిపిస్తుంది. చీకటి తొలగి జ్ఞానం లభిస్తుంది. ఆ వెలుగు సర్వాంతర్యామిగా... సూర్యనారాయణుడి రూపంలో మనకు నిత్యం కనిపిస్తుంది. సూర్యుడు తన వెలుగుతో జగత్తుకు చైతన్య స్ఫూర్తిని కలిగిస్తున్నాడు. ఆయన గమనాన్ని అనుసరించి చేసే పండుగలలో సంక్రాంతి ప్రధానమైనది. మన పూర్వులు అశ్విని తదితర 27 నక్షత్రాలు, వాటికి చెందిన మొత్తం 108 పాదాలను... పన్నెండు మేషాది ద్వాదశ రాశులుగా విభజించారు. భూమి సూర్యుడి



చుట్టూ తిరగడానికి పన్నెండు మాసాలు పడుతుంది. సూర్యుడు నెలకు ఒక మాసంలో ఉంటాడు. ఆయన ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశించే సమయమే సంక్రమణం. దాన్ని ఆ సమయంలో సూర్యుడు ప్రవేశించే రాశి పేరున్న సంక్రాంతిగా పిలుస్తారు. సూర్యుడు ధనూరాశి నుంచి మకర రాశిలోకి సంక్రమణం చేసేటప్పుడు వచ్చేదే మకర సంక్రాంతి. మన పురాణ, ఇతిహాసాల ప్రకారం... మకర సంక్రమణం నుంచి కర్కాటక సంక్రమణం వరకూ దేవతలకు పగలు. అది ఉత్తరాయణం. కర్కాటకం నుంచి తిరిగి మకరం వరకూ రాత్రి. అది దక్షిణాయనం. దేవతలకు పగటి సమయమైన ఉత్తరాయణం అత్యంత పుణ్యకాలం. అందుకే భీష్ముడు ఈ కాలం కోసం అంపశయ్యమీద నిరీక్షించాడు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన తరువాత... కైవల్యం పొందాడు.

- ఆయపిళ్ళ రాజపాప

ముగ్గు రంగుల తయారీ ఇలా....

సంక్రాంతి పండుగ రోజుల్లో ఇంటి ముందు రంగుల ముగ్గులు వేయాలంటే చాలా రంగులు కావాలి. వీటిని బజార్లో కొనుక్కునే కంటే ఇంట్లోనే తయారు చేసుకుంటే ఆనందంగా అనిపిస్తుంది. ఇంట్లో ఉండే వాటితోనే సులభంగా ముగ్గు రంగుల తయారీ విధానం తెలుసుకుందాం!


ముగ్గు రంగుల తయారీ ఇలా చేద్దాం

- స్టవ్ మీద మందపాటి గిన్నెను పెట్టి అందులో కొన్ని రేషన్ బియ్యం పోసి దోరగా వేయించాలి. తరవాత పళ్లెంలోకి తీసి చల్లారనివ్వాలి.
- చల్లారిన బియ్యాన్ని మిక్సీ గిన్నెలో పోసి మరీ మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. లేదంటే పిండి గిర్నీలో ఇచ్చి బరకగా మర పట్టించుకోవచ్చు.
- ఇంట్లో ఉన్న చిన్న స్టీల్ లేదా గాజు గిన్నెల్లో కొంచెం బియ్యం పిండి వేయాలి. పిల్లలు పెయింటింగ్ కోసం ఉపయోగించే అక్రిలిక్ రంగులు లేదా వాటర్ కలర్స్ తీసుకుని ఒక్కో గిన్నెలో ఒక్కో రంగు వేయాలి. రంగు మొత్తం పిండికి పట్టేలా కొద్దిగా నీళ్లు చల్లుకుంటూ బాగా కలపాలి. పిండి ముదురు రంగులో కావాలనుకుంటే ఇంకొంచెం రంగు కలుపుకోవచ్చు.
- ఈ గిన్నెలన్నింటినీ గాలి తగిలే ప్రదేశంలో ఉంచి పిండిని ఆరనివ్వాలి.
- తరవాత ఒక్కో గిన్నెలోని పిండిని మరోసారి గ్రైండ్ చేస్తే రంగు బాగా కలుస్తుంది.
- ఒక్కో రంగు పిండిని ఒక్కో ప్లాస్టిక్ కవర్లో పోసి ఉంచుకుంటే ఏడాదంతా ఉపయోగించుకోవచ్చు.
- ఈవిధంగా తక్కువ ఖర్చులోనే మనకిష్టమైన రంగులన్నీ తయారు చేసుకోవచ్చు.

జాగ్రత్తలు

- రేషన్ బియ్యాన్ని రాళ్లు, వడ్ల గింజలు లేకుండా శుభ్రంగా ఏరుకోవాలి. తవుడు పోయేలా చెరగాలి.
- బియ్యం పిండి మెత్తగా అయితే ముగ్గుల్లో రంగులు నింపడం కష్టమవుతుంది. అదే రవ్వలా ఉంటే రంగు అందంగా కనిపించదు. ముగ్గు పిండి చేతి నుంచి ఎలా జారుతుందో అదే తరహాలో బియ్యం పిండి ఉండేలా చూసుకోవాలి.

ముత్యాల ముగ్గు





పి. శివజ్యోతి
కడప

15 - 8 చుక్కలు





కె. సుగుణ
బెంగళూరు

11 చుక్కలు
9 చుక్కలు రెండు వరుసలు
5 చుక్కలు రెండు వరుసలు
1 చుక్కతో నిలపాలి
రెండువైపుల

దిక్సూచి
DIKSUCHI

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1267 స్పెషలిస్ట్ ఆఫీసర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో వివిధ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి 2025 జనవరి 17లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు కోరుతున్నారు.
పోస్టులు: అగ్రికల్చరల్ మార్కెటింగ్ ఆఫీసర్(150), అగ్రికల్చర్ మార్కెటింగ్ మేనేజర్(50), మేనేజర్ సేల్స్(450) వంటి పలు పోస్టులు ఈ ఖాళీల్లో ఉన్నాయి.
అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీహెచ్‌డీ, సీఎంఏ, సీఎస్/ సీఎఫ్ఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. ఆన్‌లైన్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 2025 జనవరి 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వివరాల కోసం www.bankofbaroda.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

వివిధ బ్యాంకుల్లో ఖాళీలు

హెచ్‌డీఎఫ్‌సీలో రిలేషన్‌షిప్ మేనేజర్లు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్-ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రోగ్రామ్‌కు నోటిఫికేషన్ వెలువడింది. 500 ఖాళీలు ఉన్నాయి. కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌తోపాటు, కనీసం 1-10 సంవత్సరాల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయస్సు 35 సంవత్సరాల లోపు ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా 2025 ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. 2025 మార్చి నెలలో పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. వివరాల కోసం www.hdfcbank.com వెబ్‌సైట్ చూడొచ్చు.

కెనరా బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

కెనరా బ్యాంకు శాఖల్లో స్పెషలిస్టు ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులై అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. మొత్తం 60 ఖాళీలు ఉన్నాయి. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పోస్టులను అనుసరించి డిగ్రీ/ ఇంజనీరింగ్, బీసీఏ/ఎంసీఏ, ఎంఏ, ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయస్సు 35 సంవత్సరాల లోపు ఉండాలి. **చివరి తేదీ:** 2025 జనవరి 24
వివరాలకు canarabank.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

ఆర్ఐఎంసీలో అడ్మిషన్స్



డెహ్రాడూన్‌లోని 'రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్'(ఆర్ఐఎంసీ) ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ విద్యాసంస్థ భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. సంవత్సరానికి రెండు టర్మ్‌లు అంటే జనవరి, జూన్‌లో ఈ సంస్థలో అడ్మిషన్స్ ఉంటాయి. ప్రస్తుతం 2026 జనవరి టర్మ్ కోసం నోటిఫికేషన్ వెలువడింది.

వయస్సు: విద్యార్థుల వయస్సు 2026 జనవరి1 తేదీ నాటికి పదకొండున్నర సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2013 జనవరి 2వ తేదీ నుంచి 2014 జూలై 1వ తేదీ మధ్యలో జన్మించిన బాల, బాలికలు దరఖాస్తుకు అర్హులు.

ఫీజు: జనరల్ ఓబీసీ/ విద్యార్థులకు రూ.600/-, ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులకు రూ. 555/- ఫీజు ఉంటుంది. ఈ రుసుముతో డీడీ తీయాల్సి ఉంటుంది.
ఎంపిక: రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది. 2025 జూన్ 1వ తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్షా విధానం: మొత్తం మూడు పేపర్లు ఉంటాయి

సబ్జెక్టు	మార్కులు	టైమ్
మేథ్స్	200	ఉ. 9.30 నుంచి 11 గంటల వరకు
జనరల్ నాలెడ్జ్	75	మ. 12 నుంచి 1 వరకు
ఇంగ్లిష్	125	మ. 12 నుంచి సా. 4.30 వరకు

(వైవా 50 మార్కులు - రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే) ప్రశ్నపత్రం మొత్తం 400 మార్కులకు ఉంటుంది. రాత పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్‌గా అంటే ప్రశ్నలు, జవాబుల తరహాలో ఉంటుంది. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి తదుపరి అంచెలో 'వైవా' ఉంటుంది. దీని కోసం 1:3 శాతం నిష్పత్తిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. వైవా తర్వాత మెడికల్ టెస్ట్ కూడా క్లియర్ చేయాల్సి ఉంటుంది.
దరఖాస్తు విధానం: నిర్ణీత రుసుము ఫీజుతో డీడీని ఆర్ఐఎంసీకి పోస్టు ద్వారా పంపితే వారు దరఖాస్తు ఫారమ్, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలు స్పీడ్ పోస్టు ద్వారా అభ్యర్థులకు పంపుతారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారమ్‌ను సంబంధిత రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపించాలి. అంటే తెలంగాణ విద్యార్థులు టీజీపీఎస్సీ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఏపీపీఎస్సీకి పంపాలి.

సిద్ధంగా ఉంచుకోవాల్సిన సర్టిఫికెట్స్
- బర్త్ సర్టిఫికెట్
- ఎస్సీ/ఎస్టీ సర్టిఫికెట్
- ఆధార్ కార్డ్ జిరాక్స్
- డొమెస్టిక్/ రెసిడెన్స్ సర్టిఫికెట్
- ప్రస్తుత స్కూల్ నుంచి బోనఫైడ్
- రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు

చివరి తేదీ: పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలు 2025 మార్చి31లోపు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ కమిషన్ కార్యాలయానికి చేరాలి.
పరీక్షా కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
(ఎంట్రెన్స్ ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ల ఆధ్వర్యంలో జరిగినప్పటికీ ఫలితాలను మాత్రం ఆర్ఐఎంసీ వెల్లడిస్తుంది. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో దాదాపు 90 శాతం మంది ఎన్‌డీఏకి ఎంపిక అవుతారు.
పూర్తి వివరాల కోసం rimc.gov.in/rimcindex.aspx వెబ్‌సైట్ చూడొచ్చు.



ఎస్.కళ్యాణి
ప్రిన్స్‌పాల్, క్రాంతి కీన్ అకాడమి, హైదరాబాద్



మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షుపై దర్శకుడు త్రినాదరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షు లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్స్ట్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాధరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.





మందా జగన్నాథం కన్నుమూత

- అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి
- నాలుగు సార్లు ఎంపీగా సేవలు
- రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు కేసీఆర్ సహా నేతల సంతాపం



హైదరాబాద్ సిటీ/నాగర్‌కర్నూల్/హైదరాబాద్/అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం(73) కన్నుమూశారు. 22 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఆదివారం సాయంత్రం గుండెపోటు రావడంతో డాక్టర్లు అత్యవసర చికిత్స అందించారు. అయినా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. రాత్రి 7.40 గంటలకు పరిస్థితి విషమించి జగన్నాథం కన్నుమూశారు. గత నెల 22న ఆయన గుండె, మూత్ర పిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో నిమ్స్‌లో చేరారు. మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలతో పాటు హృదయ ధమనుల్లో రక్త ప్రవాహం సాఫీగా సాగేందుకు డాక్టర్లు ఆయనకు చికిత్సలు అందించారు. కొద్ది రోజుల క్రితం ఆయన ఆరోగ్యం కాస్త మెరుగుపడినా.. మళ్లీ ఆందోళకర పరిస్థితి నెలకొంది.

టీడీపీ నుంచి ప్రస్థానం..

మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం కొండేరులో మందా జగన్నాథం జన్మించారు. డాక్టర్‌గా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ పిలుపుతో 1996లో టీడీపీలో చేరారు. వరుసగా 4సార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా సేవలందించారు. 1996, 1999 2004లో టీడీపీ నుంచి.. 2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఒకసారి ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత టీఆర్ఎస్‌కు దగ్గరయ్యారు. 2014లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా హోదా దక్కినా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. గతంలో గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ చేయించుకున్నారు.

జగన్నాథం సేవలు మరువలేనివి: రేవంత్

నాగర్‌కర్నూల్ ఎంపీగా, సామాజిక, తెలంగాణ ఉద్యమకారుడిగా మందా జగన్నాథం సేవలు మరువలేనివని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జగన్నాథం మృతిపట్ల సంతాపం తెలిపిన సీఎం.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారని, ఆయన మృతి తెలంగాణకు తీరని లోటు అని రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జానారెడ్డి, కె.కేశవరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితర నేతలు జగన్నాథం మృతి పట్ల సంతాపం తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన జగన్నాథం ఉన్నత చదవులు చదివి టీడీపీ తరఫున 3సార్లు ఎంపీగా గెలిచి, ప్రజాసేవ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. జగన్నాథం మృతి పట్ల సంతాపం తెలిపారు. తెలంగాణ సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని మాజీ సీఎం కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. జగన్నాథం మృతి బాధాకరమని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత పేర్కొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్‌కు కొత్త విజన్!

- ఆ ప్లాంట్లకు భారీ రాయితీలు, ప్రోత్సాహకాలు
- తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానం

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీ నజరానాలు ప్రకటించింది. ఎలక్ట్రోలైజర్ స్టాక్ ప్లాంట్, పరికరాలపై 30 శాతం పెట్టుబడి రాయితీ ఇవ్వనుంది. ప్రతి మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యానికి రూ.కోటి చొప్పున గరిష్ఠంగా రూ.30 కోట్ల పెట్టుబడి రాయితీ లభిస్తుందని తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లో ప్రకటించింది. ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజనిక్ కార్బన్‌తో సహా) పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యతనిచ్చింది. ప్రతి కేటీపీఏ సామర్థ్యానికి గ్రీన్ అమోనియా ప్లాంట్లకు రూ.1.85 కోట్లు, గ్రీన్ మిథనాల్ ప్లాంట్లకు రూ.2.25 కోట్ల వరకు సబ్సిడీలు అందించనుంది. ఉత్పాదన ప్రారంభించాక ఐదేళ్లలో సబ్సిడీ చెల్లింపులు జరుగుతాయి. కనీసం 500 మెగావాట్ల వార్షిక ఎలక్ట్రోలైజర్ ఉత్పాదక సామర్థ్యం కలిగిన తొలి 5 ప్లాంట్లకే ఇది వర్తిస్తుంది. మహిళా పారిశ్రామికవేత్తలకు అదనంగా 10 శాతం పెట్టబడి రాయితీ లభిస్తుంది.

రాయితీలు, ప్రోత్సాహకాలు..

- రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల అమ్మకాలపై ఐదేళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలపై ఏడేళ్ల పాటు 100%ఎస్‌జీఎస్టీ తిరిగి చెల్లిస్తుంది.
- ప్రాజెక్టుల గుమ్మం వరకు నీటి సరఫరా సదుపాయం కల్పిస్తారు. గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు నీటి సరఫరా చార్జీల్లో ఐదేళ్ల పాటు 50 శాతం తిరిగి చెల్లిస్తుంది. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు పదేళ్ల పాటు 25 శాతం నీటి చార్జీలు తిరిగి ఇస్తుంది.
- గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు పదేళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు 100 శాతం ఎలక్ట్రిసిటీ డ్యూటీ మాఫీ చేస్తుంది.
- గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు రాష్ట్ర డిస్కంల నుంచి కొనే ప్రతి యూనిట్ విద్యుత్‌కు రూ.3 చొప్పున 20 ఏళ్ల పాటు బిల్లులను తిరిగి చెల్లిస్తుంది. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌పై రూపాయి చొప్పున రాయితీ వర్తిస్తుంది.
- గ్రీన్ హైడ్రోజన్ రీ ఫ్యూయలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 30 శాతం పెట్టుబడి రాయితీని ప్రభుత్వం ఇవ్వనుంది. పరికరాల కొనుగోలుపై 100 శాతం ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌ను ప్లాంట్‌లో ఉత్పాదన ప్రారంభమైన నాటి నుంచి ఐదేళ్లలో ఇస్తుంది.

గ్రీన్ హైడ్రోజన్ అంటే...

గ్రీన్ హైడ్రోజన్ స్వచ్ఛమైన ఇంధన వనరు. సౌర విద్యుత్, ఇతర పునరుత్పాదక విద్యుత్‌ను ఉపయోగించి నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొడతారు. దీన్నే గ్రీన్ హైడ్రోజన్ అంటారు. భూతాపం, కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం శిలాజ ఇంధనాలకు బదులు కాలుష్యరహిత గ్రీన్ హైడ్రోజన్‌ను వినియోగించాలని వివిధ దేశాల లక్ష్యం. వాహనాలతో పాటు భారీ పరిశ్రమల్లో వినియోగిస్తున్న కాలుష్య కారక ఇంధనాలకు బదులుగా గ్రీన్ హైడ్రోజన్ వినియోగిస్తే భవిష్యత్తులో 'నెట్ జీరో' లక్ష్యాన్ని అందుకోవచ్చని భావిస్తున్నారు.

భువనగిరిలో ఉద్రిక్తత

- బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన
- పోలీసు నిఘాను ఛేదించి.. బీఆర్ఎస్ ధర్నా
- మాజీ ఎమ్మెల్యే, పలువురు నేతల అరెస్టు

భువనగిరి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వివాదంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండో రోజు ఆదివారం కూడా ఉద్రిక్తత కొనసాగింది. సీఎం రేవంత్ రెడ్డిపై జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు, ప్రతిగా శనివారం బీఆర్ఎస్ కార్యాలయంపై యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిని ఖండిస్తూ ఆదివారం భువనగిరిలో బీఆర్ఎస్ మహాధర్నాకు పిలుపునిచ్చింది. పోలీసుల నిఘాను ఛేదించుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బీఆర్ఎస్ నాయకులు అకస్మాత్తుగా ధర్నాకు దిగారు. అదే సమయంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అక్కడికి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే వెళ్లిన తర్వాత బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బలవంతంగా తరలించారు. ఈ క్రమంలో రామకృష్ణారెడ్డి కాలికి గాయమైంది. మహాధర్నాలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని ఘట్‌కేసర్‌లో అరెస్టు చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో గృహ నిర్బంధం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్యను అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎంను దూషించి శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు కారణమైన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. రామకృష్ణారెడ్డి ఉద్దేశపూర్వకంగానే సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్యంగా దూషించి కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రామకృష్ణా రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి, నాయకుల అరెస్టులు దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు.

నీది ఏ పార్టీ?

కౌశిక్ రెడ్డి వర్సెస్ సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం, తోపులాట
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష రసాభాస

కరీంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మధ్య వాగ్వాదం, తోపులాటతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలు తెలపాలని ఇన్‌చార్జి మంత్రి కోరారు. ఈ క్రమంలో సంజయ్‌కుమార్ (జగిత్యాల) మాట్లాడడానికి మైకు తీసుకోగా కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్) అభ్యంతరం చెబుతూ ఆయన (సంజయ్‌కుమార్) ఏ పార్టీకి చెందిన వ్యక్తి అని, ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇస్తున్నారని ఆగ్రహంగా ప్రశ్నించారు. ఆయనపైకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దానికి సంజయ్‌కుమార్ దీటుగా స్పందించగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచారు. 'నువ్వు ఏ పార్టీ నుంచి వచ్చావు' అంటూ కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంలో మాటా మాట పెరిగి ఒకరిని ఒకరు తోసివేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బయటకు తీసుకువెళ్లారు. గేటు బయటే నిలబడిన ఆయన 'సిగ్గు.. లజ్జ ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవమ'ని సంజయ్ కుమార్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారం సరిగా లేదని... మార్చుకోవాలని హెచ్చరించారు. తనను విమర్శించడానికి రాజీనామా చేయమని అడగడానికి కౌశిక్ రెడ్డికి ఎలాంటి అధికారం లేదని సంజయ్‌కుమార్ అన్నారు. ఆయనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.



సంజయ్‌కుమార్‌ను హెచ్చరిస్తున్న కౌశిక్‌రెడ్డి

పోలీసులకు కేసీఆర్ ఏం తక్కువ చేశాడు అన్నీ మర్చిపోయారా?: కౌశిక్ రెడ్డి

'పోలీసులకు కేసీఆర్ ఏం తక్కువ చేశాడు.. ఫార్చునర్లు, ఇన్నోవాలు ఇచ్చాడు.. పోలీస్ స్టేషన్లను ఆధునీకరించాడు.. జీతాలు పెంచాడు.. అన్నీ మరిచిపోయారా'.. అని పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా సమీక్షా సమావేశ మందిరం నుంచి బయటకొచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి కాకతప్పదని, ఎక్స్‌ట్రాలు చేస్తున్న అధికారులు ఎవర్నీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పార్టీ మారిన వారు, రాజీనామా చేయని వారిని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.

సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా: ఉత్తమ్

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా వేయక పోయినా రైతు భరోసా ఇస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రోడ్లు, రియల్ ఎస్టేట్ స్థలాలు, సాగుకు యోగ్యం కాని భూములకు ఇవ్వబోమని స్పష్టం చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామన్నారు. అర్హులరందరికీ రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ మొదలవుతుందన్నారు. వచ్చే నెల నుంచి సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. కాళేశ్వరం నుంచి నీరు ఎత్తిపోయకుండానే రాష్ట్ర వ్యాప్తంగా 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్చోసిన ఆంబోతులా కౌశిక్ రెడ్డి: బల్మూరు

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అచ్చోసిన ఆంబోతులాగా ప్రవర్తిస్తున్నాడని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ధ్వజమెత్తారు. మీడియాలో కనపడేందుకే పిచ్చిచేష్టలు చేస్తున్నాడని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన ఇలాగే ప్రవర్తిస్తే రోడ్డుపై గుడ్డలూడదీసి కొట్టే రోజు వస్తుందని హెచ్చరించారు.

కేటీఆర్‌కు క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైడ్రాతో హైదరాబాద్‌కు చెడ్డపేరు
- నేను ఫైటర్‌ను.. ఉప ఎన్నికకు భయపడను: దానం

హైదరాబాద్ సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కార్ రేస్ విషయంలో తాను కేటీఆర్‌కు క్లీన్ చిట్ ఇవ్వలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. ఆదివారం జీహెచ్ఎంసీలో జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం దానం మీడియాతో మాట్లాడారు. ఈ మధ్య తాను ఏం మాట్లాడినా సంచలనం అవుతోందన్నారు. కార్ రేస్ వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని మాత్రమే తాను అన్నానని, అందులో అవినీతి జరగలేదని చెప్పలేదని వెల్లడించారు. రేస్ నిర్వహించినప్పుడు కేటీఆర్ తన సలహా తీసుకున్నారని తెలిపారు. హైడ్రాతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. దీనిపై సర్కారు మరోసారి ఆలోచించాలని కోరారు. మూసీ పక్కన హై కోర్టు, ఉస్మానియా ఆస్పత్రి వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని, ఆ నది పునరుజ్జీవ ప్రాజెక్టు అవసరమని పేర్కొన్నారు. మూసీపై కంటి తుడుపు చర్యగా బీజేపీ నేతలు బస్తీ నిద్ర చేశారని దానం వ్యాఖ్యానించారు. నిద్ర చేసిన ఇళ్లలో.. ముందే తాత్కాలిక ఏసీలు పెట్టించుకున్నారని ఆరోపించారు. వారి ఇళ్లలో చేసిన జొన్న రొట్టెలు తినకుండా.. కిషన్‌రెడ్డి బయటి నుంచి ఇడ్లీలు తెప్పించుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, అయినా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. 'నేను ఫైటర్‌ను.. ఉప ఎన్నికకు భయపడను' అని దానం పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగులకు హైదరాబాద్ సేఫ్!

- రాష్ట్ర రాజధానికి దేశంలోనే మూడో స్థానం

హైదరాబాద్, జనవరి 12: మహిళా ఉద్యోగులకు దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరాల జాబితాలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఇక మహిళలకు వివిధ రంగాల్లో అత్యంత ప్రోత్సాహం లభిస్తున్న రాష్ట్రాల విషయానికొస్తే.. తెలంగాణకు దేశంలోనే రెండో స్థానం దక్కింది. అవతార్ గ్రూప్ అనే వర్క్ కల్చర్ కన్సల్టింగ్ సంస్థ 2024 ఫిబ్రవరి-నవంబరు మధ్యలో దేశంలోని 60 నగరాల్లో సర్వే చేసింది. దాని ఆధారంగా మహిళా ఉద్యోగులకు దేశంలోనే 25 అత్యుత్తమ నగరాల జాబితాను ప్రకటించింది. ఈ టాప్-25 నగరాలలో హైదరాబాద్‌కు నాలుగో స్థానం దక్కింది. బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా చెన్నై, ముంబై ఈ జాబితాలో హైదరాబాద్‌కంటే ముందు ఉన్నాయి. ఇక మహిళా భద్రత విషయానికి వచ్చే సరికి హైదరాబాద్‌కు మూడో స్థానం దక్కింది. ఈ జాబితాలో తిరువనంతపురం, ముంబై వరుసగా తొలి రెండుస్థానాల్లో నిలిచాయి. మరోపక్క, మహిళల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనలో గురుగ్రామ్ అగ్రస్థానంలో ఉండగా.. ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మాదిగ దండోరాను అడ్డుకోవడానికి భట్టి కుట్ర

- ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

బర్కత్‌పుర, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న చేపట్ట తలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మాదిగ దండోరా ఉద్యమాన్ని అడ్డుకోవడానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుట్ర పన్నారని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. అందులో భాగంగానే ఈనెల 8న కళాకారులు రాజకీయ సభలు, సమావేశాలలో పాల్గొనకూడదని తెలంగాణ సాంస్కృతిక సారధి అధ్యక్షురాలు వెన్నెల గద్దర్‌తో సర్క్యూలర్ జారీ చేయించారని ధ్వజమెత్తారు. దానిని బేషరతుగా ఉపసంహరించుకోకపోతే ఉద్యమం చేపడతామని మంద కృష్ణ హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెయ్యి గొంతులు లక్ష డప్పుల దండోరా కవి, గాయక సభలోను, ఆ తర్వాత మీడియాతోను మందకృష్ణ మాట్లాడారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గీకరణ అమలు కాకుండా అడుగడుగున అడ్డుకుంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామిని రాజకీయ సమాధి చేయడమే మాదిగ దండోరా లక్ష్యమని మందకృష్ణ తెలిపారు. వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వార్థపరులైన మాలలు అడ్డుకుంటున్నారని, వారిని వివేక్ వెంకటస్వామి రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆనాడు తెలంగాణ ఏర్పాటును అడ్డుకుని లగడపాటి రాజగోపాల్ ఏ విధంగా కనుమరుగయ్యాడో అలాగే వివేక్ వెంకటస్వామికి కూడా రాజకీయ ఓటమి తప్పదని ఆయన పేర్కొన్నారు.

సర్కారీ స్టార్ హోటల్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వాటికి అనుసంధానంగా అధునాతన వసతులతో, అత్యంత విశాలమైన హోటల్‌తోపాటు అందులోనే వాణిజ్య కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించింది. కార్యాలయాల అవసరాలు తీర్చడం కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నిర్మాణాన్ని చేపట్టనుంది. హైటెక్ సిటీకి దగ్గర్లో రాయదుర్గం మెట్రో స్టేషన్ తరువాత ఉన్న ఐకియా షోరూం పక్కన దీనిని నిర్మించనుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం గ్రామంలో హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని సర్వే నంబర్ 83/1లో మూడు ఎకరాల స్థలంలో ఈ నిర్మాణం జరపనుంది. మొత్తం 15 అంతస్తుల్లో 8.86 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో అందుబాటులోకి తీసురానుంది. ఇందుకు రూ.582 కోట్ల నిధులను వెచ్చించనుంది. ప్రపంచంలోనే టాప్-10లో ఒకటిగా ఉండేలా ఈ హోటల్‌ను అత్యంత లగ్జరీగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు హోటల్‌తో పాటు వాణిజ్య కేంద్రం నిర్మాణానికి అర్హులైన బిడ్డర్ల నుంచి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) టెండర్లను ఆహ్వానించింది. 36 నెలల్లో హోటల్, వాణిజ్య కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది.

పెట్టుబడులే లక్ష్యంగా..

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉంది. వాతావరణంతోపాటు వివిధ సౌలభ్యాలు, సౌకర్యాలు, ప్రభుత్వ సహకారం మెండుగా ఉండడంతో ప్రపంచ స్థాయిలో పలు కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. గతేడాది స్విట్జర్లాండ్‌లో జరిగిన దావోస్ సదస్సులోనూ వివిధ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇలా వివిధ దేశాల నుంచి రాష్ట్రానికి కంపెనీలు వస్తున్న నేపథ్యంలో వ్యాపార, వాణిజ్య లావాదేవీలకు కేంద్రంగా అక్కడే ఒక లగ్జరీ హోటల్‌ను కూడా నిర్మిస్తే వ్యాపారులకు, కంపెనీలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్న భావనతోనే ప్రభుత్వం ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2021-22లో తెలంగాణ జీఎస్‌డీపీ 11.5 లక్షల కోట్లు ఉంటే.. అందులో హైదరాబాద్ గణనీయంగా ఉంది. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణకు హైదరాబాద్ ఆర్థికంగా ఊతమిస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఐటీ, ఐటీఈఎస్, బీఎఫ్ఎస్ఐ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో దాదాపు 500 ప్రఖ్యాత కంపెనీలకు హైదరాబాద్ నిలయంగా మారింది. దిగ్గజ కంపెనీలకు హైదరాబాద్‌లో ఆఫీసులు ఉన్నాయి. దీంతో 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సులు క్రమంగా పెరుగుతున్నాయి.

గ్లోబల్ సదస్సులకు వేదికగా..

వరల్డ్ మెట్రోపాలిటన్ కాంగ్రెస్, బయో ఏసియా సమ్మిట్, గ్లోబల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్, ఇండియా జాయ్ గ్లోబల్ యూత్ ఫెస్టివల్, వరల్డ్ జియో స్పేసియల్ ఇన్ఫర్మేషన్ కాంగ్రెస్ వంటి అంతర్జాతీయ సదస్సులతో హైదరాబాద్ నగరం ప్రయాణ, పర్యాటక, వ్యాపారానికి గమ్యస్థానంగా మారింది. ఏటా కనీసం 30కి పైగా గ్లోబల్ సదస్సులకు హైదరాబాద్ వేదికగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ) అనేక పెద్ద పెద్ద సదస్సులకు ఆతిథ్యం ఇచ్చింది. ఏడాదికి సగటున వివిధ ప్రాంతాల నుంచి సుమారు 4 లక్షల మంది ప్రతినిధులు వస్తున్నట్టు వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగంలో హైదరాబాద్ 159వ స్థానంలో ఉంది. ఇక దేశంలోని ఉత్తమ నగరాల్లో ఢిల్లీ తరువాత హైదరాబాద్ 2వ స్థానంలో ఉంది. వీటన్నింటి నేపథ్యంలోనే వివిధ దేశాల నుంచి వచ్చేవారికి ప్రపంచంలోనే ఒక మంచి అనుభూతిని కలిగించాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ లగ్జరీ హోటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాగా ఈ ఫైవ్ స్టార్ హోటల్, వాణిజ్య కేంద్రాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిర్మించతలపెట్టిన టైమ్‌స్క్వేర్, టీ-వర్క్స్ భవనాలకు అండర్‌గ్రౌండ్, అండర్‌పాస్‌లతో అనుసంధానించనుంది.



ఫైవ్ స్టార్ హోటల్‌ను నిర్మించే ప్రదేశం ఇక్కడే..

కొత్త హోటల్ నిర్మాణం ఇలా..

(ప్రతిపాదిత నమూనా ప్రకారం)

- ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఫైవ్‌స్టార్ హోటల్ కమ్ ట్రేడ్ సెంటర్.. మూడెకరాల విస్తీర్ణంలో 15 అంతస్తుల్లో ఉండనుంది. (60మీటర్ల ఎత్తు)
- 2,19,745చదరపు అడుగుల పార్కింగ్‌తో కలిపి మొత్తం 8,85,638 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు ఉంటాయి.
- హోటల్ కోసం 3.63 లక్షల చదరపు అడుగులు, ట్రేడ్ సెంటర్ కోసం 2.42 లక్షల చదరపు అడుగులు కేటాయిస్తారు.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆఫీసులు, హోటల్ లాబీ, బాంక్వెట్ హాళ్లను 60,536 చదరపు అడుగుల్లో ఉంటుంది. (ఒక్కో బాంక్వెట్ హాల్‌లో 600 మంది కూర్చునేలా నిర్మాణం)
- 1 నుంచి 4 అంతస్తుల్లో 2,42,143 చదరపు అడుగుల్లో ట్రేడ్ సెంటర్
- 5వ అంతస్తులో 3,63,215 చదరపు అడుగుల్లో లగ్జరీ హోటల్, రెస్టారెంట్లు ఉంటాయి.
- 6వ ఫ్లోర్ సర్వీస్ కోసం ఉంటుంది.
- 7 నుంచి 14 అంతస్తుల్లో లగ్జరీ హోటల్ 2,42,143 చదరపు అడుగుల్లో ఉంటుంది.

హైదరాబాద్‌లోని ప్రస్తుత హోటళ్లు ఇలా..

హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్త కంపెనీలు, పరిశ్రమలు వస్తున్నప్పటికీ ఆ స్థాయిలో సౌకర్యాలను అందించగలిగే హోటళ్లు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో రిజిస్టర్డ్ హోటళ్లు 33 ఉండగా.. వాటిలో 5వేల గదులు ఉన్నాయి. రిజిస్టర్ కాని హోటళ్లు దాదాపు 2,300 వరకు ఉండగా.. వాటి పరిధిలో 21 వేల గదులున్నాయి. వీటిలో 5-స్టార్ డీలక్స్ స్థాయిలో 6 హోటళ్లు ఉండగా, వీటిలో 1,647 గదులు ఉన్నాయి. 5-స్టార్ హోటల్స్ 8 ఉండగా వీటిలో 1,412 గదులు, 4-స్టార్ హోటళ్లు 4 ఉండగా 547 గదులు, 3-స్టార్ హోటళ్లు 5 ఉండగా.. వీటిలో 321 గదులు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరులో 14 వేల గదులు, ముంబైలో 27.5 శాతం, అహ్మదాబాద్‌లో 21 శాతం గదులు ఉన్నాయి. వీటితో పోలిస్తే ప్రస్తుతం హైదరాబాద్‌లో హోటల్ గదులు చాలా తక్కువగానే ఉన్నట్టు పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని టీజీఐఐసీ పేర్కొంది.

90 గంటల పనిపై యువత ఆలోచించాలి!

- సెలవుల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు
- 'క్వాంట పీపుల్' కార్యక్రమంలో డీజీపీ జితేందర్

రాంగోపాల్‌పేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): "భారతీయులు వారానికి 90 గంటలు ఎందుకు పని చేయరని ఓ పారిశ్రామికవేత్త అన్నారు. ఇది నేటి యువత బాగా ఆలోచించాల్సిన విషయం" అని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. వారానికి 5-6 రోజులు పనిచేస్తామని అనకూడదని.. ఎక్కువగా సెలవుల గురించి ఆలోచించకుండా మెక్ డొనాల్డ్, స్విగ్గీ, జోమాటో, డబ్బావాలా వంటి నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. అలాంటివారిని కార్పొరేట్ కంపెనీలు ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం టీఎంఐ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన 'క్వాంట పీపుల్' పేరిట టీఎంఐ నెలకొల్పిన స్టార్టప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముంబైకి చెందిన 12 ఏళ్ల బాలుడు లాజిస్టిక్ యాప్ తయారుచేసి డబ్బావాలతో టై-అప్ అయ్యాడని.. రెండేళ్లలో దాని టర్నోవర్ రూ.200 కోట్లకు చేరుకున్నట్టు ఇటీవలే ఒక పత్రికలో చదివానని గుర్తుచేసుకున్నారు. కార్పొరేట్ కంపెనీలు యువతను ప్రోత్సహించి అలాంటి ఆవిష్కరణలకు చేయూతనివ్వాలని సూచించారు. ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్, టీఎంఐ సీటీవో సమీర్ గోస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

సినీ నటుడు వెంకటేశ్ కుటుంబసభ్యులపై కేసు



బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దక్కన్ కిచెన్ కూల్చివేత వ్యవహారంలో హీరో దగ్గుబాటి వెంకటేశ్ కుటుంబసభ్యులపై కేసు నమోదయింది. దగ్గుబాటి సురేశ్ బాబు, వెంకటేశ్, రానా, అభిరామ్‌లపై కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే కొనుగోలు విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నందకుమార్, దగ్గుబాటి కుటుంబ సభ్యుల మధ్య ఫిలింనగర్‌లోని దక్కన్ కిచెన్‌కు సంబంధించి గతంలో వివాదం నెలకొంది. ఈ విషయంలో నందకుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కాగా, 2022 నవంబరులో జీహెచ్ఎంసీ సిబ్బంది హోటల్‌ను పాక్షికంగా కూల్చివేశారు. ఈ అంశంలో యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. అయితే 2024 జనవరిలో హైకోర్టు ఆదేశాలున్నా దగ్గుబాటి కుటుంబం.. జీహెచ్ఎంసీ సిబ్బందిని తప్పుదోవ పట్టించి దౌర్జన్యంగా తన హోటల్‌ను కూల్చివేసిందని నందకుమార్ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని ఫిలింనగర్ పోలీసులను శనివారం ఆదేశించింది. దీంతో పోలీసులు కేసునమోదు చేశారు.

ఆస్తి తగాదాలతో వ్యక్తి హత్య!

- నిర్మల్ జిల్లా ముథోల్‌లో ఘటన
- మామ, అతని అల్లుడు కలిసి హత్య చేశారని మృతుడి భార్య ఆరోపణ

ముథోల్, భైంసా, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలు ఒకరి హత్యకు దారితీసిన ఘటన నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ముథోల్ సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముథోల్‌లోని కొలిగల్లీలో కుంటాల ఏఎస్సై రాందాస్ తన బావ సంవత్సరీకానికి శనివారం తన సొంత గ్రామం ముథోల్‌కు వచ్చారు. రాత్రి రాందాస్ మొదటి భార్య కుమారుడు కరుణ్ (32), రాందాస్ అల్లుడు అనిల్ (కానిస్టేబుల్) కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయ్యాక అర్ధరాత్రి కరుణ్, రాందాస్, అనిల్ మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో కరుణ్ కింద పడిపోయి ఉండటాన్ని గమనించిన అతని భార్య సుష్మా 100కు ఫోన్ చేసింది. అప్పటికే రాందాస్, అనిల్.. కరుణ్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించినట్టు చెప్పారు. కానీ మృతుడి భార్య మాత్రం తన భర్తను ఆస్తి తగాదాల నేపథ్యంలో వారిద్దరు కొట్టి చంపేశారని ఆరోపించారు. అనంతరం కరుణ్‌ను 108 వాహనంలో ముథోల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. అక్కడి నుంచి భైంసా ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌లు ఘటన స్థలానికి చేరుకుని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఆదివారం ఎస్పీ జానకి షర్మిల, భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనాలు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య.. మామ, అతని అల్లుడు కలిసి హత్య చేశారని ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో హత్య జరిగినట్టు ఆరోపించడంతో హత్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కాగా ఆదివారం భైంసా ఏరియా ఆస్పత్రిలో కరుణ్ మృతదేహాన్ని ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్పీ తెలిపారు.





నదిలో నిర్మాణాలు!

గంగా, యమున నదులపై 32 పాంటూన్ బ్రిడ్జిలు.. అవన్నీ తాత్కాలిక ప్రాతిపదికనే

యమునా నదిపై పాంటూన్ బ్రిడ్జి

- ఇనుప రేకుల వరుసలతో రోడ్లు
- అఖాడాలకు నదీ తీరంలోనే టెంట్లు

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

పై ఫొటో చూశారా!? ఎదురుగా అంతెత్తున ఫ్లై ఓవర్. అది దాటిన తర్వాత రెండు రైల్వే బ్రిడ్జిలు! వాటికన్నా ముందు ఓ చిన్న బ్రిడ్జి ఉంది చూశారా!? దానినే పాంటూన్ బ్రిడ్జ్ అంటారు! మహా కుంభమేళాలో ఈ తాత్కాలిక బ్రిడ్జిలు ప్రత్యేకం కూడా! కుంభమేళాకు కోట్లాది మంది వస్తారు. వారికి రవాణా ఇక్కడ అతి పెద్ద సవాలు. దానిని అధిగమించడానికి వీటిని నిర్మిస్తారు. ఓవైపు నదిలో నీరు ప్రవహిస్తూనే ఉంది.. మరోవైపు భారీ ఇనుప గోళాలతో బ్రిడ్జిలను నిర్మించేస్తూనే ఉన్నారు. ఒక్కో ఇనుప గోళం దాదాపు ఆరు టన్నుల వరకూ బరువు ఉంటుందని అంచనా. గత కుంభమేళా సందర్భంగా కేవలం 18 పాంటూన్ బ్రిడ్జిలను నిర్మిస్తే.. ఈసారి గంగా, యమున నదులపై 32 నిర్మించారు. అవసరమైనచోట మరిన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారు. పట్టణంలోని గంగా నదిలో దాదాపు వంద మీటర్లకు ఒకటి చొప్పున ఇవి కనిపించాయి. వీటిపై నుంచి మనుషులు మాత్రమే కాదు.. కార్లు కూడా ఎంచక్కా వెళుతున్నాయి. కుంభమేళా ఏర్పాట్లలో భాగంగా ప్రయాగ్‌రాజ్‌లో నది, నదీతీరంలోనే భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. అవన్నీ కూడా తాత్కాలికంగానే. అయితే, సాధారణ సమయాల్లో రవాణాకు పాంటూన్ బ్రిడ్జిలు ఎంతో అనుకూలమే కానీ, లక్షలాదిమంది వచ్చినప్పుడు.. తొక్కిసలాట వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వీటిపై భద్రత ప్రశ్నార్థకమే. జీహెచ్ఎంసీ వైశాల్యంలో దాదాపు సగం మాత్రమే ఉండే ప్రయాగ్‌రాజ్‌కు నెలన్నర సమయంలోనే దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. అందులోనూ, ఇప్పుడు 144 సంవత్సరాలకు ఒక్కసారి జరిగే మహా కుంభమేళా!! అందుకనుగుణంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.. వీలుకాని చోట తాత్కాలిక నిర్మాణాలకే మొగ్గు చూపుతోంది. ఇనుప రేకులు, థర్మోకూల్ షీట్లు తదితరాలతోనే మీడియా సెంటర్ వంటి నిర్మాణాలూ చేస్తోంది. అంతేనా.. వివిధ అఖాడాలు తమ టెంట్లు వేసుకోవడానికి స్థలాన్ని కూడా ఈ నదీ తీరాల్లోనే ఇచ్చారు. అక్కడి ఇసుకలోనే అఖాడాలకు చెందిన స్వాములు, మఠాలు టెంట్లు వేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న కళాగ్రామ్‌ను కూడా ఈ నదీ తీర ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తుండడం విశేషం. ఇప్పుడు వర్షాకాలం కాకపోవడం, నదిలో పెద్దగా నీరు లేకపోవడం ఇందుకు కలిసి వచ్చింది.



హెచ్‌డీపీఈ కంటైనర్లతో జెట్టీలు

త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం చేయడానికి వచ్చే వీఐపీల కోసం గంగానది ఒడ్డునే నీటిలో తేలియాడే జెట్టీలు తయారు చేశారు. హెచ్‌డీపీఈ కంటైనర్లను పెద్దఎత్తున ఉపయోగించి దీనిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఒడ్డు నుంచి జెట్టీలోకి వెళ్లడానికి కూడా వీటితోనే మార్గం ఏర్పాటు చేశారు.



ఇనుపరేకులతో వేసిన రోడ్డు

ఇనుప రేకులతో రోడ్లు!




అవసరమైనచోట రహదారులను నిర్మిస్తున్నా.. చాలా వరకూ తాత్కాలిక రోడ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నదులు, నదీ తీర ప్రాంతాల్లో తాత్కాలికంగా అయినా రోడ్లను నిర్మించడం మంచిది కాదు. అది అంత సులభం కూడా కాదు. అందుకే, వేల సంఖ్యలో ఇనుప రేకులను తీసుకొచ్చి.. వాటినే రోడ్డుగా పరిచేస్తున్నారు. టెంట్లకు వెళ్లే వంద, 200 మీటర్ల చిన్న రోడ్లనే కాదు.. ఐదారు కిలోమీటర్ల డబుల్ రోడ్లను కూడా వీటితోనే తయారు చేసేస్తున్నారు. సిమెంటు, కంకర తదితరాలతో ఇక్కడ పని లేదు. ఆ ప్రాంతాన్ని కొంచెం చదును చేయడం.. దానిపై ఇనుప రేకులు పరచడం.. అంతే అక్కడ రోడ్డు సిద్ధం! నదీ తీరంలో వెళుతుంటే అక్కడి ఇసుకలో పాదం కూరుకుపోతుంది. అటువంటి పరిస్థితి ఏర్పడకుండా ఆ ఇసుకపైనే ఇనుప రేకులు పరిచి తాత్కాలిక రోడ్లను నిర్మించేశారు. ఇటువంటి రోడ్లను ప్రయాగ్‌రాజ్‌లో లెక్కకు మిక్కిలిగా నిర్మించారు.

మహా కుంభమేళా నేటి నుంచే

45 రోజుల పాటు నిర్వహణ

ప్రయాగ్‌రాజ్, జనవరి 12: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా సోమవారం నుంచి ప్రారంభంకానుంది. మొత్తం 45 రోజుల పాటు సాగనుంది. పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తొలిపుణ్యస్నానంతో ఈ మహా క్రతువుకు యూపీ సర్కారు శ్రీకారం చుట్టనుంది. గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో నిర్వహించే మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి దాదాపు 35 కోట్ల మంది ప్రజలు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసింది. మహాకుంభమేళా సోమవారం లాంఛనంగా ప్రారంభం కానుండగా.. దీనికి రెండు రోజుల ముందు అంటే శనివారమే 25 లక్షల మంది ప్రజలు పవిత్ర స్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు. ఇక, మహాకుంభమేళా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తరచుగా పరిశీలించిన సీఎం యోగి ఆదిత్యనాథ్.. దీనిని భారత దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. "ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు తమ సంస్కృతితో మమేకం అయ్యేందుకు ఇదొక గొప్ప అవకాశం" అని ఆయన పేర్కొన్నారు. 10 వేల ఎకరాల్లో జరిగే ఈ మేళా ఆధునికతకు, స్వచ్ఛతకు, భద్రతకు అతి పెద్ద ఉదాహరణగా నిలుస్తుందన్నారు. "ఇది కేవలం ఓ మతానికి సంబంధించిన కార్యక్రమం కాదు. సామాజిక, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక" అని అన్నారు. మహా కుంభమేళా జరిగే ప్రాంతంలో 55 పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 45 వేల మంది పోలీసులను ఈ మేళా భద్రతకు నియమించినట్టు తెలిపారు. ఆదివారం(జనవరి 12) స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రయాగ్‌రాజ్‌లో 'యువ మహాకుంభ్'ను నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన యువత, విద్యార్థులు పవిత్ర స్నానాలు ఆచరించి, వివేకానందుని స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు.



కుంభమేళాలో శ్రీవారి నమూనా ఆలయం

తిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం నుంచి మహాకుంభమేళా ప్రారంభం కానున్న నేపథ్యంలో టీటీడీ హిందూ ధర్మప్రచారంలో భాగంగా శ్రీవారి నమూనా ఆలయాన్ని అక్కడి నాగవాసుకి ఆలయ సమీపంలో ఆదివారం ప్రారంభించారు. నమూన ఆలయాన్ని ఇంజినీరింగ్ నిపుణులు, టీటీడీ సిబ్బంది శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్తరాది భక్తులకు కుంభమేళాలో శ్రీవారి వైభవాన్ని తెలియజేసేందుకు నమూనా ఆలయాన్ని టీటీడీ ఏర్పాటు చేసింది. కుంభమేళాకు వచ్చే భక్తులందరూ శ్రీవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసింది.

బండి సంజయ్‌కు యూపీ ఆహ్వానం

ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం ప్రారంభం కానున్న మహాకుంభమేళాకు రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానించింది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశం మేరకు యూపీ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి అనిల్ రాజ్ భార్ ఆదివారం హైదరాబాదులో సంజయ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

కమలగా మారిన పావెల్ జాబ్స్



వారాణసీ, జనవరి12: యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు, దివంగత స్టీవ్‌జాబ్స్ సతీమణి లారెన్ పావెల్ జాబ్స్ తన పేరును కమలగా మార్చుకున్నారు. ఆదివారం ఆమె తన గురువు, నిరంజని అఖాడాకుచెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాసానంద్ గిరి, అమెరికా సాధువు మహర్షి వ్యాసానంద్ గిరితో కలిసి.. కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. హిందువులు మాత్రమే కాశీ విశ్వనాథుడిని స్పృశించాలనే ఆనవాయితీ ఉన్న నేపథ్యంలో కైలాసానంద్‌గిరి.. ఆమెకు తన గోత్రాన్ని ఇచ్చి, కుమార్తెగా ప్రకటిస్తూ..'కమల'అని నామకరణం చేశారు. ఆమె ప్రయాగ్‌రాజ్‌లో మంగళవారం కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

నా భార్యకు నన్ను చూస్తూ ఉండడం ఇష్టం!

- 'సీరమ్' సీఈవో పూనావాలా వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 12: ఉద్యోగులు వారానికి ఎన్ని గంటలు పనిచేయాలనే అంశంపై తాజాగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా స్పందించారు. పనికి, జీవితానికి మధ్య సమతుల్యత ఉండాలన్న ఆయన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ వ్యాఖ్యలను పరోక్షంగా విమర్శించారు. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఎక్కువ పనిగంటల విధానాన్ని వ్యతిరేకించారు. ఎన్ని గంటలు పనిచేశామన్నది కాదని.. ఎంత నాణ్యతతో చేశామనేది చూడాలన్నారు. 'నిజమే (ఆనంద్ మహీంద్రా), నా భార్య కూడా నేను అద్భుతమైన వ్యక్తిని అనుకుంటుంది. ఆదివారాలు నన్ను చూస్తూ ఉండటమే తనకు ఇష్టం' అని 'ఎక్స్' వేదికగా స్పందించారు. అంతకుముందు ఆనంద్ మహీంద్రా ఇదే అంశంపై వ్యాఖ్యానిస్తూ 48, 70 లేదా 90.. ఇలా ఎన్ని గంటలు పని చేశామన్నది ముఖ్యం కాదని, ఉత్పాదకతే ప్రధానమని అభిప్రాయపడ్డారు. "నా భార్య అద్భుతమైన వ్యక్తి. ఆమెను చూస్తూ ఉండటం నాకెంతో ఇష్టం" అని ఆయన పేర్కొన్నారు. వీరిలా స్పందించడానికి ఎల్ అండ్ టీ ఛైర్మన్ వ్యాఖ్యలే కారణం. 'ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతసేపు అలా మీ భార్యను చూస్తారు? భార్యలు మాత్రం ఎంతసేపు భర్తలను చూస్తూ ఉండగలరు? ఆఫీసుకు వెళ్లి పనిచేయండి' అని ఆయన వ్యాఖ్యానించారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే వారానికి 90గంటలు పనిచేయాలని సూచించారు. సుబ్రమణ్యన్ వ్యాఖ్యలపై పలువురి నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

యూపీలో హెల్మెట్ లేదంటే పెట్రోలూ లేదు!

లఖ్‌నవూ, జనవరి 12: ద్విచక్రవాహన ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ రవాణా శాఖ ఆ రాష్ట్రంలోని నగరాలన్నింటిలో 'హెల్మెట్ లేకపోతే పెట్రోల్ లేదు' అనే నిబంధన అమల్లోకి తెచ్చింది. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు.. ముందు, వెనుక కూర్చున్నవారితో సహా హెల్మెట్ ధరించకపోతే పెట్రోల్ పోయవద్దని పెట్రోల్ పంపుల నిర్వాహకులకు రవాణా శాఖ కమిషనర్ బ్రజేష్ నారాయణ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఏటా ఉత్తర్‌ప్రదేశ్‌లో 25 నుంచి 26వేల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మరణాలను నివారించేందుకే హెల్మెట్ లేకపోతే పెట్రోల్ లేదనే నిబంధన అమల్లోకి తెచ్చారు.

డాకింగ్‌కు మూడు మీటర్ల చేరువగా..

- ట్రయల్ రన్‌లో ఉపగ్రహాలను దగ్గరకు చేర్చిన ఇస్రో

బెంగళూరు, జనవరి 12: అంతరిక్షంలో అనుసంధానం కోసం ప్రయోగించిన స్పేడెక్స్ మిషన్‌లో అత్యంత కీలకమైన డాకింగ్ కోసం ఇస్రో ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించింది. ట్రయల్ రన్‌లో భాగంగా వాటి మధ్య దూరాన్ని 3 మీటర్లకు తగ్గించి.. అనంతరం వెనక్కు తరలించినట్టు ఇస్రో ఆదివారం వెల్లడించింది. "ట్రయల్‌లో భాగంగా ఉపగ్రహాల మధ్య దూరాన్ని 3 మీటర్లకు తీసుకొచ్చాం. ఆ తర్వాత ఉపగ్రహాన్ని సురక్షిత దూరానికి తరలించాం. ఈ డేటాను మరింత విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతాం" అని ఇస్రో ఎక్స్‌లో పేర్కొంది. ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే రెండు ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా గత నెల30న ఇస్రో భూకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహాలను ఈ నెల 7, 9వ తేదీల్లో అనుసంధానం చేయాలని నిర్ణయించినప్పటికీ.. అనివార్య కారణాల వల్ల ఈ ప్రక్రియ వాయిదా పడింది.

మూడు ఆవుల పొదుగులు కోసిన దుండగులు

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధి చామరాజపేట పరిధి వినాయకనగర్‌లో మూడు పాడి ఆవుల పొదుగులను శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కోసేసి అమానవీయంగా ప్రవర్తించారు. రాత్రంతా రక్తపు మడుగులోనే మూగజీవాలు విలవిల్లాడాయి. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి వెంటనే ఆవులను స్థానిక పశువైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పాడిఆవుల పొదుగులు కోయడంపై హిందూసంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కాగా ఆవులను హింసించడం నేర ప్రవృత్తి అని, తప్పు చేసినవారిని శిక్షిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ ఐదుగురు నక్సల్స్ మృతి

చర్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మరోమారు తుపాకీ గర్జించింది. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు నక్సల్స్ మృతిచెందారు. వీరిలో ఇద్దరు మహిళలున్నాయి. శనివారం నేషనల్ పార్క్ సమీపంలో మావోయిస్టులు సమావేశమైనట్లు భద్రతాబలగాలకు ఉప్పందింది. దీంతో.. డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఆదివారం ఉదయం మావోయిస్టులు తారసపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని చెప్పారు. కాగా.. ఆదివారం నారాయణ్‌పూర్ జిల్లా గుమ్‌చూర్ కొండల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 15 బాణం బాంబులు, వైర్లు, ప్రెషర్‌కుక్కర్లు, రేడియోలు, ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సుక్మా జిల్లా తిమ్మాపురంలో ఐఈడీ పేలి 11 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి.

పాకిస్థాన్‌లో 33 టన్నుల బంగారం నిక్షేపాలు!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసింది. సింధు నది, హిమాలయాల దిగువన టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువగా ఉంటాయి. ఆ చర్యల వల్లే అక్కడ బంగారం అణువులు ఏర్పడుతుంటాయి. ఆ అణువులు సింధు నది ప్రవాహం ద్వారా పాక్‌లోని పరీవాహక ప్రాంతంలో వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాక్‌కు ఇక మంచిరోజులు వచ్చినట్టేనని నిపుణులు చెబుతున్నారు. సింధు నదిలో 32 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న బంగారం నిల్వలను వెలికితీసేందుకు చర్యలు చేపట్టనున్నామని పంజాబ్ ప్రావిన్స్ గనుల శాఖ మంత్రి ఇబ్రహీం హసన్ మురాద్ తెలిపారు. పంజాబ్ ప్రావిన్స్, ఖైబర్ ఫంఖ్తున్వా ప్రావిన్స్‌తో పాటు పెషావర్ బేసిన్, మర్దాన్ బేసిన్ ప్రాంతాల్లో బంగారు నిల్వలున్నట్లు గుర్తించామన్నారు.

అగ్ర రాజ్యం.. అసాధ్యం కాదు

మన యువత సామర్థ్యాలతో కచ్చితంగా ఎదుగుతాం: మోదీ

- స్వామి వివేకానందకు నివాళులు



న్యూఢిల్లీ, జనవరి 12: భారతీయ యువత శక్తిసామర్థ్యాలతో కచ్చితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మన దేశం అగ్రరాజ్యంగా అభివృద్ధి చెందడం కష్టమని కొందరు అంటుంటారని.. కానీ అసాధ్యమైతే కాదని తేల్చిచెప్పారు. 'వికసిత్ భారత్' స్ఫూర్తితో ప్రతి అడుగు, విధానం, నిర్ణయం తీసుకుంటే.. భారత్‌ను ఎవరూ ఆపలేరని తెలిపారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఆదివారమిక్కడ నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో.. దేశం నలుమూలల నుంచీ వచ్చిన 'వికసిత్ భారత్ యువ నేతల చర్చ'ను ఆయన ప్రారంభించారు. ఏ దేశమైనా ముందుకు సాగడానికి భారీ లక్ష్యాలు పెట్టుకోవాలని, భారత్ ఇప్పుడదే చేస్తోందని ఈ సందర్భంగా అన్నారు. వివిధ రంగాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే చేరుకుంటున్నామని చెప్పారు. "1930ల్లో దారుణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి అమెరికా అగ్రరాజ్యంగా మారింది. కనీస మౌలిక వసతులు కూడా లేని వెనుకబడిన దేశంగా ఉన్న సింగపూర్ ప్రఖ్యాత ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది. భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని చిత్తశుద్ధితో వాటిని నెరవేర్చుకునేందుకు కృషిచేయాలని ఈ రెండు ఉదాహరణలు నొక్కిచెబుతున్నాయి. బహిరంగ మలవిసర్జన రహిత దేశంగా మారాం. కొవిడ్ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేశాం. ప్రజలందరికీ అందించాం. వచ్చే దశాబ్దంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నాం. ఈ దిశగా పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాం. వచ్చే దశాబ్దంలో మన ఎకానమీ రూ.10 లక్షల కోట్లకు చేరుతుంది. 2047 వరకు ఈ పాతికేళ్లు మన దేశానికి స్వర్ణయుగం (అమృత కాలం). మన యువత వికసిత్ భారత్ కల నెరవేరుస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది' అని మోదీ తెలిపారు. యువతరంపై స్వామి వివేకానందకు చాలా నమ్మకం ఉండేదని, తనకు కూడా అలాంటి నమ్మకం ఉందని అన్నారు. వివేకానందుడికి నివాళులర్పించారు.

గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు

ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా ఇండొనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో హాజరుకానున్నారు. భారత్ నుంచి ఇండొనేషియా బ్రహ్మోస్ క్షిపణలు కొనుగోలు చేయనుందనే కథనాల నడుమ సుబియాంతో పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఒప్పందం విలువ 450 మిలియన్ డాలర్లుగా ఉండే అవకాశం ఉందని రక్షణశాఖ వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు.

క్యాట్స్ వారియర్ డ్రోన్ ఇంజన్ గ్రౌండ్ టెస్ట్ సక్సెస్

న్యూఢిల్లీ, జనవరి 12: హాలీవుడ్ సినిమాల్లో.. గ్రహాంతరవాసులకు చెందిన మదర్‌షిప్ ఒకటి ఆకాశంలో ఎక్కడో ఉంటుంది! దాని ఆదేశాలకు అనుగుణంగా అప్పుడప్పుడూ రకరకాల డ్రోన్లు/విమానాల్లాంటివి బయటికి వచ్చి దాడులు చేస్తుంటాయి! అలాంటి వ్యవస్థ మన వైమానిక దళానికి కూడా అందుబాటులో ఉంటే? సరిహద్దులకు ఈవలే ఒక మదర్‌షిప్‌లాంటి విమానంలో మన సైనికులు కూర్చుని.. శత్రుదేశంలోకి మానవరహిత డ్రోన్లను పంపి, వాటి ద్వారా క్షిపణులను, చిన్నపాటి డ్రోన్ల గుంపులను పంపి లక్ష్యాలను ఛేదిస్తే? అద్భుతమైన ఆలోచన కదా! ఆ ఆలోచనతోనే.. 'కంబాట్ ఎయిర్ టీమింగ్ సిస్టమ్ (క్యాట్స్)' ప్రాజెక్టును చేపట్టిన హెచ్ఏఎల్ సంస్థ ఒక కీలక మైలురాయిని అధిగమించినట్టు 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. క్యాట్స్‌లో అత్యంత కీలకమైన.. మానవ రహిత గైడెడ్ విమానం 'వారియర్ డ్రోన్' ఇంజన్ గ్రౌండ్ టెస్టును విజయవంతంగా నిర్వహించినట్టు వెల్లడించింది. భారత వైమానిక దళం వద్ద ప్రస్తుతం ఉన్న తేజస్, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ), ట్విన్ ఇంజన్ డెక్ బేస్డ్ ఫైటర్, సుఖోయ్ 30 ఎంకేఐ, జాగ్వార్ వంటి విమానాలకు ఈ వారియర్ డ్రోన్‌లను అనుసంధానం చేసి, వాటి ద్వారా నియంత్రించవచ్చు. ఈ డ్రోన్ల కంబాట్ రేడియస్ 350 కిలోమీటర్లు (డ్రోన్ లేదా విమానం ఒక మిషన్ నిమిత్తం ఎంత దూరం వెళ్లి మళ్లీ సురక్షితంగా తిరిగి రాగలదో ఆ దూరాన్ని కంబాట్ రేడియస్ అంటారు). క్షేమంగా తిరిగిరావక్కర్లేదనుకుంటే ఈ డ్రోన్లు 800 కిలోమీటర్ల దూరానికి కూడా వెళ్లి తమకు నిర్దేశించిన ఆపరేషన్లు చేపట్టగలవు.

హాలీవుడ్ ప్రముఖులపై ప్రజాగ్రహ జ్వాల

జనవరి 8న పసిఫిక్ పాలిసేడ్స్‌లో నివాస సముదాయాలు | జనవరి 9న కార్చిచ్చులో బుగ్గి అయిన ఇళ్లు





(మొదటి పేజీ తరువాయి)

లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలో మొదలైన 'పాలిసేడ్స్ వైల్డ్‌ఫైర్' పెను విధ్వంసం సృష్టిస్తోంది. ఆ మంటలను ఆర్పడానికి అగ్నిమాపక దళాలు శక్తికి మించి చెమటోడుస్తున్నాయి. కానీ... నీటి కొరత కారణంగా ఫైర్ హైడ్రంట్స్ పనిచేయకపోవడంతో మంటలు అదుపులోకి రావట్లేదు. దీంతో ఈ ముప్పు నుంచి తమ ఇళ్లను కాపాడుకోవడానికి.. హాలీవుడ్ ప్రముఖులు, విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టే అపర కుబేరులు ప్రైవేటు ఫైర్‌ఫైటర్లకు గంటకు రూ.1.72లక్షలు.. అంటే రోజుకు దాదాపు రూ.40లక్షలు కూడా చెల్లించడానికి సిద్ధం అవుతున్నారు. దీంతో ఆయా ప్రముఖులపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోంది. అసలు ఈ పరిస్థితికి కారణం వారేనని సామాన్యులు మండిపడుతున్నారు. ఆ కథేంటంటే.. వరుసగా మూడేళ్లుగా ఎన్నడూ లేనంత నీటి కరువు నమోదవడంతో.. అక్కడి అధికారులు 2022లో నీటి సంరక్షణ నిమిత్తం కఠిన నిబంధనలు పెట్టారు. వాటిలో ముఖ్యమైనది.. ఇంటి చుట్టూ ఉండే పచ్చికకు, మొక్కలకు వారానికి రెండుసార్లు.. అదీ ఒక్కోతడవకూ 8 నిమిషాల చొప్పున మాత్రమే నీరు పెట్టాలనే నిబంధన. దాన్ని ఉల్లంఘించినవారికి భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కానీ హాలీవుడ్ సెలబ్రిటీల్లో ఒకరైన కిమ్ కర్దాషియన్ తన ఇంటి తోటకు వాడాల్సిన దానికన్నా అదనంగా 8 లక్షల లీటర్లకు పైగా నీటిని వాడారు. కిమ్ కర్దాషియన్ మాత్రమే కాదు.. లాస్ ఏంజెలెస్‌లో నివసించే సిల్వెస్టర్ స్టాలోన్, ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్, పారిస్ హిల్టన్, బిల్లీ క్రిస్టల్, ఆంథోనీ హాప్కిన్స్, మెల్ గిబ్సన్, తదితర సెలబ్రిటీలు, సంపన్నులందరిదీ అదే పద్ధతి అని సమాచారం!! నీటి కొరతతో తాము తీవ్రంగా ఇబ్బంది పడుతుంటే.. ఈ సెలబ్రిటీలు అంత విచ్చలవిడిగా నీటిని వాడేయడంపై సామాన్యుల్లో చాలాకాలంగా ఆగ్రహం ఉంది. "ఒకవైపు లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతుంటే.. ప్రాణాలు కాపాడే నీటివనరులను 'కేవలం' మీ విలాసవంతమైన భవనాలను కాపాడుకోవడానికి మళ్లించాలని అనుకుంటున్నారన్నమాట" అని దుయ్యబడుతున్నారు.

మరింత ముప్పు..

క్యాలిఫోర్నియాను వణికిస్తున్న పాలిసేడ్స్, ఈటన్ కార్చిచ్చుల కారణంగా ఇప్పటిదాకా 16 మంది మరణించగా.. 12,300 ఇళ్లు, వ్యాపార నిర్మాణాలు తగలబడిపోయాయి. మరో 57 వేల నిర్మాణాలకు దావాగ్ని ముప్పు పొంచి ఉంది. దాదాపు 35 వేల ఇళ్లు/వ్యాపారసముదాయాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. పాలిసేడ్స్ దావానలం 23,707 ఎకరాల అడవిని దహించగా.. ఈటన్ కార్చిచ్చు కారణంగా 14,117 ఎకరాల అటవీప్రాంతం తగలబడిపోయింది. ఆ ప్రాంతాల్లోని రెండు లక్షల మందిని వేరే ప్రాంతాలకు తరలించారు. మరో లక్షన్నర మంది తరలింపునకు ఆదేశాలిచ్చారు. అగ్నిమాపక దళాలు ఎంతగా ప్రయత్నించినా ఇప్పటిదాకా పాలిసేడ్స్‌లో 11%, ఈటన్‌లో 27% మంటలను అదుపులోకి తేగలిగారు. పరిస్థితి ఇలా ఉండగా.. ఆ ప్రాంతంలో బలమైన 'శాంటా అనా గాలులు' మరోసారి వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు చేసిన ప్రకటన ప్రజల్లో ఆందోళన పెంచింది. క్యాలిఫోర్నియా గవర్నర్ గవిన్ ఈ దావానలాలను అమెరికా చరిత్రలోనే అత్యంత ఘోరమైన ప్రకృతి ఉత్పాతాలుగా అభివర్ణించారు. పాలిసేడ్స్, ఈటన్‌లో కార్చిచ్చు అదుపులోకి రానప్పటికీ.. కెన్నెత్‌లో పూర్తిగా, హర్స్ట్‌లో 89% మేర మంటలు అదుపులోకి రావడం ఊరట కలిగించే విషయం. హర్స్ట్‌లో కూడా దావానలం చల్లారితే.. రెండుచోట్ల నుంచీ కలిపి 14 వేల మంది ఫైర్‌ఫైటర్లను పాలిసేడ్స్, ఈటన్‌కు తరలించే అవకాశం అధికారులకు కలుగుతుంది.

గతంలో ఎంబీబీఎస్ చేసిన వైద్యులు గర్భసంచి, ఉండూకం, హైడ్రోసిల్, హెర్నియా, పైల్స్ లాంటి వాటికి శస్త్రచికిత్సలు చేసేవారు. కానీ, నేటి తరం ఎంబీబీఎస్ వైద్యులకు కత్తిపట్టాలంటే చేతులు వణుకుతున్నాయి. పీజీ చేసినవారిదీ అదే పరిస్థితి! ఇదంతా అర కొర చదువుల ఫలితమే. ఈ పాపం ఎన్ఎంసీదేనని వైద్య నిపుణులు ఆరోపిస్తున్నారు.

భూపాలపల్లి వైద్య కళాశాలలో 27 మంది ప్రొఫెసర్లకు గాను 9 మంది, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను 11 మంది, 56 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 30 మంది ఉన్నారు. రెండో ఏడాది విద్యార్థులకు ల్యాబ్ లేదు. ఇక లైబ్రరీలో పూర్తి స్థాయిలో పుస్తకాలు అందుబాటులో లేవు.



కరీంనగర్‌లో గోదామ్‌లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ

గురువుల్లేని కళాశాలలు


సర్జరీ చేయలేని డాక్టర్లు!


ఖమ్మంలో పునాదుల దశలోనే ఉన్న మెడికల్ కాలేజీ భవనం

(మొదటిపేజీ తరువాయి)

వైద్యులను తీర్చిదిద్దే మెడికల్ కళాశాలల్లో పరిస్థితులు దైవాధీనంగా మారాయి! అరకొర వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది కొరత, నాణ్యత లేని చదువుతో.. పరీక్షలు పాసై, పట్టాలు పుచ్చుకొని బయటకు వస్తున్న వైద్యులకు కనీస పరిజ్ఞానం లేని పరిస్థితులు నెలకొంటున్నాయి! ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగానే.. ఇటీవలి కాలంలో వైద్యవిద్య కళాశాలలనూ ఏర్పాటు చేసేస్తున్నారు. కొత్త కాలేజీలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తుండడంతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో 'జనాభా-వైద్యుల' నిష్పత్తికి మించి డాక్టర్లు ఉన్నారు!! ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు ప్రతి 1000 మందికి జనాభాకు ఒక వైద్యుడు ఉండాలి. కానీ, తెలుగు రాష్ట్రాల్లో ప్రతి 681 మందికే ఓ వైద్యుడు ఉండడం విశేషం!!

ప్రభుత్వాలు మెడికల్ కాలేజీల ఏర్పాటుపై చూపుతున్న శ్రద్ధ.. వాటిలో నాణ్యమైన విద్యను అందించడంపై మాత్రం చూపడం లేదు. ఫలితంగా ఆయా కళాశాలల్లో చదివిన వైద్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. రేకుల షెడ్లు, గోడౌన్లలో మెడికల్ కాలేజీలు నడుస్తున్నాయి. మృతదేహాలను కోయకుండా, విషయ పరిజ్ఞానం లేకుండానే డాక్టర్లు అయిపోతున్నారు! ఎంబీబీఎస్ చదివినా.. సాధారణ శస్త్రచికిత్సలు కూడా చేయలేకపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు తగినట్లుగా అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు ఉండడం లేదు. అడ్డగోలుగా ఏర్పాటైన కాలేజీల్లో రోగులు, విద్యార్థులు ఉంటున్నారు తప్ప.. వారికి విద్యాబుద్ధులు నేర్పే గురువులు ఉండడం లేదు. పెద్ద సంఖ్యలో ఏర్పాటైన కాలేజీల కారణంగా ఏటా వేల సంఖ్యలో మెడికోలు బయటకు వచ్చి, నిరుద్యోగులుగా మారుతున్నారు. కొంత మందికి అవకాశాలు దక్కినా.. వేతనాలు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. నాణ్యమైన బోధన లేకుండా వైద్య పట్టాలు పుచ్చుకొని వృత్తిలోకి అడుగుపెట్టే డాక్టర్లతో ప్రజల ప్రాణాలకూ ముప్పే! రాబోయే దశాబ్ద కాలంలో మన రాష్ట్రంలో ఇంజనీర్ల కంటే డాక్టర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వైద్య కళాశాలలపై 'ఆంధ్రజ్యోతి' కథనం.



త్వరలో ఏటా 10 వేల మంది ఎంబీబీఎస్‌లు!

తెలంగాణలో ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ప్రైవేటులో ఉన్న వాటిలో 95 శాతం అధికార, విపక్ష రాజకీయ నేతలవే. అందులో కనీస సౌకర్యాలు, అధ్యాపకులు లేకున్నా.. అడిగే నాథుడే లేరు. ఈ విషయంలో జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ)ని కూడా 'మేనేజ్' చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే దేశంలో తగినంత మంది అధ్యాపకులు ఉన్నారా? లేదా? అని చూడకుండా కేంద్రం అడ్డగోలుగా మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తోంది. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 60 కాలేజీలుండగా, 8715 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. తగినంత మంది అధ్యాపకులు లేక నాణ్యమైన వైద్య విద్య అందడం లేదు. మరి కొద్ది ఏళ్లలో మనదగ్గర ఏటా పదివేల మంది ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని బయటకు వస్తారు. వారిలో ఎంత మందికి ఉపాధి దొరుకుతుందనేది ప్రశ్నార్థకమే! మరోవైపు మనదగ్గర 2544పీజీ సీట్లే ఉన్నాయి. అంటే ఎంబీబీఎస్ పూర్తి చేసేవారిలో కేవలం 26 శాతం మందికే సీట్లు దక్కుతాయి. దాంతో రానురాను సీటు దక్కించుకునే అవకాశాలు మరింత సన్నగిల్లుతాయి.

ఖమ్మం కళాశాలలో అధ్యాపకుల కొరత ఉంది. సీట్ల సంఖ్య ఆధారంగా 170 మంది అధ్యాపకులుండాలి. 48 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు 12 మంది, 120 మంది అసిస్టెంట్లకు గాను 40 మంది ఉన్నారు. 55 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు 8 మందే ఉన్నారు. 12 మంది ఫార్మాసిస్టులకు నలుగురే ఉన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటులో 50-60% ప్రొఫెసర్ల కొరత

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత 50 నుంచి 60 శాతం వరకు ఉందని వైద్యవిద్య నిపుణులు చెబుతున్నారు. సర్కారీ కాలేజీల్లో అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో రెట్టింపు జీతం ఇచ్చి తీసుకుంటామని పదేపదే నోటిఫికేషన్లు ఇచ్చినా ఎవరూ రావడం లేదు. గత ఏడాది జూన్ నుంచి డిసెంబరు మధ్య కాలంలో సర్కారీ కాలేజీలన్నీ వరుసగా అధ్యాపకుల కోసం నోటిఫికేషన్లు ఇచ్చాయి. అయినా పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లను నియమించుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం పెరిగిన కాలేజీలకు తగ్గట్లుగా వైద్యవిద్యను బోధించే వారు పెరగకపోవడమే! ఉన్న వాటిలోనే అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉండగా.. కొత్త కాలేజీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అధ్యాపకులను ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. డీఎంఈ పరిధిలో మానవ వనరుల కొరత ఉందని ఈ ఏడాది కాగ్ ఇచ్చిన నివేదికలోనూ వెల్లడైంది. డీఎంఈలో 56 శాతం మేరకు మానవ వనరుల కొరత ఉన్నట్లు కాగ్ పేర్కొంది. ఇక ప్రైవేటులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అక్కడ అధ్యాపకులున్నారో లేరో కూడా తెలియదు.

ఆసిఫాబాద్‌లో అధ్యాపకుల కోసం ఆందోళన!

ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో అధ్యాపకులు లేకపోవడంతో అక్కడి విద్యార్థులు ఈ నెల 2న కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అధ్యాపకులు లేక కేవలం సీనియర్ రెసిడెంట్లు, ఇంటర్న్‌లతో నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతులు ప్రారంభమై మూడు నెలలు గడిచినా, ఇప్పటికీ ఒక్క మృతదేహం కూడా అందుబాటులో లేకపోవడంతో కేడవర్ డిసెక్షన్ చేయలేకపోయామని అంటున్నారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు అక్కడ మొదటి, రెండో ఏడాది తరగతులకు 198మంది అధ్యాపకులకు కేవలం ఏడుగురే పనిచేస్తున్నారంటే ఎంత కొరత ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఈ పాపం ఎన్ఎంసీదే..

వైద్యవిద్య కళాశాలల్లో ప్రమాణాలు పడిపోవడానికి ఎన్ఎంసీ ప్రధాన కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. కనీస మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో కూడా చూడకుండా ఇబ్బడిముబ్బడిగా కొత్త ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అనుమతులు మంజూరు చేసేస్తోంది. కళాశాలలు పెట్టిన తర్వాత కూడా తనిఖీలు చేయడం లేదు. గత ఏడాది దేశవ్యాప్తంగా ఒక్క మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు కాలేదంటేనే ఎన్ఎంసీ పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఏటా సీట్ల కోత, కాలేజీల గుర్తింపు రద్దులాంటివి జరిగేవి. కానీ తొలిసారి ఒక్క సీటు కూడా కోత పడకపోవడం గమనార్హం. పైగా ఎన్నడూ లేని జరిమానా విధానాన్ని ప్రవేశపెట్టింది. వైద్యవిద్యలో ప్రమాణాలు దిగజారిపోవడానికి ఎన్ఎంసీ కారణమని వైద్యనిపుణులు ఆరోపిస్తున్నారు. పలు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రోజూ కనీసం వంద మంది కూడా అవుట్ పేషెంట్లు ఉండడం లేదు. సర్జరీలు జరిగేదీ లేదు. అయినప్పటికీ ఎన్ఎంసీ వెబ్‌సైట్‌కు దొంగ లెక్కలు చూపుతున్నాయి. అలాగే పీజీలు, హౌస్ సర్జన్లతో తప్పుడు కేస్‌షీట్లు రాయిస్తున్నారు. చేయని సర్జరీలను చేసినట్లు చూపుతున్నారు. కొన్ని కాలేజీలకు అసలు రోగులే రావడం లేదు. మరికొన్ని కాలేజీలు ఎన్ఎంసీ బృందాలు తనిఖీలకు వచ్చినప్పుడు నకిలీ రోగుల్ని తీసుకొస్తున్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీలు చేసి బయటకొచ్చిన వారు మళ్లీ కార్పొరేట్ లేదా ఇతర ఆస్పత్రుల్లో చేరి మెళకువలు నేర్చుకుంటున్నారు.ఇక ప్రైవేటులో అధ్యాపకులు రావడం లేదన్నది బహిరంగ రహస్యం. కొద్దిమంది అధ్యాపకులే వస్తుంటారు. వారి బయోమెట్రిక్ హాజరు కోసం నకిలీ వేలిముద్రలు తయారుచేసి, అదే కాలేజీలోని అటెండర్ల చేత వేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

వైద్యవిద్యలో పాఠ్యపుస్తకాల కంటే ప్రాక్టికల్‌గా నేర్చుకునేదే ఎక్కువగా ఉంటుంది. అప్పుడే వైద్యవిద్యపై పట్టు లభిస్తుంది. గతంలో మెడికోలు బోధనాస్పత్రుల్లో ఎమర్జెన్సీ కేసుల్ని చూసేవారు. అలాగే రోజూ రెండు, మూడు శస్త్రచికిత్సల్లో సహాయకులుగా పనిచేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పటి మెడికోలు సర్జరీలను కూడా ఆన్‌లైన్‌లో చూసి నేర్చుకుంటున్నారు. ఇక చాలా ప్రైవేటు మెడికల్ కాలేజీలకు మృతదేహాలు దొరకని పరిస్థితి ఉంది. ప్రైవేటు కాలేజీలకు ఎమర్జెన్సీ కేసులే రావు. అటువంటి చోట చదువుకున్నవారు.. ఎమర్జెన్సీ కేసుల్ని ఎలా డీల్ చేయగలుగుతారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పీజీ గైనకాలజీ చేసిన వారు సైతం సిజేరియన్ ఆపరేషన్ చేయలేకపోతున్నారు.

నిరుద్యోగ వైద్యులు..!!

రాష్ట్రంలో ఏటికేడు నిరుద్యోగ వైద్యుల (ఎంబీఎస్) సంఖ్య పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఏకంగా 1,32,216 మంది డాక్టర్లు ఉన్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కొత్తగా 32 వేల మంది వైద్యులు రాష్ట్ర వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యులకు కేవలం రూ.25-30 వేల జీతమే ఇస్తున్నారు. ఎన్ఆర్ఐ, మేనేజ్‌మెంట్ కోటాలో రూ.కోటికి పైగా పెట్టి చదివినా.. వారి ఖర్చులకూ సంపాదించుకునే పరిస్థితి లేదు.


కామారెడ్డిలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇదీ పరిస్థితి..

నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం 5వ సంవత్సరం బోధన సాగుతోంది. ఈ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇటీవలే నూతన భవన సముదాయం, హాస్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దీనికి అనుబంధంగా 450 పడకల జనరల్ ఆస్పత్రి కొనసాగుతోంది. అయితే ఈ భవనంలోకి కళాశాలను మార్చలేదు. కాలేజీలో మొత్తం 173 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ములుగులో 20% బోధన సిబ్బంది లేరు!

ములుగు జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. సొంత భవనం లేకపోవడంతో జిల్లా ఆస్పత్రి కోసం కట్టిన భవనంలో ఏర్పాటు చేశారు. 50 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. 13 మంది ప్రొఫెసర్లు, 22 మంది అసోసియేట్, 32 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. 20% బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మహేశ్వరం కళాశాల భవనం నిర్మాణదశలోనే..

మహేశ్వరం మెడికల్ కళాశాల ఇబ్రహీంపట్నం పరిధి మంగల్‌పల్లి భారత ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతోంది. ఇక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనం తరగతుల నిర్వహణకే సరిపోతోంది. లైబ్రరీ లేదు. విద్యార్థులు, సిబ్బందికి సరిపడా మరుగుదొడ్లు లేవు. విద్యార్థులకు హాస్టల్ లేక ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్నారు.

ఈ పరిస్థితి ఇప్పటిది కాదు..

వాస్తవానికి అధ్యాపకుల లభ్యత ఆధారంగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకుంటారు. కానీ, గత ప్రభుత్వం రాజకీయ కోణంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ అంటూ వీటిని ప్రారంభించింది. 2022 నాటికి రాష్ట్రంలో 18 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో అధ్యాపకులు దొరక్క నానా ఇబ్బంది పడ్డారు. ప్రొఫెసర్ల కోసం ఆ ఏడాది వైద్య శాఖ జాతీయ స్థాయిలో 3 సార్లు నోటిఫికేషన్ ఇచ్చినా అధ్యాపకులు దొరకలేదు. దాంతో కొత్తగా ప్రారంభించాలనుకున్న మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లను అప్పటి సర్కారు తగ్గించుకుంది. 150 సీట్లు అనుకున్నచోట 100 సీట్లకే పరిమితం చేసింది. కొత్తగా మెడికల్ కాలేజీ ప్రారంభించాలంటే వాటిలోని సీట్ల ఆధారంగా ఎంతమంది అధ్యాపకులుండాలనేదానిపై ఎన్ఎంసీ స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది.

ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు కాలేజీల్లో ఉండాల్సిన అధ్యాపకులు

వైద్య సీట్లు	సంఖ్య
100	104
150	116
200	142
250	159

వీరికి అదనంగా ఒక్కో కాలేజీలో 32 మంది ట్యూటర్లు, 35 మంది సీనియర్ రెసిడెంట్లు ఉండాలి.

వైద్య కళాశాలల్లో మొత్తం 22 విభాగాలుంటే వాటిలో క్లినికల్, నాన్ క్లినికల్ ఉంటాయి. నాన్ క్లినికల్‌లో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్‌లో అధ్యాపకులు అస్సలు దొరకడం లేదు. క్లినికల్‌లో రేడియాలజీ, డెర్మటాలజీలదీ అదే పరిస్థితి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి.

నియామకాలే కాదు.. పోస్టింగూ ముఖ్యమే



కొత్త మెడికల్ కాలేజీల్లో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలి. ఎప్పటికప్పుడు పదోన్నతులు ఇవ్వాలి. భార్యాభర్తలు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలి. అధ్యాపకులు కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వాలి. గ్రామీణ ప్రాంత కాలేజీల్లో పనిచేసేవారికి అదనపు ప్రోత్సాహకాలివ్వాలి. ప్రస్తుతం అధ్యాపకులకిచ్చే వేతనాలకు శాశ్వత పద్ధతిలో ఎంపిక చేసినా తగినంత మంది రారు. అందుకే అధ్యాపకుల వేతనాలను పెంచాలి. డిమాండ్ ఉన్న సబ్జెక్టులకు ఇంకా ఎక్కువ వేతనమివ్వాలి. ప్రొఫెసర్లకు వేతనాలతో పాటు ప్రత్యేక ప్యాకేజీలు లేదా ప్రోత్సాహకాలు ఇస్తేనే దీర్ఘకాలికంగా వారు బోధనావృత్తిలో కొనసాగుతారు. అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

- డాక్టర్ నరహరి, నాగర్‌కర్నూల్ కాలేజీ, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు



నర్సంపేటలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

80% వైద్య కళాశాలల్లో కనీస ప్రమాణాలు కరువు!

న్యూఢిల్లీ, జనవరి 12: దేశంలో ప్రతి అయిదు వైద్య కళాశాలల్లో నాలుగు (80 శాతం) జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిర్దేశించిన కనీస ప్రమాణాలనైనా పాటించడం లేదు. దేశవ్యాప్తంగా సుమారు 700 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు ఉండగా.. ఎన్ఎంసీ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో అనేక కళాశాలల డొల్లతనం బయటపడుతోంది. కళాశాలల్లో మౌలిక వసతుల కొరత, అధ్యాపకుల గైర్హాజరుతో పాటు విద్యార్థులకు తగినన్ని హాస్టళ్లు లేకపోవడం, ర్యాగింగ్ వంటి సమస్యలను వారు గుర్తిస్తున్నారు. నిబంధనలు, ప్రమాణాలు పాటించని కళాశాలలకు రూ.10 లక్షల నుంచి రూ.50 వరకు జరిమానాలు విధిస్తున్నారు. రూ.కోటి వరకు జరిమానా విధించిన సందర్భాలూ ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయినా ప్రమాణాలు మెరుగుపర్చుకోని కళాశాలల్లో సీట్ల సంఖ్యపై కోత విధిస్తున్నారు.

నర్సంపేటలో 137 మందికి 87 మందే..

నర్సంపేట మెడికల్ కాలేజీలో 50 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాదే అడ్మిషన్లు మొదలయ్యాయి. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 137 మంది ఉండాల్సి ఉండగా.. కేవలం 87 మందే పనిచేస్తున్నారు. అధ్యాపకుల సంఖ్య తగినంతగా లేదు.

- వరంగల్ కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ) బోధనాస్పత్రిగా ఎంజీఎం రోగులకు సేవలు అందిస్తోంది. కళాశాలలో ప్రొఫెసర్ల కొరత లేనప్పటికీ మౌలిక సదుపాయాలు ఇబ్బందిగా ఉన్నాయి. ఎన్ఎంసీ నిబంధనలు ఉల్లంఘించారంటూ ఇటీవల రూ.12 లక్షల జరిమానా వేసింది.
- కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలను కొత్తపల్లిలోని తెలంగాణ సీడ్స్ గోదాముల్లో ఏర్పాటు చేశారు. కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రొఫెసర్ పోస్టులు 27 మంజూరు కాగా.. పది మందే ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 30కి 16 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 58కి 51 మంది ఉన్నారు.
- జోగులాంబ గద్వాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది. ఐదుగురు ప్రొఫెసర్లు, 12 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. మొదటి ఏడాదిలో 60 మందికి గాను 42 మందే ఉన్నారు. వీరిలోనూ రెగ్యులర్ 20 మంది, కాంట్రాక్టు 22 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే బోధనేతర సిబ్బందిలో 20 మంది గాను కేవలం ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. లైబ్రరీ లేదు. ఇందులో ఉన్న విద్యార్థులకు కళాశాలలోని ఓ విభాగాన్ని హాస్టల్‌గా మార్చారు. విద్యార్థినులకు కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలో హాస్టల్ ఏర్పాటు చేశారు.
- మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. ల్యాబ్ సరిగా లేదు.
- సంగారెడ్డి కాలేజీలో మంజూరైన పోస్టులు 1001 ఉంటే కేవలం 546 మందే పనిచేస్తున్నారు. 455 ఖాళీలున్నాయి.
- సిద్దిపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, 75 పీజీ సీట్లు ఉన్నాయి. వెయ్యి పడకల ఆస్పత్రి భవనం ఇంకా పూర్తి కాలేదు.
- కామారెడ్డి మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లు లేరు. 28 మందికి గాను 15 మంది, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు 16 మంది, 59 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 29 మంది ఉన్నారు. యంత్ర పరికరాలు పూర్తిస్థాయిలో లేవు. గైనిక్ వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఆస్పత్రిలో బెడ్లూ సరిపోవడం లేదు.


జగిత్యాలలో పిల్లర్ల దశలోనే ఉన్న మెడికల్ కాలేజీ భవనం

- జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 22 మంది ప్రొఫెసర్లకు గాను 12 మంది ఉన్నారు. క్లినికల్, పారా క్లినికల్ విభాగాల్లో ప్రొఫెసర్ల సంఖ్య తగినంతగా లేదు. కళాశాలకు పూర్తి స్థాయి భవనం లేదు. తాత్కాలిక భవనాల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. జనరల్ ఆస్పత్రిని పాత భవనంలో నిర్వహిస్తుండడంతో సదుపాయాలు కరువయ్యాయి.
- జనగామ మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణం కోసం రూ.190 కోట్లు మంజూరు అయ్యాయి. ఏడాది కిందట పనులు ప్రారంభమవగా, ప్రస్తుతం 50శాతం పూర్తి కాలేదు. 26 మంది ప్రొఫెసర్లకు 20 మంది, 29 మంది అసోసియేట్లకు 21 మంది, 57 మంది అసిస్టెంట్లకు 46 మంది ఉన్నారు.
- మంచిర్యాల మెడికల్ కాలేజీలో 105 పోస్టులకు 74 మంది విధుల్లో చేరారు. ఇక బోధనాస్పత్రిని అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు.
- సిరిసిల్ల కళాశాలలో 24 మంది ప్రొఫెసర్లకు గాను 8 మంది, అసోసియేట్లు 27కు గాను 12 మంది, అసిస్టెంట్లు 55కు గాను 45 మంది పని చేస్తున్నారు.
- నిర్మల్ మెడికల్ కళాశాలలో 165 మందికి గాను 70 మంది అధ్యాపకులు ఉన్నారు. 95 ఖాళీలు ఉన్నాయి. విద్యార్థుల కోసం ప్రస్తుతం హాస్టల్ భవనం నిర్మాణంలో ఉండడంతో స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో కొంత భాగాన్ని కేటాయించి వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు.
- కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో 449 మంది అధ్యాపకులకు గాను, 100 మంది పని చేస్తున్నారు. ఇంకా 349 మందిని రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో భర్తీ చేయాల్సి ఉంది. మెడికల్ కళాశాల భవన నిర్మాణం ఇంకా పూర్తికాలేదు.
- వనపర్తి మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు 14 మంది, అసోసియేట్ ప్రొఫెసర్లు 15 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 50 మంది ఉన్నారు. దాదాపు 70 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- నారాయణపేట వైద్య కళాశాలలో 97 పోస్టులకు 32 మంది విధుల్లో చేరారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఒక్క డాక్టర్ లేరు. గైనకాలజీలో కాంట్రాక్టు పద్ధతిన ఒకరిని తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా 12 కిలోమీటర్ల దూరంలో శిథిలావస్థలో జిల్లా జనరల్ ఆస్పత్రి ఉంది. అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు ఎంబీబీఎస్ విద్యార్థులు నారాయణపేటలో అద్దె భవనాల్లో హాస్టల్లో ఉంటూ నిత్యం ప్రత్యేక ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లి వస్తుంటారు.
- పెద్దపల్లి జిల్లా రామగుండంలో సిబ్బంది కొరత ఉంది. 45 మంది ప్రొఫెసర్లకు గాను 12 మంది, 45 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ముగ్గురు, 142 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 44 మంది ఉన్నారు. 55 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు గాను ఒక్కరే ఉన్నారు. 12 మంది ఫార్మాసిస్టులకు ఇద్దరు మాత్రమే ఉన్నారు.
- ఇక ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లోనూ అధ్యాపకులు, మౌలిక సదుపాయాల కొరత ఉంది. ఉస్మానియా మెడికోలకు కనీస హాస్టల్, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. గాంధీలో 250 యూజీ, 221 పీజీ సీట్లుండగా, కేవలం 60 మంది ప్రొఫెసర్లు, 199 మంది అసిస్టెంట్లు, 77 మంది అసోసియేట్లు ఉన్నారు. ఇంకా అధ్యాపకుల కొరత ఉంది. గాంధీలో సైకియాట్రిస్టు, మైక్రోబయాలజిస్టు, రేడియాలజీ విభాగంలో ప్రొఫెసర్లు లేరు.

ఏడాదిలో రైతు సంక్షేమానికి 40వేల కోట్లు

» ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులందరికీ భరోసా: తుమ్మల



నల్లగొండ టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో ఒక్క సంవత్సరం కాలంలోనే రైతు సంక్షేమం కోసం రూ.40వేల కోట్లు ఖర్చు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యేలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల మంజూరు లాంటి పథకాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ రెవెన్యూ గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించాలని సూచించారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం: సీతక్క

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన ఉద్యోగుల సర్వీస్ అంశాలు, ఇతర సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులు సచివాలయం చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్ విధానంలో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆ శాఖల మంత్రి ధనసరి అనసూయసీతక్క ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న చేపట్టే ఆన్‌లైన్ మీటింగ్‌లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుతోపాటు తాను కూడా పాల్గొనను న్నట్లు ఆమె వెల్లడించారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కృషి: దామోదర

రాంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా తెలిపారు. వర్గీకరణ అమలు కోసం ఈ నెల 19న ఇందిరాపార్కు వద్ద మేడి పాపయ్య అధ్యక్షతన మాదిగల మహాగర్జనను నిర్వహించతలపెట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో మంత్రి దామోదర సమావేశమయ్యారు. ఫిబ్రవరి నెల ఆఖరి వరకు సమస్య పరిష్కారమవుతుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాట్లాడుతూ.. వర్గీకరణపై మంత్రి హామీ ఇవ్వడంతో మాదిగల మహాగర్జనను వాయిదా వేస్తున్నామని తెలిపారు.

తెలుగు ప్రజలకు సంక్రాంతి ఎంతో ప్రత్యేకం

» ఇది రైతుల పండుగ: వెంకయ్యనాయుడు

మొయినాబాద్ రూరల్/న్యూఢిల్లీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఇది రైతుల పండుగ అని, తాను కూడా రైతు బిడ్డనేనని, అందుకే ఈ పండుగకు అధిక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వెంకయ్యనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. పాశ్చాత్య జీవనాన్ని అనుకరించడం మాని భారతీయ జీవన విధానాన్ని ఆచరించాలన్నారు. రఘోత్తంరెడ్డి రచించిన సంప్రదాయ జీవన విధానాన్ని ప్రతిబింబించే రెండు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వివేకానందుడి జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కేవీపీ పాల్గొన్నారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సోమవారం నిర్వహించనున్న సంక్రాంతి ఉత్సవాలకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు.

రాహుల్‌జీ ఇదేనా మీ 'సంవిధాన్ బచావో'?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు రాజ్యాంగం అమలు కోసం పోరాటం చేస్తానంటూ.. రాహుల్‌గాంధీ అంబేడ్కర్ రాసిన పుస్తకాన్ని పట్టుకొని తిరుగుతుంటే.. రాష్ట్రంలో ఆ పార్టీ మాత్రం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ సంవిధాన్ బచావో(రాజ్యాంగాన్ని కాపాడండి) ర్యాలీ చేస్తానంటుంటే.. ఇక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాత్రం మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని ప్రకటిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి గొప్పమార్గం ఇదేనా? రాహుల్‌జీ తెలంగాణలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? అని కేటీఆర్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు.

ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన: హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాగద్వేషాలకతీతంగా పరిపాలన సాగిస్తానని ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార పాలన తప్ప ప్రజాపాలన చేయడం లేదని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలను వంచించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా, ప్రజల దృష్టి మళ్లించేందుకు హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం వద్దే హోంమంత్రి పదవి ఉందని, ఆయనే హింసాత్మక సంఘటనలను ప్రోత్సహిస్తే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యాలయాలపై ఏనాడైనా దాడులు జరిగాయా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దాడుల సంస్కృతి మారకుంటే కేంద్రం జోక్యం చేసుకోవాలని, రాష్ట్రపతి పాలన విధించి శాంతిభద్రతలను కాపాడాలని ఆయన కోరారు.

రేవంత్ మూలాలు ఆర్ఎస్ఎస్‌లోనే: కవిత

సుభాష్‌నగర్/బాన్సువాడ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మూలాలు ఆర్ఎస్ఎస్‌లోనే ఉన్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగపూర్‌లో తబ్లిఘ్ ఏ ఇజ్తెమా ఏర్పాట్లను కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా, కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న రేవంత్‌రెడ్డి మైనారిటీల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. వారికిచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వదిలి మాజీ స్పీకర్, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు ద్రోహం చేశారని నిలదీశారు. స్వతంత్ర భారతదేశంలో ఏ నియోజకవర్గానికి మంజూరు కానీ నిధులను బాన్సువాడకు కేసీఆర్ విడుదల చేశారని ఆమె తెలిపారు.

ఇందిరమ్మ నమూనా ఇల్లు రెడీ!

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించాలని తలపెట్టింది. అందులో భాగంగా గతేడాది డిసెంబరు 13న కూసుమంచిలో మంత్రి ఈ ఇంటికి శంకుస్థాపన చేశారు. నెల రోజుల వ్యవధిలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. సుమారు 50 గజాల స్థలంలో రూ.5 లక్షల వ్యయంతో ఇంటిని నిర్మించాలని తలపెట్టగా ఇంటిస్లాబ్‌పై కంటె గోడ నిర్మాణానికి, ముందుభాగాన చిన్న వరండా నిర్మాణానికి సుమారు లక్ష అదనంగా ఖర్చయినట్లు అధికారులు తెలిపారు. సోమవారం భోగి పండుగ రోజున మంత్రి పొంగులేటి చేతులమీదుగా ఇంటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, ఖమ్మం జిల్లాలో సోమవారం ఐదుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఉదయం ఖమ్మం కలెక్టరేట్‌లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేసవన్‌కార్డుల పంపిణీపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు అనంతరం మధ్యాహ్నం 1:30గంటకు రఘునాథపాలెం మండలం మంచుకొండలో రూ.66.33కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకానికి మంత్రులు శంకుస్థాపన చేస్తారు.

'భూ భారతి' భూములకే భరోసా

» సాగు యోగ్యమైతేనే పెట్టుబడి సాయం

» రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రైతుభరోసా పథకానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనిని ఈ నెల 26 నుంచి అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. పథకానికి ఎవరు అర్హులు, ఎలా అమలు చేయనున్నామనే వివరాలు తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదై ఉండి, వ్యవసాయ యోగ్యమైన భూమికి.. దాని విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు పెట్టుబడి సాయం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులకూ సాయం అందించనుంది. ఎకరానికి ఏటా రూ.12 వేల (సీజన్‌కు రూ.6 వేల) చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. సాగుకు యోగ్యంకాని భూములు ఉంటే వాటిని 'రైతు భరోసా' జాబితా నుంచి తొలగించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. కాగా, సాంకేతికంగా ఈ పథకం అమలు బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) నిర్వహించనుంది. ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటి పరిష్కారానికి జిల్లాల కలెక్టర్లు బాధ్యులుగా ఉంటారని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియను వ్యవసాయ శాఖ పర్యవేక్షించనుంది. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించనున్నామని ఉత్తర్వులో తెలిపింది. దీని ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, రైతుకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతోపాటు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించేందుకు వీలు కల్పించవచ్చని పేర్కొంది.

ఠాణాల్లో క్యూఆర్ కోడ్‌లు

ప్రజాభిప్రాయ సేకరణకు పోలీసు శాఖ సిద్ధం

పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో ప్రారంభం



పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో క్యూఆర్ కోడ్

పేట్‌బషీరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు సేవలపై ప్రజాభిప్రాయ సేకరణకు తెలంగాణ పోలీసు శాఖ సిద్ధమైంది. ఇందులో భాగంగా పోలీసు స్టేషన్లకు వచ్చిన ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేసేందుకు క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన పోలీసు శాఖ.. ఆ సేవలను ప్రారంభించింది. క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను పోలీసు స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఈ క్యూఆర్ కోడ్ సేవలను డీజీపీ ప్రారంభించారు. కాగా, ప్రజలు తమ మొబైల్ ఫోన్ సాయంతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. తద్వారా ఓపెన్ అయిన వెబ్ పేజీలో తమ వివరాలు నమోదు చేసి ఏ విషయంపై అభిప్రాయం తెలియజేయాలని అనుకుంటున్నారో దానిని ఎంపిక చేసుకోవాలి. ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ చలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర విషయాలు.. తదితర ఐదు అంశాలలో కావాల్సిన దానిని ఎంపిక చేసుకుని ఫిర్యాదులు, అభిప్రాయాలు, పొందిన సేవలపై రేటింగ్ ఇవ్వవచ్చు.

విద్యార్థి రాజకీయాలు చారిత్రక అవసరం

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని తెలిపారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, ఆయా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పోరాటం కంటే.. ఓయూ, కేయూ విద్యార్థులు ముందుండి ఉద్యమించడం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని అన్నారు. అలాంటి విద్యార్థి రాజకీయాలను తెలంగాణలో పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని పార్టీలూ విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆదివారం తాజ్‌కృష్ణాలో జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనిక' పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో ఓవైపు జార్జిరెడ్డి, మరోవైపు సాగర్‌జీ (విద్యాసాగర్‌రావు) వంటివారు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారని తెలిపారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన భావజాలం ఉన్నవారు తక్కువగా ఉండడం, విద్యార్థి రాజకీయాల్లో చైతన్యం కోల్పోవడం వల్లనే ప్రజాప్రతినిధులు కావాలనుకుంటున్న వారు ఏ పార్టీ అయినా ఫరవాలేదని, తమకు పదవి ఉంటే చాలునని అనుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'పార్టీ ఫిరాయింపులపై నేను మాట్లాడితే బాగోదేమో' అంటూనే.. తనదైన శైలిలో పై వ్యాఖ్యలు చేశారు.

మూడో తరం కనిపించడంలేదు..

విద్యార్థి రాజకీయాల్లో మొదటి తరంలో బూర్గుల రామకృష్ణారావు, పీవీ నర్సింహారావు, మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో జైపాల్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ వంటివారు రాణిస్తే.. మూడో తరంలో ఎవరూ కనిపించడం లేదని సీఎం రేవంత్ అన్నారు. యూనివర్సిటీలు ఉనికి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని, వాటికి పూర్వవైభవం కల్పించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన విద్యాసాగర్‌రావు.. తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఐదు దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో ఎలాంటి ఆరోపణలు ఎదుర్కొనకపోవడం విద్యాసాగర్‌రావు గొప్పతనమని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరు సలహాలిచ్చినా తీసుకోవడానికి తనకు ఎలాంటి భేషజాలు లేవని, ముఖ్యంగా సాగర్‌జీ వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్‌తో పాటు బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వంటి వారు సహకరించాలని కోరారు. జల్లికట్టు సమస్య వస్తే.. తమిళనాడులో అన్ని పార్టీలూ కేంద్రంతో పోరాటం చేసి సాధించుకున్నాయని, తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా అన్ని పార్టీలు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సీహెచ్.విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేయడం, మూసీ పునరుజ్జీవం కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రపంచదేశాల్లోని ముఖ్యనగరాలకు దీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం ప్రశంసనీయమని పేర్కొన్నా రు.



రేవంత్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న విద్యాసాగర్‌రావు

ఉన్నత పదవులకు వన్నె తెచ్చిన విద్యాసాగర్‌రావు: దత్తాత్రేయ

విద్యాసాగర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసినప్పుడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనకు తానే బీ ఫాం ఇచ్చానని అన్నారు. ఎన్నో ఉన్నత పదవులకు ఆయన వన్నె తెచ్చారని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకావడం మంచి పరిణామమన్నారు. ఒడిసా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా జలాల సద్వినియోగం కోసం విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం విద్యాసాగర్‌రావు రాజీ పడకుండా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు సీఎం నివాళి

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో నివాళి అర్పించారు.



ప్రమాద అనంతరం మరో కారులో వెళ్తున్న పొంగులేటి

ఈ నెల 26 నుంచి మరో 4 పథకాలు

» 16 నుంచి గ్రామ సభలు: పొంగులేటి

హనుమకొండ టౌన్/హనుమకొండ కలెక్టరేట్, ఖమ్మం ప్రతినిధి, జనవరి12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి 4 పథకాలను ప్రారంభించనుందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికారులు ఈ నెల 16 నుంచి గ్రామాలకు వెళ్లి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉగాది నుంచి రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం ఇవ్వటానికి సన్నద్ధం చేస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు రెండు విడతలుగా రూ.12వేలు అందజేస్తామన్నారు.

పొంగులేటికి తప్పిన ప్రమాదం

వరంగల్‌లో సమీక్ష అనంతరం ఖమ్మం తిరిగి వెళ్తుండగా పొంగులేటి కారుకు ప్రమాదం వాటిల్లింది. రాత్రి 8.45గంటల సమయంలో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం-చింతపల్లి గ్రామాల మధ్యలో ఆయన ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పేలాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. అనంతరం మంత్రి తన అనుచరులు, పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో ఖమ్మంలోని తన నివాసానికి చేరుకున్నారు.

ఎలాగైనా ఊరెళ్తాం

(మొదటి పేజీ తరువాయి)

చౌటుప్పల్‌లో ట్రాఫిక్ రద్దీ



మోగిస్తున్నాయి. ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్, రైళ్లు అన్నింటిలోనూ ఈ ప్రత్యేక బాదుడు ఉంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సును బట్టి సుమారు రూ.500 నుంచి ప్రారంభమయ్యే టికెట్ ధర.. ఈ పండగ సీజన్‌లో వేలకు చేరింది. ప్రైవేట్ ట్రావెల్స్ అయితే టికెట్ ధరలను మూడింతల దాకా పెంచేశాయి. ఈ ధరలను భరించలేక కొందరు తమ ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటే.. మరికొందరు ఎలాగైనా సరే సొంతూరికి వెళ్లాలని ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. ఎలాగైనా పండగకు ఇంటికి వస్తామంటూ.. కార్లు ఉన్న వారు తమ వాహనాల్లోనే ప్రయాణమవుతుంటే మరికొందరు ద్విచక్రవాహనాలపై వెళ్లిపోతున్నారు. దూరం, ప్రమాదాన్ని లెక్క చేయకుండా బైక్‌పై రోడ్డు ఎక్కేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని స్వగ్రామాలకే కాక.. ఏపీలోని విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారు వేలల్లో ఉంటున్నారు. గత మూడు రోజుల్లో 60 వేలకు పైగా ద్విచక్రవాహనాలు ఏపీ వైపు వెళ్లాయని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిలోని కొర్లపహాడ్ టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. కార్లు ఉన్న వారు తమ వాహనంలో దూర ప్రయాణాలు చెయ్యడం సహజమే కానీ బైక్‌లపై ఇలా దూరప్రయాణాలు చేసే వారి సంఖ్య పెరగడం గమనార్హం. ఇలా, హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వె ళుతున్న ఓ వ్యక్తిని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొమరబండ వైజంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు స్వల్ప గా యాలతో బయటపడ్డాడు. మొత్తంగా గత మూడు రోజుల్లో రెండు లక్షలకు పైగా వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని టోల్‌గేట్‌ల సిబ్బంది చెబుతున్నారు. హైదరాబాద్- విజయవాడ మార్గంతోపాటు రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలను చేరుకునే ర హదారులు పండగ ప్రయాణాలతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలో మూడు రోజులుగా కొనసాగుతున్న రద్దీ ఆదివారం సాయంత్రానికి సాధారణ స్థితికి చేరింది.

హైదరాబాద్ ట్రాఫిక్‌కు బ్రేక్

ప్రతి నిత్యం ప్రజల ఉరుకులు, పరుగులతో బిజీబిజీగా ఉండే హైదరాబాద్ నగరానికి చిన్న విరామం దొరికింది. సంక్రాంతి పండగను కుటుంబసభ్యులతో జరుపుకోవాలని పెద్దసంఖ్యలో నగరవాసులు శుక్రవారం సాయంత్రం నుంచి సొంతూళ్ల బాటపట్టారు. దీంతో రాష్ట్ర రాజధాని మూడు రోజులుగా ఖాళీ అవుతోంది. వెరసి ట్రాఫి క్ టెన్షన్ నుంచి హైదరాబాదీలకు కాసింత ఉపశమనం లభించింది. కొన్ని రహదారులైతే నిర్మానుష్యంగా మారాయి.

మొదలైన ఐనవోలు మల్లన్న జాతర

ఐనవోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జానపదుల జాతరగా పేరొందిన హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ప్రారంభమైంది. మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు జాతర జరుగనుంది. భోగి, సంక్రాంతి రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు జాతరకు తరలివస్తారు.

సీఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతిని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలందరికీ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయకూలీల కుటుంబాల్లో ఈ సంక్రాంతి కొత్తవెలుగులు తెస్తుందన్నారు.

నేటి నుంచి కైట్, స్వీట్ ఫెస్టివల్

సంక్రాంతి సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మూడు రోజులు పాటు జరిగే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

కాయ్.. రాజా కాయ్!

ఏపీలో కోడి పందేలకు బరులు సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



తెలుగు లోగిళ్లు సంక్రాంతి సొబగును సంతరించుకున్నాయి. సోమవారం భోగితో ప్రారంభమయ్యే మూడు రోజుల అతి పెద్ద పండుగ అందరినీ మురిపించనుంది. ఆనంద పారవశ్యంలో ముంచెత్తనుంది. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు పెట్టపీట వేస్తూ పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటనున్నాయి. పిల్లా పాపల నుంచి యువత వరకు ఈ సంబరాల్లో మునిగితేలనున్నారు. ఇదేసమయంలో సంక్రాంతి సంబరాల్లో భాగమైపోయిన కోడి పందేలు కూడా భారీ ఎత్తున జరగనున్నాయి. వీటితోపాటు గుండాట, లోనబయట, పేకాటలు కూడా పందెంరాయుళ్లను ఖుషీ చేయనున్నాయి. మందు-విందు-చిందుల వంటి ప్రత్యేక ఏర్పాట్లతో కోస్తా సహా పలు జిల్లాల్లో కోడి పందేల బరులు ఈ దఫా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. చిత్రం ఏంటంటే.. ఈ 'సంస్కృతి'లో తరతమ భేదాలు కానీ, రాజకీయ విభేదాలు కానీ కనిపించకుండా అందరూ చేతులు కలపడమే!!

ఉమ్మడి కృష్ణాలో..

ఏపీలోని ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈసారి భారీగా కోడిపందేలు జరగనున్నాయి. కృష్ణా జిల్లాలోని అంపాపురం బరిని రూ.3 కోట్లకు ఓ పార్టీ నాయకులు కొనుగోలు చేశారు. ఈ మొత్తాన్ని రాబట్టుకునేందుకు ఇక్కడ కోడిపందేలతో పాటు పేకాట, గుండాట, కోత ముక్కాట, లోనబయట నిర్వహించడానికి రంగం సిద్ధం చేశారు. మద్యం విక్రయాలకు ప్రత్యేకంగా ఒక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాలోని అంబాపురం, జక్కంపూడిలోని పాములకాల్వ ప్రాం తాల్లో బరులను ఏర్పాటు చేయడాని కి ఇద్దరు ప్రజాప్రతినిధుల అనుచరులు సిద్ధమయ్యారు. తెలంగాణకు సరిహద్దు గ్రామాలు గా ఉన్న గరికపాడు, బూదవాడ, తొర్రగుంటపాలెం, తిరుమలగిరి, జగ్గయ్యపేటలో బరు లు సిద్ధం చేశారు. పెనుగంచిప్రోలు, కంచికచర్లలో హైటెక్ జూదం నిర్వహించడానికి ఏర్పా ట్లు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. విజయవాడ నడిబొడ్డున ఉండే రామవరప్పాడులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నివాసం ఉండే ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీ చెంతనే ఓ ప్రజాప్రతినిధి అనుచరులు కోడిపందేల బరులు ఏర్పా టు చేశారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలకు పరిమితమైన బరులు ఈసారి విజయవాడ నగరంలోకి కూడా అడుగుపెట్టడం గమనార్హం.

108 రకాలతో అల్లుడిగారికి ఆత్మీయ విందు



కొత్తగా పెళ్లైన జంటలకు సంక్రాంతి అంటేనే సందడి. అత్తారింటికి వచ్చిన అల్లుడికి జరిగే మర్యాదలకు లోటే ఉండదు. సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాది గ్రామ మాజీ సర్పంచ్ మంగ రాములు తమ కుమార్తెకు, అలాగే సినీ నటుడు ఏడిది రాజా తమ కుమార్తెకు ఇటీవల పెళ్లిళ్లు చేశారు. అయితే, పండగకు ఇంటికొచ్చిన తమ అల్లుళ్లకు వీరిద్దరూ కలిసి సంగారెడ్డిలోని మంగరాములు ఇంట్లో 108 రకాల వంటకాలతో ఆదివారం మధ్యాహ్నం విందు ఇచ్చి తమ మర్యాదల రుచి చూపించారు

\- సంగారెడ్డి రూరల్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.